
ఆంధ్రపత్రిక సచిత్రవారపత్రిక



25 నయాపైసలు

18-6-'58

ANDHRA PATRIKA
ILLUSTRATED WEEKLY



అర్జున తపస్సు (మహాబలిపుర శిల్పం)

ఫొటో: ఎం. శ్రీనివాసన్, మద్రాసు

సంవత్సర చందా
రు. 13-0-0
విడిపత్రిక 25 న.పై

ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక

సంపుటము 52
సంచిక 43
18-6-58

Founder : K. NAGESWARA RAO

విలంబి ఆషాఢ శుద్ధ ప్రథమ బుధవారం

★ విషయానుక్రమణిక ★

ముఖచిత్రం :

హిందీనటి నిరూపరాయ్

నల్లబంగారం లిగ్నైట్!



చిత్రంలో వ్రేళ్లమధ్య పట్టుకొని చూపుతున్నదే కొత్తగా ఏర్పాటుచేసిన బ్రికెట్ యంత్రంలో తయారైన పిడక. రంగులో, ఆకారంలో, పరిమాణంలో ఇది మామూలు పిడకమాదిరిగానే వుంటుంది.

నెవేలి లిగ్నైట్ కర్మాగారంలో ఇటీవలనే లిగ్నయిట్ నుంచి పిడకలు తయారుచేసే యంత్రం నెలకొల్పారు. మదరాసు ఆర్థిక మంత్రి శ్రీ సి. సుబ్రహ్మణ్యం ఈ యంత్రానికి ప్రారంభోత్సవం జరిపారు.


మరి పదేళ్లలో దక్షిణ భారత దేశంలో ఈ నాడు అనేకుల వంట ఇళ్లలో పేడతో చేసిన పిడకలు చేస్తున్న పనినే ఈ లిగ్నైట్ పిడకలు చేయబోతున్నవి. అంతే కాదు సహజమైన ఎరువుగా పనికి వచ్చే పేడను ఇట్లా వంటచెరుకుగా కాల్చి వృథా చేయటం అప్పుడు ఉండదు. దానినంతా పొలాలకు ఎరువుగానే సద్వినియోగం చేసుకోవచ్చును. బొగ్గుకోసమని అడవులు నరికి అమూల్యమైన అటవీ సంపదను పాడుచేసుకోవలసిన అవసరంకూడా తప్పుతుంది.

నెవేలీ మద్రాసుకు 150 మైళ్ళ దూరాన దక్షిణ ఆర్కాటు జిల్లాలో ఉన్నది. ఇక్కడ భూగర్భంలో ఇంత వరకు ఈ నల్లబంగారం దాగివున్నది.

నెవేలీ లిగ్నైట్ ప్రయోజనం ఒక్క వంటింటికే పరిమితమైనది కాదు. ప్రజలకు అవసరమైన విద్యుచ్ఛక్తి ఉత్పత్తి చేసే గ్రిడ్‌కు కూడా ఇది ఇంధనంగా ఉపయోగపడుతుంది. ఇది అన్నిటికంటెకూడా చాలా పెద్ద ప్రయోజనం.

మద్రాసు రాష్ట్రంలో సంవత్సరానికి మూడున్నర, నాలుగున్నర నెలల కాలం విద్యుచ్ఛక్తికి తీవ్రమైన కొరత ఏర్పడుతుంటుంది. జల విద్యుచ్ఛక్తి ఉత్పాదన ముఖ్యంగా ఋతుపవనాల మీద ఆధారపడి ఉంటుంది. బాగా వర్షాలు పడితే సరే సరి; లేకపోతే "అటకట్టు".

ఈ ప్రాంతంలో లిగ్నైట్ ఉన్నట్టు ఇంతకు ముందు చాల కాలంగా తెలిసినప్పటికీ, ఈ ఖనిజం ఏపాటిగా ఉన్నదో తెలుసుకున్నది దాదాపు 10 సంవత్సరాల క్రిందటనే. అక్కడ అనేకచోట్ల గుంటలు త్రవ్వి దీనికోసం అన్వేషణ జరిపిన ఫలితంగా 20,000 లక్షల టన్నుల లిగ్నైట్ లభ్యం



కొత్తగా స్థాపించిన యంత్రవిభాగ దృశ్యం. ఇక్కడే లిగ్నైట్ పిడకలు తయారయ్యేది

★ నల్లబంగారం లిగ్నైట్ ★

కాగలదని అంచనా వేశారు. ఇది ఇక్కడ దాదాపు 100 చదరపు మైళ్ళ ప్రాంతంలో విస్తరించి ఉన్నదని తేలింది.

లిగ్నైట్ అంటే తక్కువ రకం రాతిబొగ్గు అన్నమాట. తుమ్మ ఊట రంగులో ఉంటుంది. బరువు తక్కువ. కోట్ల సంవత్సరాల క్రితం భూమిలో పూడిపోయిన చెట్టుచేమలనుండి ఇది ఏర్పడి వుంటుంది.

ఒక ప్రదేశంలో అయిదున్నర చదరపు మైళ్ళ విస్తీర్ణంలో 2000 లక్షల టన్నుల లిగ్నైట్ గని ఉన్నది. మిగతా విస్తీర్ణంలో కంటే ఇక్కడ ఈ ఖనిజం చాల దట్టంగా ఉన్నదన్నమాట. ఇక్కడే సరిగా సంవత్సరం (1957 మేలో) క్రితం ప్రధాని నెహ్రూ ఈ గనుల త్రవ్వకానికి ప్రారంభోత్సవం చేశారు.

నెవేలీ లిగ్నైట్ నాణ్యం గలది. జర్మనీ లిగ్నైట్ కంటే కూడా ఇది మేలురకం సరుకు. అయితే గనుల త్రవ్వకం ప్రారంభించే ముందు సాంకేతికమైన ఒక అవరోధాన్ని దాటవలసి వచ్చింది. ఈ ప్రాంతంలో లిగ్నయిట్ పొరల క్రింద నీటిఊట చాలా ఊపుతో పైకి చిమ్ముకువస్తున్నది. అందువల్ల భూమిలోపల త్రవ్వకం కష్టమైపోయింది. లిగ్నైట్ పొరలు పలచబడినకొద్ది ఈ నీటిజలలు ఉధృతంగావచ్చి గనులు నీటమునిగిపోయే ప్రమాదం ఉన్నదని భయపడ్డారు. అందువల్ల మూతగని పద్ధతి (బిలంలాగా త్రవ్వకం)ని గాక, పాతర పద్ధతిని త్రవ్వకం తలపెట్టారు. అయినా వచ్చిన నీటిని తోడిపోయటానికి బ్రహ్మాండమైన నీటిపంపులనేకం ఏర్పాటు చేయవలసి వచ్చింది.

నెవేలి ప్రాంతంలో మొత్తం లిగ్నయిట్ త్రవ్వకానికి ఏటా సగటున 35 లక్షల టన్నుల చొప్పున 60 సంవత్సరాలు పడుతుంది. ప్రస్తుతం తేలికగా తీయదగిన లిగ్నైట్ త్రవ్వకానికి 75 కోట్ల రూపాయల వ్యయం అంచనాతో 5 సంవత్సరాల కార్యక్రమం తలపెట్టారు.

పాతర పద్ధతి (ఒపెన్ కట్) గనిలో పెలట్ ప్రాజెక్టుల నిమిత్తం ముడిలిగ్నయిట్ త్రవ్వకం జరుగుతున్నది. బ్రహ్మాండమైన బుల్ డోజర్ యంత్రాలు, షోవెల్ యంత్రాలు లోడరు, డంపర్లు పైమట్టి త్రవ్వి ఎత్తిపోసేపని నిత్యం చేస్తున్నవి. ఇవి రోజుకు 16 గంటలు చొప్పున పనిచేస్తుంటవి. ఈ యంత్రాలన్నిటినీ ప్రతిరోజు రాత్రి అక్కడ ఉన్న మరమ్మతుల కర్మాగారంలో శుభ్రం చేస్తుంటారు. ఈ యంత్రాలలో చాలవరకు అమెరికానుంచి 1 కోటి 5 లక్షల రూపాయలకు కొన్నారు. ప్రత్యేక తరహా గనుల త్రవ్వకం సామగ్రితో వచ్చే యేడు పనిచేయటం మొదలుపెడతారు.

లిగ్నైట్ పరిశ్రమ అవతరణతో ఒకనాడు నిర్జనంగా ఉండిన నెవేలీ ప్రాంతం ఈనాడు కళకళలాడుతున్నది. ఇక్కడ 10,000 నివాసగృహాలు, అనేక కార్యాలయాలు, మార్కెట్లు, ఆసుపత్రి వగైరాలతో చక్కని పారిశ్రామికనగరంగా తయారవుతున్నది. ప్రాచ్య భారతదేశంలో జెంషెడ్‌పూర్ వలెనే, దక్షిణ భారతంలో నెవేలి విలసిల్లనున్నదని లిగ్నయిట్ పరిశ్రమాధికారులలో ఒకరి భావన.

ఏటా ఇక్కడ త్రవ్వకం జరిగే 35 లక్షల టన్నుల లిగ్నయిట్ లోనూ 15 లక్షల టన్నులు ఇక్కడికి సమీపప్రాంతంలోనే ఏర్పాటు చేయనున్న థర్మల్ విద్యుచ్ఛక్తి ఉత్పాదక యంత్రాగారానికి కేటాయిస్తారు. ఇక్కడ 2,50,000 కిలోవాట్ల విద్యుచ్ఛక్తి ఉత్పత్తి అవుతుంది. నెవేలీ వద్ద ఒక ఎరువుల ఫ్యాక్టరీకూడా ఏర్పడనున్నది. ఈ పరిశ్రమకు 5 లక్షల టన్నుల లిగ్నైట్ పడుతుంది.

కాగా, మిగతా 15 లక్షల టన్నుల లిగ్నయిట్ ను కార్బొనైజ్డు బ్రికెట్సు (పిడకలు)గా తయారుచేస్తారు. ఇది వంట చెరుకుగా పేడ పిడకలకు, బొగ్గుకు బదులు ఉపయోగపడుతుంది.

ఈ కొత్త యంత్రంలో 5 యూనిట్లు ఉన్నవి. దీనిఖరీదు 3,00,000 డాలర్లు. ఈ యంత్రాన్ని అమెరికా, ఇండియా అమెరికా సాంకేతిక సహకార సంస్థ పరంగా ఉచితంగా ఇచ్చింది. ఈ యంత్రాన్ని అమెరికన్ యంత్రనిపుణుడు శ్రీ జాన్ ప్రిండర్ గాస్టు ఆరువారాలలో ఇక్కడ నెలకొల్పటం పూర్తిచేశారు. ఈ యంత్రాన్ని అందజేసిన సీవ్వర్ ఇంజనీరింగ్ కంపెనీ (కలరాడో, డెన్వర్, అమెరికా) సంస్థకు చెందిన మరొక ఇంజనీరు శ్రీ జాన్ కార్పెంటర్ ప్రస్తుతం నెవేలీలోనే ఉండి ఈ యంత్రం నడపటంలో రెండునెలల పాటు శిక్షణ ఇస్తున్నాడు.

—వార్కి చెరియన్.]



యంత్రస్థాపనచేసిన అమెరికన్ ఇంజనీర్ జాన్ ప్రిండర్‌గాస్ట్

రహస్యం

"ఈ ప్రపంచంలో ఏ స్త్రీ కూడా రహస్యాన్ని దాచలేదు"

"కాని మా ఆవిడమాత్రం దాచగలదు. మా వివాహం జరిగి అయిదు సంవత్సరాలు అయింది. ఆవిడకు ప్రతిరోజూ డబ్బుతో ఏమి అవసరమో ఇంతవరకు నాకు చెప్పలేదు."



ప్రజల సౌశీల్యం పెరిగే మార్గమేది?

శ్రీకృష్ణ
[ఆంధ్రపత్రిక ప్రతినిధి]

పత్రికా ప్రతినిధులతో జరిపిన ఇష్టాగోష్ఠిలో ప్రధాని నెహ్రూ అనేక విషయాలను ముచ్చటించారు. సరిహద్దులలో పాకిస్తాన్ సాగిస్తున్న కాల్పులు, ట్యునీషియా, అల్జీరియా, ద్వితీయ పంచవర్ష ప్రణాళిక, పంజాబు ముఖ్యమంత్రి గొడవ స్వంత వ్యవహారం మొదలయిన అనేక సమస్యలను ప్రధాని ప్రస్తావించారు.

అన్ని సంపదలకంటే మానవుడి సౌశీల్య సంపదే అతి అమూల్యమైనది కాబట్టి దాని అభివృద్ధికి, రక్షణకు ఎంత పెట్టుబడి పెట్టినా అందులో వృధా అయినట్లు పరిగణించవలసిందేమీ ఉండదన్నారు.

ద్వితీయ ప్రపంచ యుద్ధములో అనేక విధాల చితికిపోయిన జర్మనీ, జపాన్, రష్యా దేశాలు తమ తమ ఆర్థిక సాంఘిక వ్యవస్థలను అతి శీఘ్రగతిని పునర్నిర్మించుకో గలిగినవంటే ఆదేశాల ప్రజల సౌశీల్యమూ, కార్యదక్షతా, శ్రమశిక్షణా ఇవే ప్రధాన కారణాలన్నారు. ఈ ఉదాత్తలక్షణాలే లేకపోతే, వారంతటి మహత్తర ఫలితాలను సాధించివుండగలిగేవారు కాదని కూడా అభిప్రాయపడ్డారు.

గత చరిత్రలో నెపోలియన్ సాగించిన దండయాత్రల ఫలితంగానే జాతీయ సైనిక దళాలంటూ ప్రాదుర్భవించాయనీ, అప్పుడే నిర్బంధ సైనిక సమీకరణ ప్రారంభమైందనీ ప్రధాని వివరించారు. నిర్బంధ సైనిక సేవే ప్రజలలో క్రమశిక్షణకు దారి తీసింది. మానవుడికీ మానవుడికీ మధ్యనున్న అవరోధాలను తొలగించి వేసిందని చెపుతూ ప్రధాని నెహ్రూ ఆ గొడవను అంతటితో వదిలివేశారు.

* * *

అన్ని పెట్టుబడులలోనూ మానవుడి సౌశీల్య సంపదను పెంపొందింప చేయడానికి పెట్టే పెట్టుబడే అత్యుత్తమమైనదని చెప్పిన ప్రధాని ఇక్కడ మనదేశంలో తాను ఆ కార్యక్రమాన్ని ఏ విధంగా ఆచరణలో చూపదలిచారో వివరించలేదు. దీన్నిబట్టి ప్రధాని నెహ్రూ ప్రకటనలోని అంతరార్థాన్ని ఒకవిధంగా అవగాహన చేసుకోవచ్చు. మన ద్వితీయ ప్రణాళిక అనేక ఇక్కట్లను ఎదుర్కొంటున్నది. భారత ప్రజాబాహుళ్యంలో క్రమశిక్షణ లోపించినందువల్లనే, భారత ప్రజలు శ్రమకోర్చి పని చేయనందవల్లనే మన ప్రణాళికకు ఈ దురవస్థ పట్టిందని ప్రధాని అభిప్రాయమై వుంటుంది. జర్మనీ, జపాన్ వారితో పోల్చుకుంటే మనం అసమర్థులమని వారి ఉద్దేశమై వుంటుంది.

ప్రధాని తమగోష్ఠిలో అంచనాల సంఘం గొడవనుకూడా తీసుకువచ్చారు. అక్కడ బ్రిటన్‌లో అంచనాల సంఘమున్నది ప్రభుత్వవిధానాలను విమర్శించదనీ, ఇక్కడ మన దేశంలో ప్రభుత్వ విధానాలను ఈ సంఘం యధేచ్ఛగా విమర్శిస్తున్నదనీ అన్నారు. ఈ సంఘంచేత బ్రిటిష్ సంఘం పద్ధతిలో ఏ విధంగా పనిచేయించడమా అని ప్రభుత్వం ఆలోచిస్తున్నదనికూడా నెహ్రూ చెప్పారు.

* * *

“రాష్ట్రీయ సంకుచిత దురభిమానమన్నది ‘వైజ్ఞానిక వాతరోగం’ లాంటిది. ఎక్కడికక్కడ కీళ్లను అక్కడే స్తంభింపజేసి బాధిస్తుంది. కదల్చలేము; మెదల్చలేము. ప్రధానావయవాల మీదే దెబ్బకొట్టే పక్షవాతంలాంటిదిది; క్రమంగా మానవుడి వాక్ స్వరూపాన్నే వికృతంచేసే ఘోర వ్యాధి.”

ఇది లండన్ టైమ్స్ పత్రిక సారస్వతానుబంధంలో ప్రకటించిన ఒక వ్యాసంలోని భాగం. ఇందులోని సత్యం భారతదేశానికి నేటికి నూటపాళ్ళూ వర్తిస్తుందనే చెప్పవచ్చు. హిందీ భాషాధిపత్యానికి సాగుతున్న ఉద్యమంలో సరిగా ఇలాంటి ‘వైజ్ఞానిక వాత వ్యాధి’ చిహ్నాలే వున్నాయి. హిందీభాషా స్వరూపాన్నే ఈవ్యాధి వికృతంగా మార్చివేస్తున్నది ప్రధాని నెహ్రూ ఈ భాషా సమస్యపై ప్రకటించిన భావాలు అస్పష్టంగానూ, సందిగ్ధంగా వున్నాయి. భాషా సమస్యపై కాంగ్రెస్ చేసిన తీర్మానాన్ని అమలుజరపడమవుతుందని మాత్రమే నెహ్రూ అన్నారు.

అసలు సమస్యలో మాత్రం అస్పష్టమైన అంశమేమీ లేదు. ఇతర భాషలన్నిటిస్థానే అధికార భాషగా హిందీని అమలుచేయడానికి భారత రాజ్యాంగం అసందిగ్ధమైన ధోరణిలో కొంత వ్యవధి నిర్ణయించింది. రాజ్యాంగంలో నిర్ణయించిన గడువు ప్రకారం హిందీని మా నెత్తిన రుద్దతారా అని దక్షిణాపథం ప్రశ్నిస్తున్నది. సరిగా ఈ అంశంమీదే కాంగ్రెస్ తీర్మానం అస్పష్టంగా వున్నది.

ఐర్లండు స్వపరిపాలనోద్యమం సాగిన రోజులలో లార్డ్ కార్సన్ అనే అతడు ఐరిష్ కాథలిక్కుల పరిపాలనకు తాను తల ఒగ్గి వుండడం అసంభవమని ప్రకటించారు. సరిగా అయనమాటే నెగ్గింది. ఐర్లండు రెండు ముక్కలైంది! ఇండియా, కొరియా, వియత్నాం, పాలస్తీనాలకూ అదేగతి పట్టింది. భాషాసమస్యమీదే సింహళంలో అశాంతి ప్రజ్వలించింది. బెంగాలీల మీద ఉర్దూ భాషను బలవంతాన ప్రయోగిస్తే, అసలు పాకిస్తాన్‌నుంచే తప్పుకోవలసివస్తుందనుమా అని తూర్పు బెంగాలు హెచ్చరిక చేసింది.

★ న్యూఢిల్లీ లేఖ ★

ఇతర ప్రయోజనాలు లక్షున్నొక్కటి వున్నప్పటికీ, భాష అన్నది మానవుడి దైనందినమనుగడకు సంబంధించినటిది. ప్రాణప్రదమైనట్టిది. హిందీభాషను ఆలంబనంగా పెట్టుకొని బీహార్, ఉత్తరప్రదేశ్ ప్రబుద్ధులనేకులు భారత ప్రభుత్వంలో బోలెడన్ని ఉద్యోగాలు సంపాదించారు; మామూలు పరిస్థితులలో అయితే వీరిని ఆలించే, పాలించే నాథుడెవడూ వుండడు; వీరికిన్ని ఉద్యోగాలే వచ్చివుండేవి కావు. ఈ మేరకు హిందీ రానివారు తమ ఉద్యోగావకాశాలను కోల్పోవలసి వచ్చిందన్నమాట.

ఇందులో మరొక రహస్యంకూడా లేకపోలేదు. భారత ప్రభుత్వాధిపత్యం వహిస్తున్నది హిందీభాష మాట్లాడే పెద్దలే. అందుచేతనే వారు హిందీ వ్యతిరేకుల వాదనలను జాతివ్యతిరేక వాదనలక్రింద, దేశద్రోహవాదనలక్రింద జమకట్టివేసారు! దేశం స్వతంత్రం గాకముందు సరిగా ఇదేవిధంగా జరిగింది. పాకిస్తాన్ స్థాపనకు సమ్మతించి మన స్వాతంత్ర్యాన్ని మనం పొందుదామని రాజగోపాలాచారిగారు ప్రకటించినప్పుడు కూడా ఆయనను ఇదేవిధంగా దుయ్యబట్టారు; బలవంతాన మామీద హిందీని రుద్దవద్దని వాదిస్తున్నందుకుకూడా ఆయనను ఇదేవిధంగా విమర్శిస్తున్నారు.

*   *   *

ఒకసారి వెనుకకు పారచూస్తే, ఆనాడు రాజాజీ చేసిన వాదన ఎంతసబబైనదో బోధపడుతుంది. ఇప్పుడు ఈ భాషాసమస్యమీద కూడా రాజాజీ దృక్పథమే సరిఅయినదని ఉత్తరోత్తరా సువ్యక్తమవుతుంది.


*   *   *

భాషా సమస్యపై కాంగ్రెస్ ఆమోదించిన తీర్మానంలో ఉర్దూ ప్రసక్తి కూడా వుంది. అఖిలభారత కాంగ్రెస్ సంఘ సమావేశంలో నెహ్రూ ప్రకటించిన అభిప్రాయాలే ఈ ప్రసక్తికి కారణం.

ఉర్దూ దాదాపు ఒక వందసంవత్సరాల పాటు రాజభాషగా విలసిల్లింది. హిందీకంటె అన్ని విధాలా అభివృద్ధి చెందినభాష. అనేక అన్యభాషా పదాలను తనలో కలిపికొనుకుని సుసంపన్నమైన భాష ఉర్దూ. దానిలో పర్షియన్, అరబిక్ పదాలతోపాటు హిందీ, ఆంగ్లపదాలు కూడా కొల్లలుగా వున్నాయి. ఉత్తర హిందూస్థానంలో అసంఖ్యాకంగా వున్న ముస్లింలేగాక, అనేకమంది హిందువులు సైతం ఉర్దూలోనే మాట్లాడుతుంటారు. ఈనాటికి దేశంమొత్తం మీద హిందీ వారాపత్రికలకంటే, ఉర్దూ వార్తాపత్రికలసంఖ్య ఎక్కువ.


ఉర్దూ విషయంలో కాంగ్రెస్‌వాదులు ఆమోదించిన తీర్మానం కేవలం ప్రధాని నెహ్రూను మెప్పించడానికి చేసిందేగాని, ప్రధాని వాదనలోని అంతరార్థాన్ని గ్రహించి చేసింది కాదు.

“ఉర్దూ” అంటే వాస్తవికార్థం ‘శిబిరం” అని. ఢిల్లీలోని మొఘల్ చక్రవర్తుల సైనిక శిబిరాలలో వర్ధిల్లినభాష కాబట్టే దానికా పేరువచ్చింది. షహజహాన్‌దుర్గం సమీపంలోని జైన ఆలయానికి ఇటీవలివరకూ “ఉర్దూ ఆలయం” అన్న పేరే వుండేది. కనీసం ఢిల్లీ ప్రాంతానికైనా ఉర్దూను అధికారభాషగా పరిగణించివుంటే ఎంతైనా సబబుగా వుండేది. ★



ఏకాగ్రత!

—ఫోటో: రేకా [శ్రీరాములు, తాడికొండ]



అందని పండుకోసం ఆశించకూడదు— అనే నీతిని అడ్డం త్రిప్పి అర్థం చేసుకొని సంచరించినట్లయితే జీవితంలో ఎంతో సంతోషంగా వుండగలం అనే దానిలో ఏమీ సందేహం లేదు! మీకు నవ్వొస్తుంది! బాగా నవ్వండి! కాని నేను చెప్పేదికూడా కొంచెం ఆలోచించండి!

'ఛీ! ఛీ! ఈ పండ్లు పుల్లగా వుంటాయి! ఈ పండ్లు తింటే పళ్ళన్నీ సలుపులౌతాయి కూడా!' అని తనలో తనే తిట్టుకొంటూ, విశ్రాంతి, విరామం లేకుండా ఎగిరి ఎగిరి కాళ్ళు పీక్కుపోయిన నక్కబావగారు వెనక్కి తిరిగారుట, ఎత్తునవున్న ద్రాక్షపళ్ళు అందుకో లేక!.

అందని వసువుకోసం ఆశపడి, ఎంతో శ్రమకూ, ఎన్నో కష్టాలకూ తలవంచి బ్రహ్మాండమైన ప్రయత్నాలన్నీ చేస్తారు కొందరు. కాని అప్పటికీ అది చెతికిఅందదు! చివరకు — మనం యిన్ని పాట్లుపడ్డాకూడా ఆ వెధవ, రోగ్ ఇడియట్! పానకంలో పుడకలా అడ్డొచ్చాడు! నా ఉప్పుతిని నా యింటి వాసాలే లెక్కపెటాడు వాణ్ణి ఏం చేసినాకూడా పాపం లేదు"—అని ముందు కోపమూ, ఆ తర్వాత కళ్ళుకలగంటంతో మనస్సు బరువెక్కి బాధపడటం సాధారణంగా జరుగుతూనే వుంటుంది!

'పొరుగింటి పుల్లకూర రుచి!'—నిజమే మరి! అందుకనే అందని పండుకోసం ఆశించకుండా వుండటం కాని మర్చిపోవటం కాని సాధ్యం కాదు! దేర్ ఫోర్, ఆ వస్తువునో, ఆ వ్యక్తినో బాగా బాగా జ్ఞాపకముంచుకొని, పొందటానికి చెయ్యగలిగిన ప్రయత్నాలన్నీ చేసి చిట్టచివరకు నక్కబావగారు అనుకొన్నట్టుగా నేఅనుకొన్నట్లయితే - మనస్సు ఎంతహాయిగా వుంటుందో ఆలోచించి చూడండి! జీవితాన్ని ఎంత సంతోషంగా గడపగలుగుతారో ఆలోచించండి!

ఉదాహరణకి మోటారుకారు సంగతి ఆలోచించండి. "మనకికూడా ఒక సొంత కారువుంటే ఎంత బాగుండును!" అనే ఆశ చాలామందికి కలుగుతుంది. మరేమో అమెరికాలో సాధారణ కార్మికుడికికూడా ఒక స్వంతకారు వుంటుందిట. కాని ప్రపంచానికంతటికి ఆదర్శప్రాయమైన భారతదేశంలో నూటికి తొంభయి ఎనమండుగురికి సొంతకార్లు లేవు! అందంతా వేరేకథలెండి! చెప్పటానికి ఇది సమయం కాదు!'

'కారు కొనలేక పోతున్నామే' అని విచారిస్తూ బెంగపెట్టుకొని కూర్చుంటే యింక మీగతి అంతే! అందుకు బదులుగా అసలు సొంతకారు మనకికూడా వుంటే మన జీవితం ఎల్లా వుంటుందనే విషయమై కొంచెం ఆలోచించారంటే—మనకి కారూ వద్దు; గీరూ వద్దు—అని తప్పక సంతోషపడతారు.

మొదటి విషయం—ఊళ్లో నేవున్న మీ చుట్టాలకు మీరు కారుడ్రైవరు అయిపోతారు! మీకు సొంతానికి కారువున్నప్పుడు మీచుట్టాలు—పైగా ఊళ్లోవాళ్లు—బస్సులోనో, బండిలోనో వెళ్తారా? వాళ్లని

ఎన్. శ్రీ కృష్ణారావు

అలా పంపటం మీకుమాత్రం మర్యాదగా వుంటుందా? మర్యాదపేరుతో డ్రైవరు స్థానంలో మీరే కూర్చోవలసి వుంటుంది! కాబట్టి మీ ఊళ్లో నేవున్న మీ చుట్టాలు ఎక్కడికి వెళ్లాలన్నా "వారంటు"గ్యారంటీగా మిమ్మల్ని వెతుక్కుంటూ వచ్చేస్తుంది! దాంతో పెట్రోలుకి ఎక్స్‌ట్రా ఖర్చు! మీ శరీరానికి అలసట! అందుకు మీరు ఒప్పుకోకపోతే—'మర్యాద లేనివాడు!' అని చటుక్కున అనేస్తారు! దానిమీద బోలెడు మనస్పర్థలు!

రెండవ విషయం — మీరు ఒక్కరే కార్లో వెళుతున్నారనుకోండి. బస్సు సాప్‌లో మాత్రం మీ ముఖానికి ఏదైనా అడ్డం పెట్టుకొని, కారు డ్రైవ్ చేసుకొంటూ వెళ్లటం మీకు తప్పనిసరి. ఎందుచేతనంటే ఏ బస్సు సాప్‌లో నైనా మీస్నేహితులు ఎవరైనా సకుటుంబ సపరివార సమేతంగా ఏ సినిమాకు వెళ్లటానికో, ఎక్కడికైనా విహారానికి వెళ్లటానికో బస్సుకోసం కాచుకొనివున్న సమయంలో, మీరు ఆదారిని కారులో వెళ్లటం చూశారంటే, ఆ పరివారాన్నంతా మీ కారులో ఎక్కించుకొని ఊరమ్మట తిప్పటం మీకు తప్పదు! ఆ మర్నాడు కారుని రిపేరింగుకు 'వర్క్‌షాప్'కు పంపవలసిన "అదృష్టం" పట్టినా పట్టవచ్చు!

మూడవ విషయం — పొరుగూరునుంచి మీ బంధువులు ఎవరైనా మీ యింటికి వచ్చారనుకోండి. వాళ్లు తమ తిరుగు ప్రయాణం సాధారణంగా ఏ అర్థరాత్రి రైలుకో, తెల్లవారుజాము రైలుకో ఏర్పాటు చేసుకొంటారు! మరి మర్యాద ముఖ్యం కదా? అందుచేత అర్ధరాత్రి అయినాసరే, తెల్లవారుజాము అయినాసరే, చలిలో ఎముకలు కొంకరుపోయినాసరే, మీరే వాళ్ళని మీ కార్లో స్టేషన్‌కు తీసుకొని వెళ్ళటం మీకు తప్పదు!

ఈ విషయాన్ని ఇంకా కొంచెందూరం ఆలోచించి చూసినటయితే — ఛీ! ఛీ! వెధవకారు! లేకపోతే ఫీడాపోయిరి! అని విసుక్కొని, మీరు సంతోషంగా వుండటం కూడా గ్యారంటీ!


* * *

ఆ తర్వాత — ఇష్టం వచ్చినట్లు ఖర్చు చేయటానికి చేతినిండా డబ్బులేదే అని బాధ కొందరికి! డబ్బులేదు, డబ్బులేదు అనుకొంటూ ఏడవటంకన్నా ఆ డబ్బు వున్నట్లయితే ఎన్ని గొడవలొస్తాయో ఆలోచించినటయితే తర్వాత—మీకు వచ్చే మిత ఆదాయంతో మీరు తృప్తిపడి మీరు సుఖంగా సంతోషంగా వుండగలరనటంలో నో డౌట్!

ఏం? డబ్బుచేదా? మన్నేంచేస్తుంది ఆ డబ్బు? ఆడబ్బునే మనం ఏమైనా చేసేస్తాం! నువ్వు ఉత్తి ఫూల్‌లావున్నావే!' అని మీరు నన్ను వేళాకోళం చేస్తారేమో! చేస్తే చెయ్యండి! ఫర్వాలేదు! నాకు కోపం కూడారాదు! కాని ఒక్కమాట! ఒకసారి వెనక్కి తిరిగి ఆలోచించి — తర్వాత మీ ఇష్టం వచ్చిన విషయానికి రండి!

డబ్బు లేకపోవటంవల్ల వచ్చేలోటే జీవితంలో చాలా పెద్ద దెబ్బ అంటారు చాలామంది!

డబ్బు బాగా వున్నవాళ్ళింటికి ఎప్పు



ఒకరి వెంట ఒకరు...

—చిత్రకారుడు : ఏ. సూర్యారావు]

లోకం తీరు

డైనా ఒక రోజున వెళ్ళండి. ముందు—ఆ యింట్లోకి వెళ్ళాలంటే గేటులో వున్న ఘూర్కావాడిని 'తాజా' చేసుకోవాలా ఆ తర్వాత ఆ ఇంట్లో వుండే కాపలా కుక్కల్ని 'తాజా' చెయ్యాలి, లేకపోతే వాటి 'మజా' చూస్తారు మీరు! చివరకు ఎల్లాగో లోపలకు వెళ్ళారనుకోండి—ఆ యింటి యజమాని ఎంత ఆరోగ్యంగా వున్నాడో, తన భార్యతోనూ పిల్లలతోనూ ఖులాసాగా కాలక్షేపం చెయ్యటానికి ఆయనకు యెంత తీరుబడివుందో ముందు చూడండి! ఒక్క నిముషంకూడా తీరుబడి వుండదు! ఆయన ఏ అజీర్తితోనో, ఆస్తమాతోనో, బాధపడుతూ నిత్యమూ డాక్టర్లతో మాట్లాడుతూ వుంటాడు! ఆ డాక్టర్లతో కూడా ఎక్కువసేపు మాట్లాడేందుకు ఆయనకు తీరుబడి వుండదు. కొన్ని క్షణాలు మాత్రమే! పొద్దున్నే ఆయన యింకా నిద్ర మంచం మీదనుంచి లేవకుండానే తయారవుతారు గుంపులు గుంపులుగా—అఫీసర్లు—స్నేహితులు—సంఘ సంస్కర్తలు—మొదలైనవాళ్ళు! వాళ్ళందరితోనూ గబగబా మాట్లాడేసి వాళ్ళని పంపేసేలోపుగా, 'అర్జంటుగా రావాలి' అంటూ మూల మూలల నుంచీ లెఖ్ఖలేనన్ని 'ఫోన్ కాల్స్' వచ్చేస్తాయి! ఆ పనులన్నీ చక్కబెట్టుకొని వచ్చేసరికి బిజినెస్ వ్యవహారాలు మాట్లాడాలంటూ షేర్ హోల్డర్లు, డిస్ట్రిబ్యూటర్లు మొదలైనవాళ్లు వస్తారు. వాళ్ళని ఒకవిధంగా పంపించేసరికి, సొంత బిజినెస్, ఎడ్మినిస్ట్రేషన్ వ్యవహారాలంటూ, ఆఫీసు పనులు! అవన్నీ చక్కపెట్టుకొనే సరికి ఏ మంత్రిగారి దగ్గరనుంచో అరంట్ ఫోన్ కాల్ కో ఆపని పూర్తిచేసుకొని వచ్చేసరికి, కోర్టువ్యవహారాల విషయంలో సలహాలకోసం, తను నియమించుకొన్న లీగల్ ఎడ్వయిజరుగారు తయారవుతారు. అదంతా పూర్తయేసరికి సాయంత్రం ఏ అయిదుగంటలో అవుతుంది. వెంటనే, 5-30 గంటలకు టౌనుహాలులో ఉపన్యాసం అంటూ కారేసుకొని అక్కడికి పరిగెడతారు. అక్కణ్ణుంచి వచ్చేసరికి రాత్రి ఏ తొమ్మిదో అవుతుంది. ఆసమయంలో ఏ సినిమాతారో, ఏ నాట్యతారో 'దయచేసి ప్రదర్శనానికి తప్పక వస్తారుకదూ?' అంటూ ఫోన్ చేస్తుంది! తప్పదుగా మరి! అక్కడికి వెళ్తారు. రాత్రి ఏ రెండింటికో వచ్చి అలిసిపోయి కొంచెం నిద్రపోతారు! తెల్లవారితే మళ్ళీ అంతా యథాప్రకారమే! వేళకి తిండితినే అవకాశం కూడా ఆయనకు వుండదు! ఇంచుమించు, సంవత్సరంలో 350 రోజులు వేళకు భోజనం చేసి, నిద్రపోయేందుకు తీరుబడి వుండదు! రాత్రిళ్ళు మంచంమీద పండుకొంటాడన్నమాటేగాని ఆయనకు నిద్రపట్టదు. 'ఈ వ్యాపారంలో లక్షరూపాయలు లాభం వచ్చింది. ఈసారి ఇంకో కొత్తవ్యాపారం ఆరంభించాలి.' అనే ఆలోచనలు ఒకపక్క—ఈ లోపుగా ఇన్కమ్టాక్సువాళ్ళు ఏం గొడవచేస్తారో అనే బాధ ఇంకొకపక్క, ఈ డబ్బంతా ఏ దొంగలేనా ఎత్తుకుపోతారేమో తనని ఏంచేస్తారో అనే భయం మరొకపక్క ఏర్పడి మనశ్శాంతి అనేది వుండదు!

ఇంక ఆయింటి యజమానురాలు! ఆవిడ సంగతికూడా యించుమించు యింతే! ముఖ్యంగా తనతో సమానహోదాలో లేని వాళ్ళను తన ఇంటికి రానివ్వదు! "ఏ దాసీది ఏం పట్టుకుపోతోందో! కారు డ్రైవరు పెట్రోలు ఎంత దాచేస్తున్నాడో? రోజూ కడుపునిండా, ఇష్టంవచ్చినట్లు పిండివంటలు చేసుకుతింటే ఇంకేమైనా వుందా? మనకి ఎవడేనా దానంచేశాడా? ధర్మంచేశాడా? మనంమాత్రం దానధర్మాలు ఎందుకు చెయ్యాలి? అని విసుక్కుంటుంది ఆ స్తమానూ ఆమహాతల్లి!

ఇల్లా చెప్పాలంటే చాలా వున్నాయి కాని అవన్నీ చెప్పేందుకు యిది సమయం కాదు. అందుచేత డబ్బులేదు, డబ్బులేదు అనుకుంటూ ముక్కుతూ మూలుగుతూ ఏడవటంకన్నా, ఆడబ్బు వున్నట్లయితే జీవితం ఎల్లావుంటుందో ఆలోచించినట్లయితే—"ఛీ! ఛీ! వెధవడబ్బు. ఈడబ్బే చివరికికొంప ముంచేస్తుంది' అని అనిపిస్తుంది. ఇంక మీరు కూడా ఆ నక్కబావగారు అనుకొన్నట్లుగానే అనుకోండి. సుఖంగా, సంతోషంగా వుంటారు.

* * *

నెక్స్ట్! మనకి సొంతఇల్లు లేదుకదా అని కొంతమందికి బాధ. "అద్దె యిళ్లల్లో వున్నన్నాళ్లూ గోడలనిండా మేకులు కొట్టారుకదా, ఇప్పుడు మీయింట్లో గోడలకి ఎన్ని మేకులు కొట్టారు?" అని సొంత ఇల్లు కట్టించుకొన్నవారిని ఎవరినైనా ఒకరిని అడగండి.

ఇటువంటి ప్రశ్న ఒకటి అడగటానికి మీకు చిన్నతనంగానూ, మర్యాద తక్కువగానూ తోస్తుందేమో పోనీలెండి! మీరు ఎవరినీ ఏమీ అడగవద్దు! నాసంగతే నేను మీకు విన్నవించుకుంటాను.

ఈరోజుల్లో కోపరేటివ్ డిపార్టుమెంటు ధర్మమాఅంటూ అప్పుచేసి ఇళ్ళు కట్టించుకొనే ఆచారం ఒకటి అమలులోకి వచ్చేసిందికదా! ఆ పిచ్చిమనుష్యులవరంలో నేను కూడా ఒకణ్ణి! గోడకి మేకు కొట్టినట్లు ఇంటి యజమానికి తెలిసిందంటే చాలు, ఆయనగారు దెబ్బలాటకు సిద్ధంఅయ్యేవాడు. మా

ఆవిడమాత్రం ఆయనగారి మాటలకు దురు
సుగా జవాబిచ్చి ఆయుద్ధాన్ని అమాం
తంగా ఆపుచేసేసేది. కాని ఆయనగారి
దెబ్బలు మాత్రం మానుకొనక పోయేవి.
గోడకి ఒక మేకు కొట్టటానికి
కూడా స్వతంత్రం లేదేమి ఖర్మమా అని బాధ
పడి నానాఅవస్థలతో, అప్పుచేసి చివరకు
ఎల్లాగయితే నేమి ఒక ఇల్లు కట్టించాను! అది
నా సొంతఇల్లు! ఇంక నేను సంతోషించ
టానికి బదులు రోజూ ఏడవాల్సిన గతి
పట్టింది!

నేను అద్దెకున్న ఇంట్లో సుమారు రెండు
వందలు—ఫోటోలు, క్యాలెండర్లు,
బొమ్మలు—యిత్యాదులు, గోడలకి వేళ్లా
డేవి! కాని యిప్పుడు నేను సొంతయిల్లు
కట్టించుకొన్నాక, ఆ ఫోటోలకు, క్యాలెండ
ర్లుకు, బొమ్మలకు, చెదపురుగులకు మధ్య
మూడో ప్రపంచయుద్ధం జరుగుతోంది ఒక
మూల గదిలో! ఈ మహాయుద్ధానికి కారణం
ఏమిటంటే—"గోడలకి మేకులుకొడితే
గోడలు పాడైపోవూ?" అంటూ మా ఆవిడ
నాతో కయ్యానికి కాలుదువ్వటమే. రామ
చంద్రా! ఇటువంటి భార్యను నాకు ఎందుకు
కట్టిపడేశాడో మరి!

కొత్తయింట్లో గృహప్రవేశం జరిగిన
నాటినుంచీ, కుర్చీలు, డ్రాయరు, మంచాలు
మొదలైనవి నేలమీద యీడిస్తే గచ్చు
పాడైపోతుందని మా భార్యామణి ఒకటే
గోల! అద్దెయింట్లోవున్న రోజుల్లో మా
ఆవిడ ఎంత మంచిగా వుండేదో రాయా
లంటే—చాలావుంది!

పాతయింట్లో—అంటే అద్దెకున్న
యింట్లో నాకు ముఖ్యమైన టెలిఫోన్
నెంబర్లు, కొన్ని ముఖ్యమైన ఎడ్రసులు
మొదలైనవి, తడుముకోకుండా చటుక్కున
జ్ఞాపకంరావటంకోసం గోడలమీద రాసి
వుంచేవాడిని! కాని ఇప్పుడు కొత్తయింట్లో
అంటే సొంత ఇంట్లో, యిదివరకు మాదిరిగా
గోడలమీద ఏమైనా రాశానంటే, మా
ఆవిడ చీపురుకట్ట తిరగవేసే స్థితిలోకికూడా
వచ్చేస్తుందనే భయం కలుగుతోంది. అటు
వంటివన్నీ ఏదైనా నోట్‌బుక్‌లో రాసు
కోవాలిట! ఆ నోట్‌బుక్ ఎక్కడైనా
పోయిందనుకోండి. ఏంచెయ్యను? అడిగాను
ఇదే ప్రశ్న మా ఆవిణ్ని! చటుక్కున మూతి
ముడుచుకొని లోపలికి వెళ్ళిపోయింది! ఆహా!
ఆ పోజ్! ఫోటోతీసి పత్రికలో వేయిస్తే ఈ
కథకి ఎంత అందం వస్తుందో కదా! ఏం
చెయ్యను! దురదృష్టవశాత్తూ ఆ సమ
యంలో నా చేతిలో కెమేరా లేదు!

సొంత యిల్లు కట్టించుకున్నాక నేను పడే
బాధలు..........అమ్మయ్యో! ఒకటా!
రెండా! ఈ పాడుకొంప వెంటనే అమ్మేసి
మళ్ళీ ఆ అద్దె కొంపలోకే వెళ్ళిపోవటానికి
నిశ్చయించుకున్నాను!

సొంతయిల్లు లేనేదివుంటే, దెబ్బల్తో
దెబ్బలాడుకొన్నట్టే వుంటుంది ఆ యింటి
దంపతుల దాంపత్యం! మరి నా సంగతి
మాత్రం అల్లాగేవుంది సుమండీ! మీ సంగతి
ఏమో మరి...

నాకుమాత్రం జన్మ జన్మాలకి కూడా
సొంత యిలు వద్దనిపించేసింది! మా ఇంటిని
అమ్మేయటానికి బేరం కూడా పెట్టేశాను!
ఇప్పుడు నిజంగా నా ప్రాణం హాయిగా
వుంది!

స్నేహం అంటే కొంత మందితోనే అభి
మానంగా వుండగలం, కొంతమందితో అభి
మానంగా వుండలేమని మీరు తెలుసుకోలేక
పోబట్టే 'మన స్నేహితులు'—అని మీరు
అనుకొనే వాళ్ళంతా 'చివరకు ఇల్లా
చేశారుకదా!' అని ఒక్కొక్క సమయంలో
చాలా బాధపడతారు. నిజం చెప్పాలంటే
మీతో సమాన హోదాలోవున్న వాళ్ళ
తోటే మీరు స్నేహంగా వుండలేరనే
సంగతి మీరు ముందస్తుగా తెలుసుకోవాలి!

'ఏరోయ్! వీడికేవో పిచ్చి పట్టింది! అను



మద్రాసు-బెంగుళూరు ట్రంకురోడ్డుమీద చిత్తూరుకు 18 మైళ్ళ దూరంలో మొగిలి అనే గ్రామంలో ఈశ్వరాలయం వుంది. ఇది చాలా పురాతనమైనదని ప్రసిద్ధి. అక్కడి కోనేటి గట్టునవున్న పెదనంది నోటినుంచి ఈవిధంగా సంతతధారగా స్వచ్ఛమైన నీళ్ళు పడుతుంటాయి. ఈ నీటితోనే కోనేరు నిండుకుంటుంది. నీరు ఎక్కడనుంచి వస్తుందో తెలియదు. మహాశివరాత్రికి ఇక్కడ గొప్ప ఉత్సవం జరుగుతుంది. యాత్రికులు నందినోటినుంచి పడే ధారక్రింద స్నానమాడి దేవుణ్ణి దర్శిస్తారు.
—ఫోటో: డి. చంద్రశేఖర్, దిగువమాఘం]

★ లోకంతీరు ★

భివజ్ఞులైన మన పెద్దలంతా సమ అంతస్థులో వున్న వాళ్ళతో చేసిన స్నేహాలే శాశ్వతంగా వుంటాయని మనకు నూరిపోశారు! ఈయనగారు సమ అంతస్థు స్నేహాలే పనికి రావంటూ రాసేస్తున్నాడు! శుద్ధ క్రాక్!' అని మీరు నన్ను పరిహాసం చేస్తారేమో! తొందర పడకండి! వినండి!

ఆ పెద్దలు చెప్పినదంతా పూర్వకాలపు వ్యవహారం! ఈ నవయుగంలో-కలియుగంలోని రాకెట్ల యుగంలో—ఆ పాత నీతులు పనికిరావు! ఉదాహరణకి చెప్పాలంటే, మీ పక్కింటి వారితో నే మీరు స్నేహంగా ఉండలేరు! ఎందుచేతనంటే—వాళ్లూ, మీరూ సమ అంతస్థులోని వాళ్ళే అనుకోండి. ఒకే వీధిలో ఒకే మాదిరి ఇళ్లు కట్టించుకొన్నారనుకోండి. చూసేవాళ్ళకి ఆ రెండు ఇళ్ళలో వాళ్ళూ సమానహోదాలో వాళ్ళని తోస్తుంది. కాని మీ పక్కింటి వారికి—తమ పక్కింటి వారికన్నా తాము కొంచెం గొప్పవాళ్ళనిపించుకోవాలనేఆశ వాళ్ళని లోలోపల పీక్కుతినేస్తుంది! అందుచేత ప్రతీ చిన్న విషయాన్నీ కూడా గోరంతలు, కొండంతలుగామార్చేస్తూ మీ మనస్సును బాధపెడుతూనే వుంటారు! 'ప్రతీ చిన్నపనిలోనూకూడా మీకన్నా మేం గొప్పవాళ్ళం తెలుసా?' అన్నట్టు ఏదోఒక ఆర్భాటం చేస్తూనేవుంటారు! కొన్నిసమయాల్లో ముఖాముఖీనీ పోట్లాడటం వాళ్ళకిచిన్నతనంగా తోస్తుంది! అంతేకాకుండా వాళ్లఇల్లు మీ ఇలుకన్నా శుభ్రంగా వుందనిపించుకోవటం వాళ్ళకి ఎంతో ఇష్టం! అందుకోసం మీరు ఎవరూ చూడని సమయంచూసి వాళ్ళింట్లోవుండే చెత్తా చెదారంఅంతా జాగ్రత్తగా ఎత్తి మీ అడ్డుగోడమీదుగా మీ ఇంటిముంగిట్లో, మీ దొడ్లోనే పారపోసేసి చేతులుకడిగేసుకొంటారు! ఆ చేతులు కడుక్కొన్న నీళ్ళు కూడా మీ ఇంటిదొడ్లోకి వచ్చేటట్టే తూములు పెట్టించుకొంటారు!

మీ పక్కింటివారితో మీరు స్నేహంగా వుండటంవల్ల యింకో డేంజర్ కూడావుంది! ఇదికూడా పక్కింటావిడవల్లే వస్తుంది! మీకన్నా వాళ్ళుగొప్పవాళ్ళని చూపించేటట్లు ఆవిడగారు పొద్దున్న ఒకచీర, మధ్యాహ్నం మరోకచీర, సాయంత్రం ఇంకోచీర మార్చేస్తూ, కొత్తకొత్త నగలు పెట్టుకొంటూ (మనలో మనమాట! ఆ నగలన్నీ ఎరువునగలే అయివుంటాయిలెండి! గట్టిగా అనకండి సుమా!) తన అందాన్నీ, అలంకారాన్నీ మీరంతా ఖచ్చితంగా చూసేటట్టు తిరగటమే కాకుండా ఆదారిన పోయేవాళ్లుకూడా ఆ ఆర్భాటాన్ని చూసేందుకు ఒక 'ఛాన్స్' ఇస్తూవుంటుంది ఆవిడగారు! మీ పక్కింటావిడతో మీ ఆవిడగనక స్నేహం చేసిందంటే ఫినిష్! మీ మనీపర్సుకు శనిమహాదశ పట్టిందన్నమాటే!

* * *

తర్వాత తోడల్లుళ్లతోకూడా స్నేహంగా వుండటం సాధ్యంకాదు! మీతోడల్లుళ్ళు మీతో సమాన హోదాలో వాళ్ళే అనే భావనతో వాళ్లతో చనువుగావుండటం ఆరంభించారంటే, అంతకన్నా పొరపాటుపని మరొకటిలేదనే నేనంటాను! ఎందుచేతనంటే మూడొంతుల ముప్పాతిక వీసాలు అందుకు కారణం ఒకరు మీ మామగారు, రెండవవారు మీ అత్తగారు! అందరు అల్లుళ్ళని ఒకేరీతిగా చూడకుండా, ఒకరు ఎక్కువగా చదువుకొన్నాడనో, లేక కొంచెం పెదఉద్యోగం చేస్తున్నాడనో, లేక మరేదైనా కారణంవల్లనో ఒకళ్ళని గొప్పగానూ, మరొకళ్ళని చిన్నతనంగానూ అత్తమామలు చూడటంవల్లనే తోడల్లుళ్లల్లో తగవులాటలు తయారవుతాయి!

స్కూల్ ఫైనల్ మాత్రమే ప్యాసయి నెలకు వందరూపాయలులోపు జీతం తెచ్చుకొనే ప్రావిన్షియల్ గవర్నమెంటు యన్. జి. వోకి కట్నం వెయ్యి రూపాయలుకన్నా ఎక్కువ ఇవ్వటానికి ఏ మామగారూ ఒప్పుకోవటం లేదు! అదే చదువు చదువుకొని సెంట్రల్ గవర్నమెంటులో కమ్మర్షియల్ క్లార్కుగా పనిచేసే వ్యక్తికి కట్నంకింద అయిదువేల అయిదు వందలు! ఘోరం! పాపం శమించుగాక!

మరి ఈ మామగార్లే ఇటువంటిఘోరాలు చేస్తూంటే తోడల్లుళ్ళు దెబ్బలాడుకోవటంలో తప్పేముంది? పండగలకి ఆ అల్లుళ్లని పిలుస్తారు మావగార్లు! జరిగినది అంతా మర్చిపోయి, ఆ అలుళ్ళు అత్తవారింటికి వస్తారు. ఆ సమయంలో - మామగారు గనక ఏ అల్లుడైనా కొంచెం చిన్నచూపు చూశాడంటే, చాలు!- మరో ప్రపంచ యుద్ధం అన్నమాటే! ఆ తోడల్లుళ్ళ మధ్య నలిగిపోతారు ఆ అప్పచెల్లెళ్ళు! కాని వాళ్ళు మాత్రం తక్కువవాళ్ళనుకొంటున్నారేమిటి? అమ్మయ్యో!...ఇటువంటివిషయాల్లో వాళ్ళు చేసుకొన్నవాళ్ల భర్తలకన్నా రెండాకులు ఎక్కువే చదువుకొన్నారు! పైగా యిది భారతదేశం! ఈ దేశంలో భర్త అవమానపడుతూంటే చూసి సహించగలిగే భార్య వుందా? కళ్లు పొడుచుకు చూసినా కనిపించదు! ఆ సమయంలో వాళ్ళు విజృంభిస్తారు, తమదగ్గర వున్న అస్త్రాలు ప్రయోగిస్తూ! ఇంక ఆ యింట్లో ఒకళ్లమీదనుంచి మరొకరిమీద పడే తూటాలు, తారాజువ్వల వ్యవహారం రాయాలంటే - అబ్బో! ఎవరికి శక్యం! ఇంకోసారి ఎప్పుడైనా తీరుబడిగా రాస్తాను!

• * •

నెక్స్ట్! అన్నదమ్ములు కూడా సఖ్యతగా వుండటం సాధ్యంకాదనే నేనంటాను. ఎందుచేతనంటే వారికి సంప్రాప్తించే వారి అర్ధాంగీమణులు వారి సఖ్యతను ఆమోదించరు! కొద్దిరోజులు వారు, సఖ్యతగా వున్నా—కన్నీళ్లు కారటం తప్పదు! బాధపడటం తప్పదు! చివరకు వేరింటి కాపరాలవటం కూడా తప్పదు.

ఇంక దాంపత్యం—పూర్వకాలంలో దంపతులు చాలా అన్యోన్యంగానూ, అనురాగంగానూ, చివరకు ఆదర్శంగా ఉండేవారని చెప్పే పురాణగాథలు మనదేశంలో ఎన్నోవున్నాయి. కాని—ఇది మరి నవయుగంకదా? అందులో ప్రతిదానికీ మరీ నాగరీకం, నాజూకు నేర్చుకొన్నారాయె. అందుకని ఈ కాలంలో దంపతులు, నాగరీకంగా, నాజూగ్గా—కుక్కలూ పిల్లులూ దెబ్బలాడుకొన్నట్లు కాపరాలు చేస్తున్నారు!

* * *

ఆఖరివిషయం—ఆపదలో ఆదుకొన్నవాళ్ళే నిజమైన స్నేహితులు అనే నీతిని మీరు పూర్తిగా మర్చిపోవాల్సిందే! మరయితే స్నేహితులనే వాళ్ళు ఎందుకున్నారు? అని అడగాలనిపిస్తుంది మీకు! మీరు అడిగేదాకా నేను చెప్పకుండా వుంటానా?

'మీ యింటిముందు 'కాంపౌండు' కు ఊచలగేటు ఎందుకుంది? వచ్చేపోయే దారికోసం చిన్నద్వారమూ తలుపూ ఎందుకు పెట్టించుకోకూడదూ? ఊచల గేటే ఎందుకు పెట్టించాలి?'

అలంకారంకోసం పెట్టించాం! మా పక్కింటిఆయన ఊచలగేటు పెట్టించాడు కాబట్టి, మేముకూడా ఆయనతో సమహోదాలో వాళ్ళమే కాబట్టి మాయింటి ముందుకూడా ఒక ఊచలగేటు పెట్టించాం' అని జవాబిస్తారు మీరు!

'దట్ ఈజ్ కరెక్ట్! స్నేహితులు వుండటానికి కారణంకూడా అదే, అలంకారం కోసమే—విజయదశమినాటి బొమ్మల కొలువులో బొమ్మల మాదిరిగా స్నేహితులుంటారు! మీరు సుఖంగానూ, సంతోషంగానూ వున్న సమయంలో మీతో ఖులాసాగా కాలం గడపటం కోసమే స్నేహితులుంటారు; మీరు— ముఖ్యంగా డబ్బువిష

(56- వ పేజీ చూడండి)

సమానాంతర జీవితరేఖలు

ప్రమోముఖ విషకుంభం!

గోముఖ వ్యాఘ్రం!

తేనెపూసిన కత్తి!

మేక వన్నె పులి?....

...ఇటువంటిదా నాభార్య?...అయినా కాకపోయినా ఇలా అనాలి నేను! ఇలా అనమంటాడు మానాన్న!— అంటున్నాను కూడాను!

కేవలం తన స్వార్థంకోసం, తన సౌఖ్యం కోసం, తన ఆనందంకోసం ఇతరుల కష్ట సుఖాలను సానుభూతితో అర్థం చేసుకోనే అలవాటు లేదు మానాన్నకి!

నేనర్థం చేసుకుంటే మాత్రమేం ప్రయోజనం? స్వంతంగా ఆలోచించి ఏ సమస్యనూ ధైర్యంగా సవ్యంగా పరిష్కరించే శక్తి నాలో లేదు!—

ఇక నాతల్లి విషయం!— మతి స్థిమితం లేని మనిషది. ఆవిడకి బుద్ధి జ్ఞానం ఉంటా యనుకోడం అవివేకం!......

పోనీ ఆ కమలకు అంటే నాభార్యకన్న మాట; దానికయినా బుద్ధీ జ్ఞానం ఉండొద్దూ??

ఇంతకీ తప్పెవరిదీ అని?...

పుట్టింటికి పురిటికని వెళ్లి అప్పుడే రెండు సంవత్సరాలయింది?- పిల్లడికి మాట్లాడే వయస్సొచ్చింది. అయినాసరే రావడాని కింకా దాని కిష్టంలేదు!— మాది తగిన స్త్రీ దక్షతలేని కుటుంబ మనేవిషయం దానికి బాగా తెలుసు!— తెలిసీకూడా ఈవిధంగా ప్రవర్తిస్తే క్షమించొచ్చా?

పంపించేయమని ఎన్ని ఉత్తరాలు వ్రాసినా ఏవో కారణాలను తెలియజేస్తూ కాలక్షేపం చేస్తున్నారు కదా అని మా తమ్ముణ్ణి పంపించేను ఎలా అయినా కమలను తీసుకొచ్చేయమని! పంపించడం లేదు సరికదా అర్థం పర్థం లేకుండా మాట్లాడేరు దాని వాళ్లంతా!— మా అమ్మను మా ఇంట్లోంచి ఇంకెక్కడికయినా పంపించేస్తే కమలను పంపిస్తారట!— లేకపోతే పంపించరట!

ఎంతఘోరం!......ఇంత ఘోరమయిన కోరిక ఇంకోటేదయినా ఈ లోకంలో ఉందా అని?... నన్ను కని పెంచి పెద్దవాణ్ణి చేసిన నాతల్లిని ఈ అవసలో, ఈ వయస్సులో వాళ్ళపిల్ల సౌఖ్యం కోసమని ఎక్కడికయినా పంపించేయాలట!—

నిజమే మా అమ్మ పిచ్చిదే!...కాదనడం సాహసమే. ఆవిడ పిచ్చి చేష్టలు ఒక్కొక్కప్పుడు ప్రమాదకరంగా కూడా ఉంటాయి! విశేషం ఏమిటి అంటే తమకన్న పిల్లల్నెవరినీ ఏమీ అనదు! తన పిలలమీద ఈగ వ్రాలినా వప్పుకోదు!—కాపరాని కొచ్చిన తొలిరోజుల్లో కమలను కూడా ఏమీ అనేది కాదు. ఏనో తనలో తాను గొణుక్కుంటూ ఎవరినో ఒకర్ని తిట్టుకుంటూ ఉండేది—కమలకూడా మా అమ్మ పిచ్చి చేష్టలకు చాలా వరకూ అలవాటు పడింది. కానీ ఆ మధ్య అంటే కమల కడుపుతో ఉన్న రోజుల్లో మా అమ్మకి కాస్తా పిచ్చెక్కువయింది. రోకలి, రుబ్బుడు పొత్రం. కత్తిపీట ఇత్యాదివి పట్టుకొని దాన్ని చంపుతానంటూ ఆర్భాటం చేసింది నేనూ మానాన్న అడ్డుకున్నాం! అరక మయిన మా అమ్మపిచ్చి చూసేసరికి కమలకు బెంగాభయంపట్టుకున్నాయి. భయం ఉంటే

ఆకుండి నారాయణమూర్తి

~~[illegible]~~

మా నెసి ఎన్నాళ్లిలా పుట్టింటిలో కూర్చుంటుంది? ఇలా పుట్టింటిలో కూర్చుంటే దానికి మాత్రం ఏం గౌరవ ముంటుంది? పరిస్థితుల నర్థం చేసుకొని ఎలానో ఓలా సర్దుకుపోడం సబబు!

అయితే ఒకటి!...కమల దృష్టిలో నేనాలోచించడం కూడా ధర్మం!

ఏ ముహూర్తాన్నయితే కమల మా ఇంట్లో కాలు పెటిందో ఆనాటినుంచి దాని మనస్సుకు శాంతి లేదు.

బండెడు చాకిరీ చెయ్యవలసే బాధ్యత దాని ఒక్కతె మీదే పడింది. ఆ చాకిరకి తోడు మానాన్న చాదస్తం మరింత బాధ కలుగ జేసుకుంటుంది! ఇద్దరు ఆడబొట్టెలు ఇద్దరు మరుదులూ పిచ్చి అత్తిగారు సనాత నాచారాలకు విలువ నిచ్చే మామగారు నేను దానిమీద అధికారం చెలాయించడం మొదలు పెట్టేము.

కమల ఏమంత పెద్దదికాదు!—కాపరాని కొచ్చేసరికి పదిహేనేళ్ల వయస్సు. ఏమంత బలమయినది ఆరోగ్యమైనదీ కూడా కాదు. వాళ్ళపుట్టింటిలో అంతవరకూ భారీపనేదీ చేసుండలేదు. మా అత్తిగారు దానికే పనీ చెప్పేదికాదు. పుట్టింటిలో ఎంతో ముద్దుగా పెరిగింది. కానీ మాయింట్లో కాలుపెట్టిన దగ్గరనుంచి దాని జీవిత విధానమే మారిపోయింది.

మా పెద్ద చెల్లెలు మాణిక్యం కూడా రమారమి కమల ఈడుదే. దానికన్నా ఓ రెండేళ్ళు చిన్నది మారెండో చెలి రత్నమ్మ. మా అక్కయ్యకి పెళ్లయి ఆరేళ్ళయింది. భర్త దగ్గరది హాయిగా ఉంది. ప్రస్తుతం ఇంటి దగ్గరున్న నా చెల్లెళ్ళిద్దరూ చదువులు వెలగ బెడుతున్నారు. అంచేత ఇంటికి సంబంధించిన ఏ ఒక్క పనీ చెయ్యకూడదని వాళ్ళ భావం. అదీకాక వాళ్ళందరికీ చాకిరీ చెయ్యడానికే నేను కమలను పెళ్లాడేనని వాళ్ల దృఢ విశ్వాసం!—"వదినా మంచినీళ్ళు వదినా నా పెన్ను ఎక్కడుందో వెతుకు!...నా

★ సమానాంతర జీవితరేఖలు ★

పరికిణీ చిరిగిపోయింది. కుట్టు. సావాణీ తడిపి ఆరవేయి!" ఈ విధంగా పనులు పురమాయిస్తూ, కమలను క్షణం

సమానాం—2

సేపయినా విశ్రాంతి తీసుకోనిచ్చే వారు కాదు. కుదురుపైనున్న బిందెలోని మంచినీళ్ళు వాళ్ళు తీసుకోలేరూ?—పరికిణీ కుట్టుకోలేరూ?...స్నానం చేసి బట్టలు ఉతుక్కోలేరూ?—తెగులా?...సంకటమా?

పొరపాటున ఏపనినయినా కమల వాళ్లకు చెపుతే మొదట మా నాన్నకు పిచ్చెక్కిపోయేది. "అత్తవారింటికి పోతే వాళ్లకిలానూ పని తప్పదు. పుట్టింటిలోనయినా కులాసాగా ఉండనీ!...అయినా వాళ్ళు చదువుకుంటున్న పిల్లలు. వాళ్ల చదువులు పాడయిపోతాయి!" అని గొణిగేవాడు. మా నాన్న గొణుగుడు వినేసరికి మా అమ్మ పిచ్చి మరీ ఎక్కువయిపోయేది! "ఘంట ముండా!—చంపుతాను. నరుకుతాను. నా కూతుళ్లకు పని చెపుతావటే?" అని విజృంభించేది మా అమ్మ. కిక్కురు మనకుండా చచ్చినట్టు పనిచేసేది కమల.

ఇంతకీ నేనూ చేతకాని దద్దమ్మనయిపోయేను. ఎవర్ని మాత్రం ఏమనగలను?—మా అమ్మకి మతి చెడి అంతా పదేళ్ళయింది. మా అమ్మకు మతి చెడడానికి ఓ రకంగా మా నాన్నే కారకుడని నా భావం—సరే!—ఇప్పుడా విషయం అప్రస్తుతం. ఇంతకీ చెప్పొచ్చేదేమిటి అంటే మా అమ్మ పిచ్చిది కావడంవల నేనన్ని విధాలా దురదృష్టవంతుణ్ణయిపోయేను. నా అన్నయ్యలు ముగ్గురూ ఓ రకంగా అదృష్టవంతులేననీ చెప్పాలి. ఒకడు బీహారు రాష్ట్రంలోనూ, మరొకడు మధ్యప్రదేశ్‌లోనూ, ఇంకొకడు అస్సాములోనూ ఉద్యోగాలు వెలగబెడుతున్నారు. హాయిగా ఆనందంగా వాళ్ల పెళ్ళాలతోనూ పిల్లలతోనూ కులాసాగా కాలక్షేపం చేస్తున్నారు, ఏ బాదరబందీ లేకుండా!—

కానీ నాకా అదృష్టం ఈ జన్మకిక ఉండదేమో! నా చదువు పూర్తయిన వెంటనే, నేనూ ఏ రైల్వే ఉద్యోగం కోసమయినా ప్రయత్నించి ఆంధ్ర దేశానికి చాలా దూరంలో కుదురుకున్నట్టయితే ఈనాడీ విధంగా నా పరిస్థితుండేది కాదేమో. అదీ కాక నేనీ బి. ఇ. డి. ట్రయినింగ్ అయిందకపోతే, నా జీవితం మరోవిధంగా ఉండేది. మా స్వంత ఊరయిన 'బొబ్బిలి' సంస్థానం హైస్కూలులో సైన్సు అసిస్టెంటు ఉద్యోగం నాకేరికోరి దొరికింది. ఇదే స్కూలులో ముప్పది సంవత్సరాలు సెకండరీ గ్రేడు మేష్టరుగా పనిచేసి మా నాన్న రిటైరయినాడు. ఈ ఊళ్లో ఇలూ వాకిలీ సంపాదించేడు. ఈ ఊరు విడిచి పెట్టడానికి మా నాన్నకు సుతరామూ ఇష్టం లేదు!—చస్తే ఈ ఊళ్ళోనే చావాలని మా నాన్న సంకల్పం.

పోనీ తనమానాని తను 'రామా' 'కృష్ణా' అనుకుంటూ ఓమూల కూర్చుంటే ఎవరికీ బాధలేదు. మా నాన్న దృష్టిలో నేనో ఆరేళ్ల కుర్రాడిని??—చెప్పకుంటే సిగ్గుకూడాను. నెల అయేసరికి నాకొచ్చే జీతాన్ని రూపాయిలు అణా పైసలతో సహా మా నాన్న చేతికిచ్చేయాలి. లేకపోతే వస్తుంది యుద్ధం?—"వెధవా.—నిన్ను ఇంతవరకూ చదివించి ఇంత ప్రయోజకుడిగా చేసేను. మరచిపోకు!—విశ్వాస ఘాతకుడుగా మారకు!" అంటాడు. దాంతో నా నోరుబంద్!—ఇదే నాలోని దౌర్బల్యం!-గట్టిగా జవాబిస్తే నోరుమూసుకోని ఊరుకుంటాడు. కానీ మా నాన్నని ఎదిరించే ధైర్యం నాకు లేదు-"నా పెళ్ళానికి చీర కొనాలి నాన్నా డబ్బియ్యవూ?—రిబ్బను కొనాలి, ఓ బేడ ఇయ్యవూ?" ఈ విధంగా అడుక్కునే పరిస్థితి నాది. ఏం చెయ్యమంటారు?-ఇదంతా నా మానసిక దౌర్బల్యం!

అందరి పైనా పెత్తనం చెలాయించాలని మా నాన్న కోరిక. ఆ కోరికను కాదని ఎదిరించే దమ్ము నాకు లేదు. అంచేతే ఈ అవస్థంతాను!—

నేనంటే గతిలేక సహిస్తున్నాను గానీ అది ఎంతకాలమని సహిస్తుంది?-మరి సహించలేకపోయింది కమల!-ముఖ్యంగా మా అమ్మ దానికంటికో మృత్యుదేవతలా అగుపించుంటుంది.

పురిటికని పుట్టింటికి వెళ్ళినది ఇంతవరకూ రాలేదు-ఆఖరికి నేనే బయలుదేరేను; దాన్ని తీసుకురావడానికి!

నా మామగారు, అత్తగారూ చాలా నిక్కచ్చిగా చెప్పేసేరు; "మీ అమ్మ పిచ్చి మా పిల్ల జీవితానికి ప్రమాదాన్ని తెచ్చేదిగా ఉంది. అంచేత మీ అమ్మగారిని మరెక్కడికయినా పంపించేస్తే, మా పిల్లను పంపిస్తాము!" అని.

"మా అమ్మకసలు పిచ్చే లేదు. ఏదో మందమతిది!...అంతే. ఆవిడ ఎవ్వర్నీ ఏమీ అనదు. మీ కమలే మా అమ్మనీ, చెల్లెళ్ళనూ, తమ్ముళ్ళనూ కొట్టేది. అసలు మీ పిల్లకే పిచ్చి! అని దబాయించాను. మా నాన్న అలా దబాయించమన్నాడులెండి!

"అంతలా, మీవాళ్ళందరినీ కొడుతూ



జూన్ 1న మద్రాసు గోఖలేహాల్లో భరతనాట్య ప్రారంభప్రదర్శనం ఇచ్చిన బేబీ మాధురి.

తిడుతూ మీపై అధికారం చెలాయించేటంతటి ధైర్యం. అవకాశం మీ ఇంట్లో మాపిల్లకుంటే ఇక్కడుండే ఉండదు నాయనా!-మీ అందర్నీ తనగుప్పిట్లో పెట్టుకొని హాయిగా అక్కడే ఉండేటందుకిష్టపడేది. ఈ అవస్థంతా ఎందుకు చెప్పు?" అంది మా అత్తగారు.

..."మా చెల్లెల్ని మాయింట్లో ఉంచుకొని పోషించడం మాకేం సరదా అనుకున్నారేంటిటి? సగానికి నెలకు నలభై రూపాయలు దానికుటించి ఖర్చు చెయ్యడంవల్ల మాకేం లాభముంటుందనుకుంటున్నారేంటిటి?—దాని లైఫ్‌కి అక్కడ సెక్యూరిటీ లేదు కాబట్టే పంపించడం మాకిష్టం లేదు!-దాని జీవితానికక్కడ ఏ ప్రమాదమూ వాటిల్లదని వ్రాతమూలకంగా హామీపడగలరా?-అలా హామీపడితే ఇప్పుడే పంపిచేస్తాము!-అది బతికి బాగుండాలనీ. సుఖంగా ఉండాలనీ ఇన్ని వేలూ కుమ్మరించి మీకిచ్చేం!—తెలుసా?! అంతేనేగానీ మీ అమ్మకి బలి చెయ్యడానికివ్వలేదు!-తమరూ చదువుకున్నవారే; అర్ధం చేసుకోండి!-పెళ్లాం అంటే మీ కమ్ముకుపోయిన బానిస కాదు ఇది ఇరవయ్యో శతాబ్ద ఉత్తరార్ధభాగం!-మరిచిపోకండి-"అని మా బావమరది అన్నాడు.

"మా వదినలెవ్వరూ మా అమ్మగురించెన్నడూ ఈ విధంగా అనలేదు!" అన్నాను.

"ఎందుకంటారు?- ఏ బాదరబందీ లేకుండా హాయిగా ఉంటేను!- ఈ మహా

(55-వ పేజీ చూడండి)

ఇప్పటిదాకా మేమిద్దరం పెద్దగా తర్కించుకొని తీర్మానించుకోవలసిన అవసరం రాలేదు. అంత సమస్య ఏదైనా ఉంటే గదా అసలు? అలా అంటే, మేము తర్కించుకోకుండానే ఇన్నాళ్ళు గడిపామని కాదు. అమాటకొస్తే అప్పుడప్పుడు కలహించుకొన్నాం కూడా. ప్రాతాజీలదగ్గఱ నుంచీ కొంతింవఱకూ అంతా దాన్ని చేపట్టినవాళ్ళే! పెరుగన్నంలో ఆవకాయలా, దాంపత్య జీవితంలో ప్రణయకలహాలు! కాని, కిష్టిగాడికి మాత్రం పెరుగన్నంలో ఆవకాయి చస్తే సయించదు. అందుకే, నేనామాట అన్నప్పుడల్లా వాడు పెరుగన్నంలో కొరపకాయల్లే' అంటూ సవరిస్తాడు. మా నాయినమ్మకి మాత్రం మేమిద్దరం కీచులాడుకున్నామూ అంటే, చెడ్డ సంతోషం. 'మళ్ళీ ఏమే, అలా మూతి ముడుచుకున్నావ్?' అని మా అమ్మ కోడల్ని ఎత్తిపొడిస్తే 'నీకెందుకు? నువ్వూరుకోరాదు? వాళ్ళు చిలకాగోరింకల్లా ఉంటేను' అంటో తన కోడల్ని దబాయిస్తుంది నాయినమ్మ. 'నాయినమ్మా! చిలకాగోరింకలా చిలక చాలా చెడ్డది సుమా' అని నేనంటే, 'మా బంగారునాన్నవి నువ్వు' అంటుంది. ఇంతకూ చెప్పవచ్చిందేమంటే అడపాదడపా మేము కలహించినా ఇప్పటి విషయం వేరు. అంత విశేషం ఇప్పుడేమి వచ్చింది అంటే, వచ్చింది; పాపాయికి పేరుపెట్టాలా మరి! అందులో మొదటి పాపాయి!

ఉత్తరం వచ్చీరాక పూర్వమే ఇల్లంతా 'షాక్' తిన్నట్లుగా చైతన్యవంతమైంది. ఏం పేరు పెట్టటం?

'ఏంపేరు పెడ్తావురా నీ కొడుక్కి?' అంది అమ్మ.

'ఆదినారాయణ అని పెట్టరా' అన్నారు నాన్న. ఏమంటే అది మా అమ్మనాన్న పేరు.

'మానాన్న పేరెందుకులే. వాళ్ళ నాన్న పేర పెట్టు నాయినా—సుబ్బం భొట్లు అని! ఎంత చక్కని పేరు!' నవ్వసాగింది అమ్మ.

"ఓసి నీయిల్లు బంగారుగాను! ఎందుకే అలా నవ్వుతావు? ఆరోజుల్లో అది ఎంత చక్కని పేరనుకొన్నావు?" అంది నాయనమ్మ తన మొగుణ్ణి అంటున్నారన్నట్లుగా.

"సరే! ఎలాగూ మా అవ్వ చెప్పనే చెప్పింది. పోనీ పెట్టరాదూ' అన్నారు నాన్న, పండిట్లో సమారాధన అన్నట్టుగా.

'అదేంపేరు ఛ! అంతా నవ్వుతారు!' అన్నాడు కిష్టిగాడు.

"ఫజీశ"

'ఓరేయ్! నేను పెద్దదాన్ని కదా!, మరి నామాట వింటారా' అంది నాయినమ్మ.

అందఱం ఆమెవైపు చూశాము. ఆమెకు శ్రీకృష్ణుడంటే మహా యిష్టం. అందుకే కిష్టిగాడికి ఆపేరు పెట్టారు. మళ్ళీ వీడిక్కూడా ఆపేరే పెట్టమంటుందా యేమి అనుకొంటూనుంచున్నాను. ఏ పేరైతే యేమి కాని, ఇబ్బందల్లా ఇద్దరుకిష్టిగాళ్ళయితే ఎలా పిలవటం? లెఖల్లో లాగు కిష్టిగాడు-1, కిష్టిగాడు-2- అని పిలుచుకోవలసిందే.



నీలాటిరేవు

చిత్రకారుడు: వీరిశెట్టి అచ్యుతరావు

★ నామకరణంలో సమీకరణం ★

ఆమె అందరివేపు ఒక్కసారి, గారడీ వాడు చూచినట్లుగా చూచి, రాధా మాధవుడు అంటూ పెట్టండ్రా" అంది.

"భోజనకాలే రాధామాధవ స్మరణా గోవింద" అన్నాడు కొంటె కిషిగాడు.

"అమ్మా! ఆపేరు ఒద్దు లేవే! ఆపేరు గలవాళ్ళంతా పోకిరి వెధవలౌతారు" అన్నారు నాన్న. నాయనమ్మ నయా పైసా అంత మొహం చేసికొంది.

'అన్నిటికీ అలా వెక్కిరిస్తావు గదా, నువ్వు చెప్పరా కిటూ" అన్నాను నేను. వాడు ఐసెన్ హోవర్ లా చూచి, 'దిలీప్ కుమార్' అన్నాడు.

"పోరా వెధవ! నీపేరు నువ్వు చాలా బాగున్నావు" అంది అమ్మ ఆమెకే సరికొత్త పేరు పెట్టుకోవాలని.

"అందుకేగా నేను ఆదినారాయణ మూర్తి అని పెట్టుకోమంది" అన్నారు నాన్న నవ్వుతో.

"ఎందుకు లేరా! 'సుబ్బం భొట్లూ' అనే పెట్టు, కావాలి అంటే ముద్దుగా 'భం భోం' అని పిల్చుకోవచ్చు" అంది అమ్మ విసురుగా.

ఎలాగైతేనేమి, మేము బయలుదేరే నాటికి ఓ అరడజను పేర్లు 'లిస్టు' కెక్కాయి.

రైల్లో ప్రయాణం చేసినంతసేపు నా గుండెల్లో రైళ్ళు పరుగిడుతున్నయ్. ఇక్కడే ఇలా ఉంటే, ఇక అక్కడ ఎలా ఉంటుందో!

హే భగవాన్! అన్నట్లు 'భగవాన్లు' మా బాగా ఉంది కదూ? నాకిట్లో అడుగుపెటగానే, 'ఏం పేరు పెడతావు బావా కొడుక్కి' అంది నీరజ కాళ్ళుకు నీళ్ళిచ్చి'

ఏం పేరు పెట్టమంటావు మరదలా?. అన్నాను నేను.

"ఏమో నబ్బా! నీకొడుకు నీయిష్టం" అంది, అదోలా.

"నిజమే కాని పేరేం పెట్టమంటావు అని నే అడుగుతా"

"అయినా ఇంతమంది ఇన్ని పేర్లు చెప్పితే నాపేరు నీకు నచ్చుతుందా?"

"ఎవళ్ళేం చెప్పినా, పెటేవాణ్ణి నేను గదా!"

"ఆయనను లోపలికి రానిస్తావా లేదా ఇంతకూ?" అంటూ బయటకు వచ్చింది వాళ్ళ అమ్మమ్మ.

కాఫీ తాగుతుంటే, అరుణవచ్చి "నీకొడుక్కి 'ప్రద్యుమ్న కుమార్' అని పెట్టు బావా" అంది. అరుణంటే నా చిట్టి మరదలు ఏడు ఏళ్ళు దానికి. అసలు పేరు వేంకటలక్ష్మమ్మ అయితే, ఆ పేరునచ్చక అరుణకుమారి అయి కూచుంది!

"అబ్బో! అంత పెద్దపేరే! నే పెట్టను బాబు! పాపకే వెంకటలక్ష్మయ్య' అని పెట్టాను నేను."

"ఫో బావా! నువ్వు ఎప్పుడూ ఇంతే!"

అన్నందగర నూర్యం అడిగాడు. "ఊఁ... చెప్పవోయ్ మై డియర్ బ్రదరిన్లా" అన్నాను. వాడికి డిటెక్టివ్ కథలంటే ఇష్టం.

"చెప్పనా అయితే-ఇదుగో చెపున్నాను కాచుకో డిటెక్టివ్ యుగంధర్," అన్నాడు. అంతా ఒక్కసారి గొల్లున నవ్వారు. 'ఘానీ భయంకర్'

"నోరు ముయ్యరా వెధవా" అన్నారు మా మామగారు.

చెయ్యి ఎత్తి నోటికి అడ్డం పెట్టుకొని, 'చాణక్య' అని గొణిగాడు వాడు.

తాంబూలం వేసుకొంటుంటే, విశాలక్షి అడిగింది. నేను నిజంగా సమస్యలో పడాను. "సరే! నువ్వు ఒక పేరు చెప్పు విశాలా!"

"బావా అందరితో నీకేం పని? నువ్వేం పేరు పెట్టావో చెప్పు" అంది నీరజ మళ్ళీ.

"నిజం నీరజా! నాకేమీ తోచటంలేదు. మీ అందరూ తలా ఒక పేరు చెప్పండి అందులోంచి నాకు నచ్చినపేరు నేను ఏరు కుంటాను," అన్నాను నేను.

"ఓఁ అలాగే" అంటూ అంతా ఏకగ్రీవంగా ఆమోదించారు.

'ఇల్లలుకగానే పండుగా' అన్నట్లు ఇప్పటి కేమైనట్లు? అసలు శ్రీమతిని ఇంత దాకా చూ సేగదా! ఆమెగారి కోరిక ఎలా ఉందో! మూడుగంటలకు హాస్పిటలుకు వెళ్లాను, ఇన్నాళ్లుగా రానందుకు ఏం సాకు చెప్పటమా అని ఆలోచించుకుంటూ ఎందుకైనా మంచిదని చక్కటి కిళ్ళీలు రెండు కట్టించుకొని మరీ వెళ్లాను.

కిటికీలోంచి నేను రావటం చూచి, నవ్వులో వాకిలిదాకా ఎదురు వచ్చింది. దుప్పటి తొలగించి పాపను చూపి "ఎలా ఉన్నాడు? అంది.

"అచ్చం వాళ్లమ్మ పోలికే!-ఒక్కరంగు మినహా."

"అబ్బా పాపం! మరి ఆ ముక్కు?"

"బొజ్జముక్కు"

"మా పాపముక్కు బొజ్జముక్కు ఏమీ కాదు. సంపంగి పూవు."

"ఫరవాలేదు. కవిత్వం రాయొచ్చు ఇక!"

మా అత్తగారు నీరజ వచ్చారు, కాఫీ పుచ్చుకొని. నన్నాశాగమంటే 'సరే' అన్నాను. ఇద్దరం కాఫీ తాగి కిళ్ళీలు వేసి కొన్నాము.

ఏదో లోకాభిరామాయణం మాట్లాడుకున్నాము. నేను సాధ్యమైనంతవరకు ఆ ప్రస్తావన రాకుండా జాగ్రత పడ్డాను. కొంచెంసేపాగి, వాళ్లమ్మ వెళ్ళిపోయింది. నీరజ వాకిట్లో ఎక్కడో ఉంది.

మేము చాలరోజుల తరవాత కలుసుకున్నాంకదూ, ఏదో మాట్లాడుకొంటూ కూచున్నాం. ఇక వెళ్ళవలసిన వేళ కావస్తోంది. నీరజ వచ్చి 'బావా ఇక వెళ్దాం' అంది.

"ఇంతకూ మీ పాపకు ఏం పేరు పెట్టాలనుకున్నారు?" ఆఖరుకు అంది శ్రీమతి.

"నువ్వేం పెట్టాలనుకున్నావు?"

"మీ పాపకదా! మీ ఇష్టం!"

"మరి నీ ఇష్ట మేమీ లేదా?"

"అమ్మ పాపం! ఏ పేరంటే ఆపేరు

పెడితే ఒప్పుకుంటాననుకున్నారా?"

"అందుకేగా చెప్పు మతీ."

"ముందు మీరు చెప్పండి"

"అయితే రేపటిదాకా ఆగు."

* * *

ఇంటికి వచ్చేసరికి యమున ముసి ముసి నవ్వులు నవ్వుతో ఓ కాగితం తెచ్చి ఇచ్చింది. "ఏమిటిది?" రెండువెపుల పేర్లు! పాపకి పెటమని వాళ్ళు 'సజెస్ట్' చేసి నవి!

మొత్తం 102. మొదట మా మామగారు తరువాత అత్తగారు ఆ తరువాత పార్వతి, ఆ తరువాత యమున. విశాల, ఇలా అందరూ.

మొహంమీద కమ్మిన చమటబిందులు తుడుచుకొని,

"మతి మీ అక్క ఏమీ చెప్పలేదా?" అన్నాను.

"అన్నట్టు అక్క నడగటం మఱచి పొయ్యాం" అంటూ విశాల ఆ కాగితం తీసికొని ఇంట్లోకి పరుగెత్తింది. నేను దీర్ఘంగా నిట్టూర్చాను.

"ఏమప్పా లిస్టు చూచావా?" అన్నారు మా మామగారు, భోజనం మధ్యలో.

"చూచానండి. ఇవి కాక ఇంకా మావాళ్లు చెప్పినవి 6 ఉన్నయ్."

"ఇంకా అక్కయ్య చెప్పనే లేదు," అంది పార్వతి.

"అప్పా! బావ ఏంచెప్పాడో తెలుసా?" నీరజ మధ్యలో అందుకుంది.

"ఊ! ఏం చెప్పాడు? నిన్ను పెట మన్నాడా?"

"ఊహుఁ! మనం పెట్టమన్న పేర్లన్నీ పెడతాడట."

"చాలు చాల్లే! నువ్వు నోరుమూసుకో" అంది మా అత్తగారు.

"నిజంగానే! మరేఁ మనం ఓపికపడితే, తనకి అంతమంది కొడుకులు పుడితే అన్ని పేర్లు పెట్టుకుంటాడుట!" అంది నవ్వుతో.

"నూటరెండు మందే! అమ్మబాబోయ్!" సూరి ఇకిలించాడు.

* * *

శ్రీమతికి ముద్దుగా పిలుచుకునేందుకు వీలుగా రెండక్షరాల పేర్లు కావాలిట. శాస్త్రి గారు "మగవాళ్ళకి మూడక్షరాల పేర్లుం చాలి" అన్నాడు.

మఱునాటికల్లా 'ఫైనల్ లిస్టు' తయారైంది. మొత్తం నూటపంధొమ్మిది పేర్లు!

"ఇదిగో! ఇలా అయితే సాధ్యం కాదు. ఒక్కొక్కరూ ఒక్కొక్క పేరే సూచించాలి!" అన్నాను నేను.

"నా పేర్లన్నీ బాగున్నయ్. అందులోంచి ఏదీతీసేసేందుకు వీల్లేదు' అంది యమున. ఆమెలిస్టులో 9 పేర్లున్నయ్.

"నేనేం చెయ్యను యమునా! మీ అక్కయ్య తొమ్మిదిమందిని ఒక్కసారి కంటె అలాగే అన్నిపేరు పెట్టుకుందును గదా!"

"అన్నీ దానిపేరే పెడితే, మతి నా పేర్లు!" అన్నాడు మై డియర్ బ్రదరిన్లా.

"అయితే మీరంతా ఒకపని చెయ్యండి. మీ అక్కయ్యదగ్గిఱకి వెళ్ళి 'నువ్వు ఇంత మందిని కని తీరాల్సిందే' అని అడగండి."

* * *

ఎలాగైతే యేమి ఆఖరుకి ఒక్కొక్కరు ఒక్కొక్క పేరుమాత్రం ఉంచేలా నిర్ణయం జరిగింది. మొత్తం 17 పేర్లయ్యాయి. అంక బాగాలేనని. 20 చేసి చక్కా ఇచ్చారు. మొదట తన పేరు ఉండేలా రాసి విశాలాక్షి లిస్టు నిచ్చివేసింది, తెల్లవారితే నామ కరణం అనగా.

రాత్రి అంతా నిద్ర మానివేసి, నేనూ శ్రీమతీ తర్కించాము. అందులో ఏదో ఒక పేరు ఏరుకోటానికి. కాని మాకు సాధ్యం కాలేదు.

అందరూ 'కామన్'గా ఒక్క పేరైనా చెప్పిఉంటే ఇక ఎలాగో దాన్ని పెట్టెయ్య వచ్చు. కాని ఒక్కొక్కరూ ఒక్కొ పేరుం చారా? ఇక దేన్ని ఏరుకోటం? పోని ఏదో

★ నామకరణంలో సమీకరణం ★

మనకు తోచింది పెట్టుకుందామంటే, అందరికీ కోపం వస్తుంది! 'డెమోక్రసీ' యుగం కనక మెజారిటీ ఏ పేరు కావాలంటే దాన్ని ఉంచుదామంటే, "పుర్రెకో బుద్ధి జిహ్వకో రుచి భువిలో వేమా!" ఇంక ఏమి చేయటం?

ఏమైనాసరే ఈ రాత్రి నిశ్చయం చేసుకోవాలి. రేపొద్దునే ఏదో ఒక పేరు పెట్టుకోవాలా మరి?

"ఇదిగో! ఆ లిస్టు తీసికొని ఒక్కొక్క పేరే చదువు ఆలోచిద్దాం' అన్నాను శ్రీమతితో ఆవిడ లిస్టు అందుకొని మోహన్‌దాస్ కరంచంద్ - మానాన్నగారు సెలెక్టు చేశారు" అంది.

"సరే! తరవాత చదువు"

"ఏమండీ! ఆపేరుకేమి? గాంధీ గారి పేరుగదా!"

అందుకనే నేను ఒద్దంది. పాప పెద్దవాడై పోకిరి వెధవయ్యాడనుకో. ఆరోజు వాణ్ణి కోప్పడాలి కదా! ఒరేయ్ 'కరంచంద్'గా నీకు బుద్ధుందా? అనాలి గదా. నాకేమో గాంధీగారిమీద భక్తి; అలా అనలేను. వాడేమో వెధవపనుల చేస్తుంటాడాయె. ఇంక ఏం చెయ్యటం?"

మా ఆవిడనవ్వుతో, మీ పిచ్చిగాని తిట్టేందుకు పేరు పెట్టే తిట్టాలా? ఒరేయ్‌వెధవాయ్ అనొచ్చుకదా! అంది.

"అబ్బె అలా కుదరదు. పేరెట్టేతిట్టాలి!"

"సరే. అయితే. తరవాత పేరు చదవనా?"

"ఊఁ, కానీ."

"బాలేందుశేఖర్ — మా అమ్మ సెలక్షన్"

లాభం లేదు. తరవాత.

"అన్నీ అలాగంటే ఎలాగండి? ఆ పేరు బావుంది. పైగా దేవుడిపేరు పిలుచుకొన్నా పుణ్యం వస్తుంది!"

"అబ్బా! యక్షప్రశ్నలు వెయ్యక తరవాత చదువుదూ."

"ఇక నే చదవలేను. మీకు నచ్చినపేరే పెట్టుకోండి."

ఇదుగో! ఇలా చూడు. సాంత్రాజితిలా అన్నిటికీ అలిగితే ఏం బావుంటుంది చెప్పు? నే నెందుకు ఒద్దన్నానో తెలుసా? అయితే చెపావిను. నే నెరిగిన బాలయ్య అనే ఒకడున్నాడు. వాడికీ నాకూ బద్ధవైరం. చిన్నప్పుడు మేమిద్దరం కొట్టుకునే వాళ్ళం అనుకో. వాడి పేరంటేనే నాకు ఒళ్ళు మంట — నా పేరంటే వాడూ అలాగే అంటాడనుకో! ఇహ మాటిమాటికి వాణ్ణి ఎలా గురుచేసికోను?"

"సరే అయితే! తరవాత పేరు శేషావతారం. మా అవ్వ పెట్టింది. ఇది ఒద్దులెండి. తరవాత చదువుతాను."

"రైటో."

మా ఆవిడ చదవకుండా ముసి ముసి నవ్వులు నవ్వుతో "ఇదేంపేరండీ ఎక్కడైనా ఇలాంటపేరు పెట్టుకుంటారా?" అంది.

"పేరు ముందు చదివి, తరవాత నవ్వితే."

"మీరు పెట్టిన పేరు మీకు చెప్పాలా ఏమి? అదే! ఆ పేరే" నవ్వులో "భగవాన్లు"

ఎందుకలా నవ్వుతావు? అది ఎంత చక్కటి పేరో తెలుసా?"

"ఏమో! నాకేం తెలుసు?"

"అయితే విను. మనం చేతిలో మైనం ముద్ద ఉంటే, ఏ బొమ్మ కావాలంటే అది చెయ్యొచ్చుగదా! అలాగే ఈ పేరుతోనూ."

"ఏమోనబ్బా! మీ రేమి మాట్లాడేది మీకే తెలియాలి."

"అంటే—నీ కొడుకు వెఱ్ఱివాడయ్యాడనుకో. అప్పుడు"

"ఓరి! భగవాన్లూ! అనొచ్చు. వెధవవేషం వేశాడనుకో. ఒరే భగవాన్‌గా! అనొచ్చు. మాంచి తెలివికల వాడయ్యాడనుకో. అరి తస్సాదియ్యా భగవాన్లూ! అనొచ్చు. ఇక సరదాగా పిలుచుకోవాలంటే 'భగవాన్! ఓ భగవాన్!' అని పిల్చుకోవచ్చు."

"హే భగవాన్!" అంది మధ్యలో మా ఆవిడ, ఆదోలా—ఆముదం తాగినట్టుగా మొహంపెట్టే.

"అదిగో చూశావు! అప్పుడే నీ కల వాటైంది. ఇక ముద్దుగా కావాలి అంటే— "భగ్ భగ్" అనో, 'వాన్లూ' అనో పిల్చుకోవచ్చు!"

శ్రీమతి ఇక ఓపిక పట్టలేకపోయింది. చేతిలోని కాగితం ఉండచుట్టి విసిరి అవతల వేసి, అటు తిరిగి పండుకొంది.

శ్రీ కృష్ణపరమాత్ముడంతవానికి తప్పలేదు. సరే! ఇక మనలాంటి మానవమాత్రులెంత? ఎలాగో కలహాంజారి. ప్రణయం మిగిలిం తరువాత, దేవి మళ్ళీ నావేపు తిరిగి నవ్వుతో;

"అయితే ఆలిస్టు చించివెయ్యనా?" అంది.

"ఒద్దు ఒద్దు! వాళ్ళేమనుకుంటారో."

'సరే అయితే.'

ఆపేర్లన్నీ మరో కాగితమ్మీద చక్కగా ముత్యాల్లాంటి అక్షరాలతో వ్రాసింది. కాని తను పెట్టదలచుకొన్న పేరుమాత్రం అన్నిటికంటె ముందు వుంది.

పీటలమీద కూచొని, శ్రీమతి చెవిలో గొణిగాను, 'ఆలిస్టు తెచ్చావా' అని. ఉజ్జ్వలంగా నవ్వుతో 'ఓ!' అంది.

శాస్త్రిగారు "అబ్బాయి! ఉంగరం తీసికొని పళ్ళెంలో పేరురాయి' అన్నారు. నేను శ్రీమతిని రహస్యంగా గిల్లాను. తనూ రహస్యంగానే నాచేతిలో లిస్టు పెట్టింది. తల ఓపక్కకి తిప్పుకుని మళ్ళీ ఓమాటు లిస్టు అంతా చదువుకున్నాను. ఆఖరుసారిగా అందరూ నావేపు ఆశ్చర్యంతో, ఆతురతతో చూస్తున్నారు. అసలు నే నేమి చేస్తున్నానో చాలామందికి తెలీదు. అర్థమైన ఒకరిద్దరు మాత్రం తల పక్కకి తిప్పుకుని నవ్వుకుంటున్నారు.

"అయినా ఇంతసేపు చూచేదేముందండి. అందుకేగా నేను మొదటే ఆపేరు రాశాను' అంది. ఆపేరు పెట్టేందుకి లిస్టు ఎందుకు చూడవలెనో తెలుసుకోలేక.

హఠాత్తుగా అప్పుడు స్ఫురించింది నాకు. 'అవునవును' అని శ్రీమతితో చెప్పి, లిస్టు కిందకి నెట్టి, పళ్ళెంలో పేరు రాశాను.

"ఏంపేరు బాబూ?" అన్నారు శాస్త్రి గారు.

'యక్స్' అన్నాను.

"అదేమిటి పేరా?"

"అవునండి! ప్రస్తుతానికి ఏఒక్కపేరు సరిపొయ్యేలా లేదండి. లెక్కలో ముందు x అనుకొని లెక్క చెయ్యటం అలవాటు, అలాగే, ఇప్పటికి X అని పెట్టేసి, ఎవరికొక్కవలసినట్లుగా వాళ్ళంపిలుచుకుంటారు' అన్నాను నేను.

శ్రీమతికి నామాటలు ఎంతవరకు నచ్చాయో అని పక్కకి తిరిగిచూశాను. నా అదృష్టం బావుంది. ముసిముసినవ్వులు నవ్వుతోంది! ★

తల్లులూ–తండ్రులూ

[గతవారం తరువాయి]

వారంరోజులు గడిచాయి.

ఈ వారం రోజులనుండీ అల్లుడిఇంట్లోనే వుంటున్న జానకిరామయ్యకి మతిపోతున్నట్టుంది. మనుమడిమృతికన్న అతనిని ఎక్కువ కలవరపెట్టసాగినది కూతురి ప్రస్తుత స్థితి. అసలే పుత్రశోకంలో మాడి ఎండుటాకులాగ వున్న ఇందిర గుండెని నారాయణరావు నడవడిక దహించి వేస్తోంది. అసలు అతను తరచు ఇంటిపట్టున ఉండడని ఇదివరకే సూచించాను. వృత్తిధర్మాన్ని అంతకంటే ఎక్కువగా ఆటలలో తన విధినీ నిర్వర్తించడంలో అతనికున్న శ్రద్ధలో వెయ్యోవంతయినా ఇంటిపట్ల చూపిస్తే బాధలేకపోవును. వాని ఉన్నరోజులలో భర్త ప్రవర్తన ఇందిరకి కొంచెం అసంతృప్తిని కలిగించిందేమో కాని కష్టాన్ని కలిగించలేదు. అయితే ఇన్నాళ్లూ ఆమె ఏ వస్తువు చాటున భర్తని ఉంచిందో అది తొలగిపోగానే ఆమెకు భర్త స్పష్టంగా కనిపించసాగాడు. ఇప్పుడు అతను పోయిన కొడుకుకోసం గాని, ఉన్న భార్యకోసంగాని ఇంటిపట్టున నిలవకపోవడం ఇందిర సహించలేకుండా వుంది. ఇలా కూతురి మనస్సులో రెండు విధాలయిన బాధలు రేగుతూంటే జానకిరామయ్య ముసలికళ్లు చెమ్మగిల్లాయి.

ఆ ఉదయం నారాయణరావు ఏదో వ్రాసూవుంటే పట్టుకోగలిగాడు జానకిరామయ్య.

"ఆఁ. చూడు నాయనా. అమ్మాయిని-' వ్రాత సాగిస్తూనే 'టైం లేదండీ ఇప్పుడు చూడడానికి' అని జవాబిచ్చాడు.

'కాదు బాబూ—'

'ఊఁ?'

'అక్కడ మనయిలు ఎంతో సందడిగా—'

'ఆ సందడిగా వుంటుంది. అయితే?'

'ఏదో నలుగురి మొహాలూ చూస్తూంటే పిల్లకి కుర్రాడిని మరచిపోవడం—'

'అహాఁ. అదంతా మంచిదికాదు.'

'అది కాదు నాయనా—'

'అవును, అన్నట్టు కుర్రాడు పోయాడు కాబట్టి మంచిదే.'

'ఔనా. అంచేత ఇందిరని అక్కడికి తీసుకువెళ్తామని—అదీగాక ఈ ఏడో నెల దాటకుండా తీసుకువెళ్ళడం ఆచారం—'

'ఓ దానికేం అభ్యంతరం?' అంటూ డాక్టరు తను వ్రాసిన కాగితాన్ని నౌకరుని పిలిచి యిస్తూ 'ఈ మందులన్నీ అర్జంటుగా తెప్పించి ఉంచమన్నానని కంపౌండరుతో చెప్పు' అని లేచాడు.

ఇక సావకాశంగా మాట్లాడవచ్చుని ఆశపడిన జానకిరామయ్యకి ఆశాభంగంఅయింది. నారాయణరావు అక్కడ తన మామగారు ఉన్నారని గమనించకనే స్నానాలగదిలోనికి దారితీశాడు.

గడపదగర ఉంది ఇందిర.

'ఆయనిలా తయారయారు నాన్నా. తను నోరువిప్పరు; చెప్పినది వినిపించుకోరు. ఆయనకన్న రాయి నయం.' అని ఆవేశంగా పలికి విసవిస తనగదిలోనికిపోయి మంచాన్ని శరణుజొచ్చింది.

మరునాటి ఉదయమే ప్రయాణం. నారాయణరావుకూడా స్టేషనుకి రావడానికి నిర్ణయమైంది. ఇందిర వదినగారి దగ్గరకి వెళ్ళి నమస్కరించింది

రుద్రాభట్ల నరసింగరావు

విమలమ్మ ప్రసన్నంగా ఉన్న ముఖంతో 'లేనిపోనివన్నీ కల్పించుకుని అనవసరంగా బాధపడకు ఇందిరా. సుఖంగా నీళ్ళాడి పనసపండులాంటి పిల్లడితో క్షేమంగా తిరిగిరా.' అని సలహా యిచ్చి దీవించింది.

ఇందిరకి అందులో మొదటి వాక్యం అర్థం కాకపోయినా తల ఊపి తిరిగి వచ్చింది.

కారులో నారాయణరావు లేడు. చిన్నబోయిన ముఖంతో తండ్రిపక్క కూలబడింది ఇందిర. ఆమెకి తన భర్త ఏమయినదీ అడగాలని లేదు. పదిగజాల దూరంలో పోతున్న నర్సుని చూసి అంతా గ్రహించుకుంది.

కారు బయలుదేరగానే తండ్రే ఉండబట్టలేక చెప్పాడు.

'మీ ఆయన వరసేమీ నాకు బోధపడడంలేదమ్మా. స్టేషన్‌కి రావాలని కూర్చున్నాడు గదా. ఇంతలో ఆ అమ్మాయి వచ్చింది. ఆవిడగారూ ఏమీ అననేలేదు. "డాక్టర్ –" అంది. అంతే! అతను ఏదో జ్ఞాపకంవచ్చినవాడిలాగ లేచి "నేను స్టేషనుకి రావడానికి వీలుపడ"దంటూ సైకిలెక్కి వెళ్ళిపోయాడు నువ్వు వచ్చేదాకా అయినా—'

'ఇహ చెప్పకు నాన్నా ఆయన సంగతి.' అని మొగం తిప్పుకుని బయటికి చూస్తూ కూర్చుంది ఇందిర.

తర్వాత తండ్రీ కూతుళ్లు మౌనముద్ర వహించారు.

రైలులో కూర్చుని ముఖాన్ని దాచుకోవడంకోసం ఏదో పత్రిక తిరగవెయ్యసాగింది ఇందిర.

రైలు కదిలింది.

ప్లాటుఫారం వెనుకకు పోతూవుంటే తన భర్తకూడా అలాగే తనకి దూరమైపోతున్నట్టు భావించుకుని తల్లడిల్లిపోయింది ఇందిర. కాని కొంచెం ఆత్మవిమర్శ చేసుకుంటే ప్లాట్‌ఫారం అక్కడే వుందనీ దూరమైపోతున్నది తనేననీ ఆమెకి తెలిసేది.

తన పుత్రశోకం భర్తమీద అసహ్యంగా పరిణమిస్తోందేమో అని అనుమానం కలగగానే ఆపాదమస్తకం వణికిపోయింది ఇందిర.

కన్నీటితెర విడినప్పుడల్లా కనిపించే పొలాలలో పశువులూ దూడలని మేపుకునే పిల్లలూ ఇందిరకి ఒక విధమైన ఆనందంతో కూడిన అసూయని కలిగించారు. జీవితంలో తొలిసారిగా డబ్బు జీవించడానికి ఉపయోగపడినట్టు జీవితానికి ఉపయోగపడదని గ్రహించుకుంది.

* * *

'ఇంకొంచెం కూర కలుపుగోరా నారాయణా?' అంటూ విమలమ్మ మరికొంత కూర వడ్డించింది తమ్ముడికి. ఇక తనకి తప్పదని నారాయణరావు గత రెండుమూడు నెలల అనుభవంలోనూ తెలుసుకున్న విషయమే గనక కిక్కురుమనకుండా నోట్లో కుక్కుకో నారంభించాడు.

ఇంతలో బయట 'డాక్టరుగారూ' అన్న కేక వినిపించింది.

విమలమ్మ వెళ్ళి తిరిగి వచ్చింది. 'ఎవడో కోటలో బంట్రోతుట. ఫోం చేస్తున్నాడు; ఆగమన్నాను.'

'ఎందుకొచ్చాడో అడిగావా?'

'ఆ, ఏముంటుంది. ఏదో మందుకోసం.'

'లేదక్కా ఏదో అర్జంటు పనిమీద వొచ్చుంటాడు. కనుక్కుంటా కాస్త.'

'అర్జంటయితే మాత్రం గవర్నరా ఏమిట్రా. వాళ్ళపిల్లకి కొంచెం వొళ్ళు వెచ్చగా ఉందిట. నువ్వు తాపీగా భోంచెయ్యి ముందు.'

'సరే పెరుగు తే' అన్నాడు నారాయణరావు కూరా అన్నం వదిలేస్తూ.

విమలమ్మ ఎంతో నొచ్చుకుంది. ఆ పిల్లకి

★ తల్లులూ - తండ్రులూ ★

ప్రాణంమీదకి వచ్చిందని తను చెప్ప కుండానే గ్రహించాడు తమ్ముడు. ఇక వాడిని ఇబ్బంది పెట్టడం మంచిదికాదని పెరుగు తెచ్చి తన మానాన తను గదిలోనికి వెళ్ళిపోయింది.

కళ్లు తుడుచుకుని ఉత్తరం వ్రాయ నారంభించింది.

'చిరంజీవి సౌభాగ్యవతి ఇందిరని మీ వదినెగారు ఆశీర్వదించి వ్రాయునది. ఈ మూడు నెలలలోనూ వారానికొక కార్డు ముక్క నీకు వ్రాస్తూనే వున్నాను. కాని ఒక్కమారయినా నీవు ఇక్కడి పరిస్థితులు సవిస్తరంగా వ్రాయలేదు.

'నువ్వు మమ్మల్నిద్దరినీ తప్పుగా అర్థం చేసుకున్నావమ్మా. నా గురించి నువ్వేమనుకున్నా బాధలేదు. కాని నీ మగడి విషయంలో పొరబాటుపడితే నూరేళ్ల బతుకు పాడవుతుంది.

'నారాయణ తిండీ నిద్రా మరచిపోతున్నాడు. ఊళ్ళో ఎవరికి ఏజబ్బు చేసినా వీడు అక్కడికి పరుగెత్తవలసిందే. మునుపు ఎప్పుడూ ఆడుతూ పాడుతూ తిరిగే తమ్ముడిని తలచుకుని ఇప్పటి వీడిని చూస్తే నా కడుపు తరుగుకుపోతోంది. ఆ టెన్నిసు బేటు అల్లిక ఏనాడో తెగి మూలబడివుంది. వినాయకచవితినాడు కొన్న పేకదస్తాయే దుమ్ముకొట్టుకుపోయింది. వాటిని చూసే తీరిక అయినా లేదువాడికి. ఎవ్వరికీ తనకి కలిగిన కష్టంవంటిది కలగకూడదని ఆ వెర్రివాడి ఆశ. ఆ ఆశ ఫలించడానికి తన వొంటినే మరచి పాటుబడుతున్నాడు. నేవాడదాన్ని. మీ అన్నగారిని నిత్యం కనిపెట్టుకుని ఉండవలసినదాన్ని. నేను వాడికేం ధైర్యం చెప్ప గలను చెప్పు. పోనీ ఏదో రెండుమాటలు చెపుదామనుకునేసరికి నా కడుపు శోకమే నా నోటిని పెగలనివ్వదు. పన్నెండేళ్లు పెరిగిన చిట్టితల్లి నా కడుపులో చిచ్చుపెట్టి పోయింది. అయినా మీ అన్నగారు దుఃఖంతో మంచం ఎక్కకుండా చూసుకోవలసిన భారం నామీద ఉంది కనుకనే నేను స్వేచ్ఛగా కంట తడిపెట్టే వీలులేదు.

'ఇటువంటి పరిస్థితిలో నేనుకూడా నోరు మూసుకుని కుమిలిపోవడం తప్పితే ఏమీ చెయ్యలేకపోతున్నాను. ఆ దేవుడు చల్లగా చూసి నువ్వు అనాయాసంగా ప్రసవించి తల్లీ పిల్లా ఇక్కడికి క్షేమంగా చేరుకోవాలని ప్రార్థిస్తున్నాను. క్రమంగా నువ్వే వాడిని సంరక్షించుకుంటూంటే చూసి ఆనందిద్దామని ఆశ........'

మరి రెండు వాక్యాలు వ్రాసి ముగిద్దామనుకుంటూండగా బయటనుంచి 'అక్కయ్యా!' అని గట్టిగా కేక వినిపించింది. విమలమ్మ ఉత్తరంతోనే గాభరాగా వీధిలోనికి వెళ్ళింది.

నారాయణరావు కారులోనుంచే చిరచిరలాడుతూ 'అనుకున్నంతా అయింది. నీవొళ్ళు మంచిదికాదని లక్షసార్లు చెప్పినా వింటేనా. అనుభవించమను—' అంటూ తలాతోకా లేని వారని చెప్పసాగాడు.

ఆతృత పట్టలేక విమలమ్మ 'ఏమిట్రా ఏం జరిగింది?" అని అడిగింది.

'ఏముందక్కా పురుడురాక మూడు రోజులబట్టి మీ మరదలు కష్టపడుతోందిట. వెంటనే రమ్మని వాళ్ళ నాన్నగారి టెలిగ్రామిది.' అని టైము చూసుకుని 'అరె రైలు వేళయిపోతోంది. పోనీవోయి స్పీడ్‌గా స్టేషనుకి' అన్నాడు డ్రైవరుతో.

శిలా ప్రతిమలాగ నిలుచుంది విమలమ్మ. కారు బయలుదేరుతూ వుంటే. తన చేతిలోని కాగితం జారి ఎగిరిపోతున్న సంగతికూడా గమనించలేదామె.

* * *

నారాయణరావు అత్తవారిల్లు చేరుకునేటప్పటికి చీకటిపడుతోంది. అతని వదిన గారలూ అత్తగారూ గాభరాగా తిరుగుతున్నారు.



"వెన్నెల సొగసంత ఏటిపాలేనటర !"

—ఫొటో కే. వి. పాండురంగ విఠల్, బాపట్ల]

'ఎలావుంది ?' అంటూ ఎంతివారిస్తున్నా విశిక బాణంలాగ దూసుకుపోయాడు నారాయణరావు పురిటిగదిలోనికి. 'ఎలావుంది ? ?'

'ఎలావుంటే నేం ?' అని మూలుగుతూ ఇందిర 'నే చచ్చినా ఎవరికిలోటు ? !'

'ఇందిరా ! ! !'

'కాదా ? ఎనిమిదేళ్లు—అబ్బా—పటెంట్లో ఆడీ పాడిన కన్నకొడుకు పోతేనే మీకు చీమకుటినట్టు లేదు. ఇహ కట్టుకున్న—అమ్మో—కట్టుకున్నదానిగతి ఓ లెక్కా ?'

ఇంకొక్క క్షణం అక్కడ ఉండలేక డాబామీదికిపోయి సిగరెట్టు వెలిగించి పచారు చేయసాగాడు.

తన ప్రవర్తన ఎటువంటి ఫలితానికి దారి తీసింది ! రోగుల సేవలో తను శాంతిని పొందుతున్నాడు. కాని స్త్రీయైన ఇందిర పుత్రశోకాన్ని ఎలా భరిస్తోందో ఆలోచించాడా ? మానవుడిగా తనవిధి మానవసేవ కావచ్చు. వైద్యుడుగా తన ధర్మం రోగులని రక్షించడం కావచ్చు. కాని భార్యపట్ల భర్తగా తనకేమీ విధులులేవా ? లేవనుకుందామంటే తన అంతరాత్మ ఒప్పుకోవడం లేదే......

ఎలాగో కాలం గడుస్తోంది. ఏ చప్పుడయినా మెట్లవేపు చూస్తున్నాడు నారాయణరావు—శుభవార్త చెవినవెయ్యడానికి ఎవరైనా వస్తున్నారేమోనని.

కృష్ణ తదియచంద్రుడో చవితిచంద్రుడో ఉదయిస్తున్నాడు. చీకటి రాణి సిగుతో మెలగా నెలరాజు బాహువులలో వాలి పరవశత్వం చెంది కరగిపోతున్నట్టుంది.

ఇంతలో వదినగారువచ్చి 'సుపుత్రుడండీ మరదిగారూ, మరేం గాభరా పడకండి!' అని నవ్వుతూ వెళ్లిపోగానే ఆనందంలో ఉక్కిరి బిక్కిరి అయాడు నారాయణరావు.

మెల్లగా దిగివచ్చి ఇందిర గదిగుమ్మం దగర నిలబడి 'ఇందిరా !' అని పిలిచాడు నారాయణరావు.

ఇప్పుడు లోపలికి రాకూడదని భర్త గ్రహించుకున్నందుకు నవ్వుకుంది ఇందిర.

'ఇందాక ఈ జ్ఞానం ఎక్కడికి పోయిందండీ ?' అన్నది.

'పెలిగ్రామందిన తర్వాత మతిపోయింది ఇందిరా. పిచ్చివాడి లాగయిపోయాను.'

ఇందిరకి గర్వపాటూ గర్వం కలిగాయి. ఆఖరికి తనే భర్తని జయించింది !

'ఈ తెలివితక్కువ దాని మీద మీకు ఇప్పుడెయినా కోపం పోయిందా ?'

'అసలు కోపంరాందే. ఒకరినొకరు అర్థం చేసుకోలేకపోవడం ఒక తప్పుకాదిందిరా. బలహీనత. అది ప్రతీమనిషిలోనూ ఇంతో అంతో వుండితీరుతుంది.'

'ఊఁ? డాక్టరుగారికి సైకాలజీ కూడా వంటబట్టిందన్నమాట.' అన్నది ఇందిర నవ్వి.

నారాయణరావు కూడా నవ్వాడు.

'ఇంకో పదేళ్లు నీతో కాపరంచేస్తే అన్ని "ఆలజీ"లూ వంటబట్టేస్తాయి.'

'అలాగా ?' అంటూ చిరునవ్వు చిందించింది ఇందిర.

ఉదయచంద్రుడూ, ఇందిర ముఖాలలో ఏది ఎక్కువ అందమైనదో తేల్చుకోలేక సిగరెట్టు ముటించాడు నారాయణరావు.

అప్పుడే పసికందు 'కేర్ 'మంటూ తాను కూడా ఆ పోటిలో పాల్గొంటూన్నానంది. ★



పాపం!... పంతులు!

రైలు వచ్చి ప్లాటుఫారంమీద ఆగింది. రైలు ఆగీ ఆగటంతోటే ఎవరిమట్టుకు వారే ముందసిగా ఎక్కి లోపల పడాలనే తాపత్రయంలో ఉన్నారు. రైల్లో జనం సరేసరి! కిటకిటలాడిపోతున్నారు. మనుష్యులనికూడా కాలీలాగ లెక్కపెట్టి చూసుకుని అంతా రైల్లో ప్రవేశించినది, లేనిది తేలటంలేదు ఎవరికీను... రైల్లోకి ఎక్కేవాళ్ళేగాని, రైల్లోంచి దిగేవాళ్లు అసలు ఉన్నట్టేలేదు. ముందుగా రైలు ఎక్కగలిగినవాళ్ళు, తరువాత రావాలని ప్రయత్నించేవాళ్ళని యథాశక్తి నిరుత్సాహతోచినంతమట్టుకు వాళ్ళు ఏదో ఒకమాట అంటూనే ఉన్నారు.

"అబ్బబ్బ! ఎందుకయ్యా! అలాగ గెంటుకుంటూ యాతనపడతారు? అందరూ ఒకచోటే ఎక్కాలా? వెనకపెట్టెలన్నీ ఖాళీనే అయినా అటువేపు ఒక్కరూ పోరు. అంతా

అన్నాడొకాయన – గేటుదగ్గిర జనాన్ని మోచేతుల్తో ఇటూ అటూ లోపలికి తోర్దుకుంటూ ఆజనం మధ్యనపడి నలుగుతూ.

"అలాగా? అయితే పాపంమీరు ఈ గేటు దగ్గిరే నిలబడిఉన్నారేం? – అవస్థలు పడుతూను?...నిక్షేపంలాగ ఖాళీగాఉన్న వెనక పెట్టెలోకి వెళ్ళరే?..." అని అడిగాడు ఆపెట్టెలోకి ప్రవేశించాలని ప్రయత్నిస్తున్న మరొకాయన.

అంతటితో ఆ మొదటివ్యక్తి ముఖం కళావిహీనం అయిపోయింది. ఇక ఆయన మౌనవ్రతం పట్టాడు.

"ఈ పెట్టెలో ఖాళీలేదండి! – అయ్యో!– ఖాళీ లేదంటే వినరేం? – ఏమిటి? – ఆ తోసుకునిరావటం?...నీకొక్కడుటయ్యా చెప్పేది? ఖాళీ లేదని చెప్తూంటే వినవేం? నాకే చోటు లేక ఇక్కడే నిలబడిఉంటే నువ్వెక్కడికి? ..."అన్నాడు మరొక పెట్టె గేటుదగ్గిర ఖరోడాయించుకునుంచున్న వ్యక్తి.

అయితే ఈమాటలనేమీ లెక్కచెయ్యకుండా లోపలికి గెంటుకువెళ్తున్న మరొకడు, "ఎంతమాటన్నారు? తమంతటివారే నుంచుని ఉంటే ఇక మాలాంటివాళ్లు కూచోవాలని అనుకుంటాం గనకనా? ఏదో మీలాగే కాస్త నుంచుని రెండునిమిషాలు కళ్ళు మూసుకున్నామంటే ప్రయాణం అయిపోతుంది. బాధేముంది?" అని లోపలికి వెళ్ళి సుఖాసీనుడయాడు. ఆయన వెనకాలే మళ్ళీ పదిమంది లోపల ప్రవేశించారు. వీరందరూ కలిసి గేటుదగ్గిర వ్యక్తిని లోపలికి గెంటేశారు. ఆయనముఖం వెలవెలబోగా అదోకమోస్తరుగా చూడటం ప్రారంభించాడు.

మరొక పెట్టెలోనివాళ్లు గేటు మూసేసి, గేటుకడ్డంగా సామాను పేర్చి, ఎవరొచ్చినా తలుపు తియ్యకుండా "ఇంకా ఎక్కడికయ్యా? – అసలు తలుపు తీసేందుకేనా లేందే?..." అని ఒకరు "ఏమిటా జబర్దస్తీ! వెళ్లు. ఈపాటికిఇంకొక పెట్టెచూసుకో!..." అని ఇంకొకరు, "మనంచెప్తే వింటారేమిటిలే! వాళ్ళకి తెలియదు!...చెప్పేవినరు!..ఇదేబాధ! అని ఇంకొకరు, "పరిలెండి! మనకెందుకు? లోపలికి తొంగిచూసి ఆయనే వెడతాడులే?" అని వేరొకరు...ఇలాగ అంటూండగా కొందరు కుర్రాళ్ళు కిటికీలలోంచి పైకెగబ్రాకి పెట్టెల్లో పడ్డారు. ఇంతవరకూ స్థిమితంగా లోపల కూచుని కబుర్లు చెప్పిన పెద్దలు తెల్లబోయి చూస్తుండగానే వాళ్ళంతా ఆ సామాను గేటుదగ్గిరనుంచి లాగి, గేటు తెరచి, జనాన్ని లోపలికి ఆహ్వానిస్తున్నారు. గత్యంతరం లేక లోపలవారు మాట్లాడకుండా ఊరుకున్నారు.

రైలు ఇంజనుదగ్గిరనుంచి గార్డు పెట్టెవరకూ రెండు మూడుసార్లు తిరిగి వచ్చిన రఘుపతికి అన్ని పెట్టెలూ ఒకలాగే ఉన్నాయి. ఏవిధమైన పేచీ పూచీలు లేకుండా, తను పెట్టెలో ప్రవేశించేసరికి తనకోసమే వున్నట్టు ఒక సీటు ఖాళీగా ఉంటే, ఒకరి జోలీ, శొంఠీ అక్కర్లేని వాడిలాగ, చాలా చాలా బుద్ధిమంతుడిలాగ తను ఆ సీటులో కూచుని ప్రయాణం చెయ్యటానికి ఎంతో ఇష్టపడతాడు – రఘుపతి... కాని, ఇవాళ రైలంతా వెదికినా కూడా ఒక్కచోటా అలాగలేదు. అందుకు చాలా బాధపడ్డాడు. ఇంతట్లోకి రైలుకి గంట కొట్టారు. గార్డు ఈలవేసి పచ్చజెండా చూపెటాడు. రైలుకూత కూసింది. తీరా రైలు బయలుదేరాక కదిలే రైలు ఎక్కటం తనకి చాలా అయిష్టం గనక ఎలాగో తన మనస్సుకి సరిపెట్టుకుని, ఇంకా రైలు కదలక పూర్వమే ఎదురుగా ఉన్న పెట్టెలోకి ప్రవేశించాడు. అతనూ రైలుపెట్టెలో అలా అడుగుపెట్టాడో, లేదో ఆ రైలూ స్టేషను వదిలింది. అక్కడికి తను అదృష్టవంతుడేనని తనని తనే చాలాసార్లు అభినందించుకున్నాడు.

హడావుడిగా రైల్లో ప్రవేశించటంవల్లను, అంతకుముందే ఆ పెట్టెలో క్రిక్కిరిసి జనం ఉండటంవలను రఘుపతి చంకను ఉన్న గొడుగు ఎవరికో తగిలింది. వెంటనే ఆయన "ఏమండోయ్! మేస్టారూ? కాస్త ఆ గొడుగు చంకను తీసి చేత్తో పట్టుకుందురూ? వెనకాల వాళ్ళకి ఒళ్ళు హూనమయిపోతోంది!..." అన్నాడు.

"చిత్తం, చిత్తం" అంటూ తల పంకించి, గొడుగు చేతో పట్టుకుని, జేబు ఒకసారి తడిమిచూసుకుని, టిక్కట్టు పైకి తీసి, కళ్ళారా చూసి, జేబులో పెట్టుకుని, ఒక చేత్తో జేబుపట్టుకుని నుంచున్నాడు – ఎందుకైనా మంచిదని...

ఐదునిమిషాలు తిరక్కుండానే రైలు తరువాతి స్టేషనులో ఆగింది. ఒకరితరువాత ఒకరుగా ఆ పెట్టెలోంచి చాలామంది దిగిపోయారు. ఇదే అదునుకుని, ఖాళీయైన జాగాలో ఒకచోట భద్రంగా కూచుని, తన గొడుగు, చేతిసంచీ బెంచీమీదే తనకి దగ్గరగా పెట్టుకుని మనస్సుని కుదుటపరుచుకున్నాడు రఘుపతి.

తను కూచున్న పెట్టెవంతనీ ఒక్కసారి పరికించి చూశాడు రఘుపతి. అందులో జనం బాగానే ఉన్నారు. కాని ఇరుకుగా మాత్రం లేదు. కూచున్నవాళ్ళకి ఖాళీ బాగానే ఉంది. తగుమాత్రపు జనం ఉన్నారు.

ఇలాగ అనుకుని సంబర పడ్డంతసేపు పట్టలేదు – దిగినవారికి రెట్టింపుమంది ఎక్కి కూచున్నారు. కూచున్నారంటే సుఖాసీనులయ్యారని కాదు. మళ్ళా బోలెడంత మంది జొరబడ్డారు – ఆ పెట్టెలోకి.

"ఏదో ఒహ పెట్టె ఎక్కండయ్యా! ఇంకా ఇక్కడనయం! అదుగో – ఆముందు పెట్టెలో జనం తలుపులు బిడాయించుకు, ఛస్తున్నారు..." అని తనకుగల అక్కసంతా తీర్చుకుంటూ అరుస్తూ, ఒగురుస్తూ జనాన్ని గెంటుకుంటూ జొరబడ్డాడు ఒక బట్టతల ఆసామీ.

అతడు లోపలికివచ్చి రావటంతోటే అంతకుముందే లోపలికివచ్చి కూచునేందుకు చోటులేక నుంచుని ఉన్న లావుబాటి వ్యక్తిని అనుకోకుండానే గెంటాడు. ఆ ఊపుకి ఆలావు బాటివ్యక్తి తూలి తనకిసమీపంలోనే ఉన్న ఒక ట్రంకు పెట్టిమీద కూలబడ్డాడు.

"అయ్యో! అయ్యో! అదేమిటి? అందరు కూచుంటే ఇంక ఆ పెట్టె ఉంటుందటండీ? అలా చూస్తూ కూచుంటారేం? ఆ పెట్టెమీదనించి లేవమనండీ? – మీకేనండీ! – చెప్తోంటా?...అలా చూస్తూ కూచుంటారేం?..." అంది ఒక ఇల్లాలు భర్తతో.

"అదే – చూస్తున్నా!..." అన్నాడు ఆ భర్త.

"మీరు అల్లాగే చూస్తూ కూర్చోండి! ఈలోగా అదెలాగూ అప్పడమయిపోతుంది! ..."అంది ఆవిడ ఆలావుబాటి ఆయన్ని సాభిప్రాయంగా చూస్తూ – తన భర్తనుద్దేశించి.

"అయ్యో! అంత అఘాయిత్యం చేసేస్తున్నారేమిటి? అంతమాత్రానికే అప్పడమయిపోతుందా?..." అన్నాడు లావుబాటి ఆయన.

ఓ మోస్తరు బరువయితేనా!..." అంది ఒక కంఠం వెనుకనుంచి.

దాంతో అంతా ఘొల్లుమని నవ్వారు.



పెరటిలో మల్లెతీగ మొగ్గ తొడిగింది. ఆ చిన్న చిన్న మొగ్గలు పచ్చటి పరికిణీలు కట్టిన చిన్నారి, అందమైన తెల్లటి ముస్తాబయిన పాపాయిల్లాగ వున్నాయి. ఎన్ని మొగ్గలు! తీగ తీగకూ మల్లె మొగ్గలు. హృదయాల్ని కదిపి వేసే మల్లె మొగ్గలు. అద్భుతమైన సొగసూ, అంతకన్న అత్యద్భుతమైన పరిమళాల్నిచ్చే, సృష్టిలోకల్లా అత్యంత అద్భుతమైన, మానవమాత్రుడు దైవత్వాన్ని పొందడానికి అవకాశం కల్పించే, గొప్ప సృష్టి మల్లె మొగ్గలు!

మల్లె మొగ్గలు, మగువల మనసులు పరిమళాల్లో వికసించినట్లు వికసిస్తాయి. అవి కానమిచ్చే దివ్యమైన అనుభవాన్ని మానవులు ఎప్పటినుంచో, ఎంతో విందు హృదయాలతో అనుభవించి తమ తమ జన్మలు తరింప జేసుకొంటూనే వున్నారు.

మల్లె పొదుకు ఎదురుగా ఆయింటి పెరటి వైపు వరండాలో పడక కుర్చీలో కూర్చుని ఎంతో ఆప్యాయంతో ఆహ్లాదంతో మల్లె మొగ్గల్ని, అక్కడక్కడా వికసించిన మల్లె పువ్వులనూ చూస్తూ, ఊహాలోకంలోకి వెళ్లిపోతున్నాడు శంకరం.

శంకరానికీ ఆ మల్లె మొగ్గలకూ అవినాభావ సంబంధం! శంకరం ఆవూరొచ్చి ఆయింటికొస్తే గానీ ఆ మల్లెలు వికసించవు. ఆతీగలు

కొక్కాయ అడ్డు పడినంతపని జరిగింది క్షణం సేపు మాట్లాడలేక పోయాడు. నలుగురూ ఆయనకేసి చూశారు. కొందరు ముసి ముసి నవ్వులు నవ్వారు. మొత్తానికి అవ్యక్తి చిన్నపుచ్చుకున్నాడు.

"మహాబాగా అడిగారు! ఏదేశా అంతే ననుకోండి! ఎదుటి వాళ్ళకి చెప్పటమైతే మహా లేలిక? అదే తమ విషయం వచ్చేటప్పటికి అన్నీ మారిపోతాయి!..." అని సిద్ధాంతీకరించారు ప్రయాణీకుల్లో ఒకరు.

"అంతే కాదుటండీ—మరి? ఇందాకటి నుంచి ఆడవాళ్ళ మీదికి ఒంటికాలి మీద లేచిన ఆసామీ ఇప్పుడీ ప్రశ్న వేసే సరికి ఒడీ చప్పుడూ లేకుండా చతికిలపడాడేం?" అని జనాంతికంగా వ్యాఖ్యానించారింకొకరు.

ఇలా నలుగురూ నాలుగు మాటలూ అన్నారు. ఇంతలో ఇంత మంది దుయ్యబట్టారని ఎరక్క పోయాడు! పాపం!... ఎరిగి ఉంటే ముందే జాగ్రత్తపడి ఉండే వాగు.

ఇదంతా చూసిన రఘుపతి తనని తనే అభినందించుకున్నాడు. అక్కడికి తను అదృష్టవంతుడే!...ఇందాకా ఆ బట్టతల ఆసామీ అమాటలన్నప్పుడు అది విని తను ఊరుకున్నాడు. తనకి కలిగిన భావాలన్నీ లోపలే దాచుకున్నాడు గాని, పైకేమీ అనలేదు. అసలు అవన్నీ పైకి అనాలనే అనుకున్నాడు, కాని భగవత్కృపవల్ల అనకుండా ఉండిపోయాడు. అలా ఉన్నాడు గనక నే మాట దక్కింది. లేకపోతే వాళ్ళంతా ఈపాటికి తన మీద విరుచుకుపడవలసిన మాటేనా! ప్రొద్దుటే లేచిన వేళమంచిది. ఎవరి మొహం చూశాడో గాని ఈనాడు తన పరువు దక్కింది—అనుకున్నాడు.

అదీ కాక, అప్పుడంటే అలాగ అనిపించింది గాని, ఇప్పుడాలోచిస్తే ఆయన చెప్పిన దాంట్లో సబబేమీ కనిపించలేదు. లావుబాటి ఆయన చెప్పినట్లు ఈ వాడు తానొక్కడూ వస్తున్నాడు గనకనే అలా అన్నాడు గాని, సతీ సమేతంగా వస్తే అలాగ అనగలడా?...అమాటకొస్తే ఆయనే వని ఏమిటి? ఎవరూ అనలేరు! రోజులా బాతిగా గడ్డు రోజులయిపోయాయి. ప్రయాణాలూ చెయ్యటమే చాలా ఇబ్బందిగా ఉంటోంది. అటువంటప్పుడు ఇంక ఒంటరిగా—అందులోనూ ఆడవాళ్ళు—ప్రయాణం చెయ్యటం సాధ్యమని తోచలేదు రఘుపతికి.

ఈ ఆలోచనరాగానే రఘుపతికి తన భార్య సోమిదేవమ్మ గుర్తుకు వచ్చింది.

సోమి దేవమ్మ కాపరానికొచ్చి సుమారు పదిహేను సంవత్సరాలు దాటుతున్నప్పటికీ తాను సోమి దేవమ్మకలిసి ప్రయాణం చేసిన సందర్భాలు చాలా తక్కువగానే ఉన్నాయి. వాటిలో కూడా చాలావరకు తనతోపాటు తనతండ్రో, మామగారో మరే ఇతర బంధువులో ఉంటూనే వచ్చారు. ఇంకకూడా ఎవ్వరూ లేకుండా తామిద్దరే ప్రయాణంచేసిన సందర్భం ఒకే ఒక్కసారి కొచ్చోలు వచ్చింది. సరిగ్గా ఆనాటికే ప్రపంచ జనాభా యావత్తూ రైలుకి ప్రయాణం కట్టాలా?...అలా అందరూ ప్రయాణమయేసరికి రైలు కిటకిటలాడిపోయింది. ఒక్క పెట్టెలోనూ ఎక్కేందుకు వీలు చిక్కటంలేదు. ఉన్నంతలో కాస్త మెరుగా ఉన్నది ఆడవాళ్ళపెట్టె!... అందుకని సోమిదేవిని ఆ పెట్టె ఎక్కమన్నాడు—తను ఎక్కడో ఒకచోట కూచోవచ్చును గదా అని...ఆమె దానికి అంగీకరిస్తేనా? ... కూచోను గాక కూచోనంది! ఒక్కరెనూ ఆపెట్టెలో కూచోలేనంది. తనుకూడా ఉంటేనే గాని అంగీకరించనంది. ఆడవాళ్ళ పెట్టెలోకి మగవాళ్ళని ఎక్కనివ్వరన్నా గాని వినదే!... ఇంకెక్కడా చోటు లేదన్నా తనపట్టుదల వదలేదు! ప్రయాణమేనా మానుకోవటానికి సిదపడింది గాని తనని విడిచిపెట్టి వేరేచోట ఎక్కను గాక ఎక్కనంది?...ఆనాడు ఆమెకు, తనకు నుంచునే మాత్రపుచోటు చూసే సరికి తనకి తలప్రాణం తోకకి వచ్చింది.

అలాంటి ఆడవాళ్ళు తప్పకుండా ఉంటారు. బట్టతలాయనకు ఏం తెలుసును గనక?... లావుబాటి ఆయన చెప్పినదే నిజం!...ధైర్యంగా కూచోగలిగే ఆడవాళ్ళకి వేరేపెట్టె లెలాగూ ఉన్నాయి గాని, అలా కూచోలేని వాళ్ళకి మాత్రం అన్ని పెట్టెల్లోనూ ప్రవేశముండాలనటం ధర్మంగానే కనిపించింది రఘుపతికి.

సోమిదేవమ్మ గురుకు రావటంతో రఘుపతి దృష్టి గృహసమస్యలకేసి మళ్ళింది. అంతటితో గుండె బరువెక్కినటయింది.

"ఈ సంబంధమేనా కుదిరితే బాగుండును..." అనుకున్నాడు రఘుపతి—మరోకసారి.

రఘుపతి పెద్దకూతురుకి పదిహేనేళ్ళంటాయి. ఆమెకు పదేళ్ళు వచ్చినప్పటి నుంచీ తను పెళ్ళిప్రయత్నాలు చేస్తూనే వున్నాడు శక్తివంచన లేకుండా. అయితేనేం! కలిసి రావద్దూ?...ఒక్క సంబంధం కుదరలేదు... తాను ఎంత ఆదుర్దాగా ఉన్నాడో అంతగానూ అది వెనక్కు వెనక్కు వెడుతోంది. పిల్ల వ్యకురాలు కాకుండా ఒక అయ్యచేతిలో పెడుదామనుకున్నాడు గాని, తన అభిప్రాయం కార్యరూపం దాల్చకముందే ఆమె వ్యక్తురాలయింది. దాంతో తనకి కొంత హుషారు తగింది. బాధ్యత యావత్తూ విధిమీద పడేసి తను ప్రయత్నిస్తున్నాడు. ఈ నాటివరకూ ఏ ఒక్కటీ సానుకూల పడలేదు. ఇప్పుడొక సంబంధాన్ని గురించి ఎవరో చెప్తే వారిని కలుసుకోవటానికని వెడుతున్నాడిప్పుడు......అందుచేత నే ఇదైనా కుదిరితే బాగుండు ననుకున్నాడు.


ఇలాగ ఆలోచిస్తూండగా తోటి ప్రయాణీకుల కబురు అటుతిరిగి ఇటుతిరిగి చిట్టచివరకు బడిపంతుళ్ళమీదికి మళ్ళింది.

అంతవరకూ వాళ్ళు ఏం మాట్లాడుతున్నారో తానయితే సరిగా వినలేదుగాని, తనదృష్టి ఆ సంభాషణవైపుకి మరల్చేసరికి బట్టతలాయన అంటున్న మాటలు ఇవి:

"మీరు నూరు చెప్పండి! ... వెయ్యి చెప్పండి!...అసలు ఈ చదువులిలా పాడైపోవడానికి కారణం బడిపంతుళ్ళే నంటాను ...ఇదివరకు మేష్టర్లిలాగే ఉండేవాళ్లా? వాళ్ళు ఎంత ఇదిగా ఉండేవారు? ఏమిటి కథ?...ఆఁ!..." అని నలుగురిముఖాలలోకి చూశాడు—వారి అంగీకారానికి వేచి వున్నట్లు...

"ఆఁ!...వాళ్లేం చేస్తారయ్యా? అందరిలాగే ఉన్నారు. వాళ్లు...అసలు చదువులంటే ఇప్పుడు శ్రద్ధఎక్కడుంది? ఎంతసేపూ కుర్రాడు ప్యాసవాలనే తప్ప వాడికో అక్షరం ముక్క రావాలనుకునే వాళ్ళేరీ—ఈ రోజుల్లో. పాడు చేసినది అందరూ అయితే

(47-వ పేజీ చూడుడు)



[ఉద్యోగపర్వమునుండి]

వ. మనకు విడిదల కురుక్షేత్రం బని పలికి దుశ్శాసనుం జూచి నీవును గర్ణుండును గాంధారపతియును సమస్తంబును సమ కట్టుం దనుటయు వారలు ప్రియంబునం బని పూని వెడలి దండు సాటించి తగువారల కెల్ల నెఱింగించి వచ్చిన సకల పరివారంబును బ్రమోదంబు నొందె భూవల్లభుండును గొలిచి యున్నవారలం బోవం బంచి వలయు నెడకుం జని తగినవర్తనంబున నుండె నట్టి సమయంబునఁ బ్రయాణోచితంబు లగు బహుప్రకారవ్యాపారంబులయందుఁ దత్పరు లయిన దొరల నానాచేష్టితంబులను గరితురగరథంబులకు సవరణలు సమకూర్చుచతురపరిచారకుల సంభ్రమంబులను వివిధాయుధంబులు రవణంబులుగా నాయితంబులు సేయఁ బ్రవర్తించుపదాతివర్గంబుల సంరంభంబులను నశ్వైపరకులు పయనంబున కనువు సేయు బలుమానుసుల తిరుగుడువడుటయుం బురంబు సమరోత్సాహచంద్రోదయంబునకు మహార్ణవం బై ఘూర్ణిల్లుచుండె నపరదినముఖంబున.

క. త్వరితగతి సమయసముచిత, కరణీయము లాచరించి కమనీయాలం
కరణోజ్జ్వలుఁ డై యెలమిం, గురురాజే తెంచెఁ గొలువుకూటంబునకున్.

వ. వచ్చి దుశ్శాసనప్రముఖనిఖిలసహోదరపరివృతుం డై యుండి.

దుర్యోధనుఁడు ద్రోణప్రభృతుల సేనాపతులం జేయుట

సీ. అరిభయంకరుఁడు ద్రోణాచార్యుఁడును రణోత్సాహలంపటుఁడు రాధాసుతుండు
శరతత్త్వవేది యశ్వత్థామయును భూరిబాహావిలాసుండు బాహ్లికుండు
శౌర్యవైభవశాలి శల్యుండు ధైర్యసంపన్నిధి కృపుఁడును బ్రకటశక్తి
పారదుర్జయమూర్తి భూరిశ్రవుండును దర్పోజ్జ్వలుండు గాంధారపతియు

తే. నుగ్రతేజుండు కృతవర్మయును బ్రతాప, ఘనుఁడు గాంభోజుఁడును బరాక్రమధనుండు
సింధురాజును బతులుగాఁ జేయఁ గోరి, కౌనఁగఁ దగువార లగుదు రక్షోహిణులకు.

చ. అని మది నిశ్చయించి తగ నందఱఁ బిల్వఁగఁ బంచి వారితో
ననిపని మాటలాడి వినయంబునఁ బ్రార్థన సేసి మీర లీ
యొనరిన సైన్యముల్ పదునొకొంటికిఁ బ్రాభవ మాచరింపఁ జొ
చ్చిన సకలంబు నొప్పు నభిషేకము గైకొనుఁ డుత్సవంబుగన్.

క. అనవుడు నందఱు నొఁ గా. కని సంతన మంద నధిపుఁ డభిషేకించెన్
జను లెల్ల సంప్రమోదం,బునఁ బొందఁగ నప్పు డతి విభూతిం బ్రభులన్.

వ. ఇట్లు మహామహిమ వెలయ నక్షోహిణీనాయకుల సమకట్టి రారాజు పితామహుపాలికి వారిం దోడ్కొని చని వినయంబుగా నతనికిఁ బ్రణామంబు సేసి వారలం జూపి వీరల మనయక్షోహిణులు పదునొకొంటికిం బతులఁ గావించితి నన్ని సైన్యంబులు నొక్కలావున వర్తించుచందంబు సూచికొనవలయు నని చెప్పుచుఁ జేతులు మొగిచి యిట్లనియె.

చ. నెఱిఁ బడి యాజి నీ మొనలు నేరవు గూడి తగం జరింప నిం
దఱుమన సౌఖ్యుఁ డై చనక తప్పఁ గదా బహు దేశవాసు లం
ద యొకటి సేయుచో వెరవు దప్పక చెల్లుట యెట్లు గల్గు ని
త్రైఱఁ గొకచాలువాని బలుతీర్పునఁ గాక పొసంగ నేర్పునే.

ఆ. అసుర సేనలును దమంతన వర్తింప, నేర కునికి నా కుమారు మొగము
గా నొనర్ప వలసెఁ గాదె సమస్తసే,నలను నీవ యరసి నడపవలయు.

క. తారలకుం జంద్రునిగతిఁ, గౌరవులకు మేటి వీవ కావున నీ వీ
భారంబు పూని మముఁ గడ, చేరువఁ దగు నెమ్మియుం బ్రసిద్ధచరిత్రా.

తే. సర్వసేనాధిపత్యంబు నిర్వహింప, నీవు దక్క నిం దొక్కరు నీవ యరసి
చెప్పుమా కలఁడే ని రక్షింపు మమ్ముఁ, బూని పట్టంబు దాల్చుము పొడిచి గెలువుము.

వ. అనిన విని గాంగేయుండు గాంధారేయున కిట్లనియె.

ఆ. మీరుఁ బాండుసుతులు నారయ నాకొక్క, రూప కార్యమున్న రూపు వలుక
వలయుఁ గయ్య మైన వత్తు మీలోన నా, యునికి చందమునకు నుచిత మిద్దియ.

క. సేనాధిపత్యమును దగఁ, బూనెద నను మార్కొనంగఁ బురుషుల నుర్విం
గానఁ గిరీటికి నొక్కని, కే నోర్వ నతండు శరము లెక్కు డెఱుంగున్.

క. పెఱవారి నెల్లఁ దర మిడి, నఱకుదుఁ బాండుక్షితీశనందనులను రూ
పఱ నేయం జే యాడదు, దఱుమరు నామీఁద నత్యుద్వ్రగత వారున్

వ. అప్పటికిఁ దగినభంగి యయ్యెడు నది యట్లుండె నని పలికి మఱియు నిట్లనియె.

ఆ. మున్న కర్ణునొండె నన్నొండెఁ గయ్యంబు, సేయఁ బనుపు మిట్లు సేయువాఁడ
వైనఁ గాని సకల సేనాధిపత్యంబుఁ, బూన నేరఁ జుమ్ము భూపతనయ.

వ. అనినం గర్ణుండు గౌరవపతితో నిట్లనియె.

క. ఇప్పుడు గ్రొత్తగ దీనిం, జెప్పంగా నేల మున్న చెప్పితిఁ గాదే
యెప్పుడు భీష్ముఁడు వడు చే నప్పు డనికి వచ్చువాఁడ నని సభలోనన్.

ఆ. అనిన నట్ల కాక యని సర్వసేనాధి,పత్యభారపట్టబంధమునకు
నియ్యకొనియె భీష్ముఁ డయ్యగ్గలికఁ గొని, యాడె విభుఁడు ప్రముదితాత్ముఁ డగుచు.

క. భేరీమృదంగశంఖకు, లారవములు సెలఁగఁ జేయుఁ డని పనిచి మహో
దారపతాకాద్యుత్సవ, గౌరవములు నడపె నెల్లకడలం బురిలోన్.

వ. ఇట్లు పట్టణాలంకారంబు సంఘటించి రత్నకాంచనకలధౌతమయంబు లగు కలశంబులఁ దీర్థజలంబు దెప్పించి మణి
ప్రకరంబునఁ గుసుమనికరంబున మంగళ తరుత్వక్ప్రచయంబున మహౌషధిచయంబున విహితమంత్రంబుల నుచిత
తంత్రంబుల ఋత్విక్పురోహితసహితుం డై తత్సంస్కార ప్రకారం బాచరించి.

క. గురుఁడును గృపుఁడును లోనగు, గురు లనుమోదింప బాహ్లికుండు మొదలుగాఁ
గురుజాతి యెలర్పఁగ న, న్నరపతి భీష్మాభిషేచనం బొనరించెన్.

తే. ఇవ్విధంబున నభిషేక మెలమిఁ జేసి, పరమభక్తి నక్షౌహిణీపతులఁ జూపి
వీరికిని సైన్యములకును మీర యొడయ లనుచుఁ బట్టంబుగట్టె శంతనుతనూజు.

క. అత్తఱిఁ బాషాణంబులు, నెత్తురు నెమ్ములును గురిసె నిష్ఠురనినదా
యత్త మయి నభము పిడుగుల, ముత్తంబులు వడియె నగరమున నెల్లెడలన్.

క. దానికి జను లుత్సాహహాని, హీనతఁ బొందంగఁ గౌరవేంద్రుఁడు నానా
దానాదు లయిన శాంతివిధానము లొనరించి యాన తత్పరమతి యై.

క. తల్లియుఁ దండ్రియు వెఱఁగునఁ, బుల్లవడఁగ వారికడకుఁ బోయి తడయఁగా
నొల్లక పయనపువీడ్కో, లెల్లను దనయిచ్చ నడపి యేడ్తెఱ వెడలెన్.

తే. వెడలి తమ్ములుఁ దగువారు వివిధభృత్యగణముఁ దానును నేల గ్రక్కదలఁ గదలె
రాజరాజు గాంగేయుఁ బురస్కరించికొని సముద్ధతి నడచె దిక్కులు వడంక.

వ. నడచి కురుక్షేత్రంబు దఱియం జొచ్చి యం దొక్కరమణీయ ప్రదేశంబు విడిదలగా నిరూపించి నిలిచి భానుసూనుం
డునుం దానును మెలంగి యెల్లవారిని విడియించి నడుమ నిజనివాసంబు గావించినఁ గౌరవేశ్వరుస్కంధావారంబు
వారణపురంబున నెవ్వ రెయ్యెడ వసియింతు రాచందంబున నందంబై యొప్పె నిట్లు రెండుపీఁకలును సన్నద్ధంబు లైన
సమయంబున.

ఉ. సంధికి నేఁగి కార్యము పొసంగక కృష్ణుఁడు రాకయుఁ సుహృ
ద్బాంధవసంఘము క్రమముగఁ బాండవకౌరవవీరు లప్పుడి
క్సింధురకంధరంబు లడఁగించుబలంబుల పెల్లుతోడ గ
ర్వాంధత నాజి కెత్తుటయు నాబలభద్రుఁడు విన్కి నార్తుఁడై.

బలరాముఁడు పాండవుల వీడ్కొని తీర్థయాత్ర వోవుట

వ. కతిపయపరివారంబు పరివేష్టింప రయంబునం జనుదెంచి సముచితప్రకారంబున ధర్మనందనుం బేరోలగంబునం గని సంభ్రమాలింగనాసనార్ఘ్యపాద్యంబుల నతనిచేత సంభావితుం డయి దామోదరభీమార్జుననకులసహదేవుల యభివాదనంబు లాదరించి పాంచాలవిరాట్ప్రముఖు లగు తగువారలవినయంబుల నభినందించి యా దొరలతోడఁ దత్కాలయోగ్య మిత సంభాషణంబులు సేసి యనంతరంబ వారల కిట్లనియె.

క. కౌరవపాండవు లెంతయుఁ గ్రూరత వాటించి బంధుకోటికి నిఖిలో
ర్వీరమణులకుం జేటుగఁ, బోరికిఁ దెగి రిట్టిఘోరపుంబని యగునే.

తే. ఇట్టిదానికి నోర్వక యెన్నఁడేనిఁ గృష్ణుతోడనేఁ జెప్పితిఁ గినిసి యిరుదె
ఱంగువారికిఁ దగఁ జెప్పి సంగతంబు సేయు మని యెంత సెప్పినఁ జేయఁడయ్యె.

క. పలుకులపొం దెఱుఁగనివా, రలఁ బూజావాక్యములఁ దిరంబై తనకుం
దెలుపం దగదే యే మని, యలుక మెయిం సంధి చెఱిచి హరి యేతెంచెన్.

తే. వీరు వారును సంబంధవిషయబంధు, లగుట సరి గాదె హరికిఁ దా నర్జుననకుఁ
బక్షపాతంబు సేయుటఁ బాండవులను, బెట్టుచోటులు గానక పట్టెఁ గాలు.

ఉ. కావున వీరికిం జయము గల్గుట నిశ్చయ మెల్ల భంగులం
జావు నిజంబు వారికి నసంశయ మై యిటు లుండ దీనినె
ల్లే వినఁ జూడ నేర్తుఁ దగ నింతప్రవీణుల నేన చేసితిం
జూవె సుయోధనుం బవనసూనుని నొండొరుఁ జంపఁ జూతునే.

క. హరి యెఱుఁగనిచక్కటియుం, బురుషార్థము నా కెఱుంగఁ బోలునె యీని
ష్ఠురత వినఁ జూడఁ జాలక, సరస్వతీ తీర్థమునకు జనియెదుబుద్ధిన్.

వ. మీకుం జెప్పి పో వచ్చితిఁ బోయి వచ్చెద నని పలికి బలదేవుండు వాసుదేవ ధర్మపుత్త్రు లాదంబడి యనుపఁ దీర్థయాత్ర వోయెఁ దదనంతరంబ.

రుక్మివృత్తాంతము

సీ. కృష్ణునిదేవి రుక్మిణిసోదరుడు రుక్మి యనువాఁడు బలవిక్రమాన్వితుండు
శార్ఙ్గగాండీవ విజయములు నాఁ గల దివ్యచాపములఁ దృతీయ మైన
చాపంబు గలవాఁడు సైన్యసమేతుఁడై చనుదెంచి ధర్మజుఁ గని తదీయ
సత్కారములు గాంచి సముచితాసనమున నుండి యక్కొలువున నున్న వీరు

ఆ. లెల్ల వినఁ గిరీటి కిట్లను సమరంబు, సేయ వెఱచితేనిఁ జెప్పు నాకు
నెదురు లేరు జగతి నెవ్వరు నీకుఁ దో,డ్పడి జయింతు నెట్టిపగఱ నైన.

వ. అని తన్ను నాక్రమించి తనతోఁబుట్టువు రుక్మిణిం గొని వచ్చిన యాకృష్ణు సన్నిధిన సిగ్గు లేక యాడినమాటలు విని చిఱునవ్వు నవ్వుచుం గవ్వడి యతనియాననం బాలోకించి.

తే. చెనసి గంధర్వసేన నిర్జించునపుడు, మత్స్యనాథుగోవర్గంబు మరలఁ దెచ్చు
నెడను దప్పెనీకందువ యెఱుఁగనైతి, నింక నాఁ గాని తోడు గమ్మెచటికైన

వ. అని యతనియుత్తరమునకుఁ దగినయట్ల పలికి మఱియును.

క. మున్నే నసహాయుఁడ నై, చన్నకడం జనఁగ నైనచందం బయ్యెన్
వెన్నుఁడు దోడు గలఁడు వెఱ, పెన్నండును వలవ దింక నేమిటికైనన్.

చ. వెఱచితి రాఁ గదే యనిన వెండికదా పగఁ దీర్తు నీవు నా

వెఱ పెటు లున్న నీరథికవీరులు వాపెద రొల్ల నిన్ను నీ
యుఱుకడ కేఁగి తోడుపడు మొల్లకు నెవ్వరికేని నన్న నే
డ్తెఱ నతఁ డేఁగి కౌరవపతిం గని యట్టుల చెట్టువల్కినన్.

క. అతఁ డివి యేటిమాటలు, నీతో డగు టొల్లఁ బొమ్మనిన రుక్మివృథా
యాతాయాసవిషణ్ణుం, డై తనపురమునకు మగుడ నరిగెం బెలుచన్.

తే. ఇట్లు బలదేవరుక్మల కిద్దఱకును, గయ్యమునకు సన్నాహంబు గలుగదయ్యెఁ
గాని తక్కలోకమ్మునఁ గలుగునృపతి, కోటి యిరువాఁగునందును గూడె ననికి.

వ. అట్టియెడ నిశాసమయంబున ధృతరాష్ట్రుండు సంజయు రావించి యి ట్లనియె.

క. బవరము గీ దని యెఱుఁగుదు, నవినీతుం డైన కొడుకు నదలిచి యుడుపం
దివిరియు నోరాడమి దై, వవశం బప్పనికి మనకు వగ పిం కేలా.

క. ఎయ్యది గా నున్నది యది, యయ్యెడుఁ జేయునది గలదె యవనీశులకుం
గయ్యానఁ జచ్చుటయు మే, లయ్యెప్పట లెన్నగాక యది యట్లుండెన్.

వ. రెండువీళ్లను గురుక్షేత్రంబున విడిసినపిదపం బుట్టినవిశేషంబులు గలవేని నెఱింగింపుము.

సంజయుండు ధృతరాష్ట్రుని కులాకుండు పాండవుల నాడినమాటలు సెప్పుట

తే. అనిన సంజయుఁ డిట్లను నకట కొడుకు, మీఁదఁ దప్పు పెట్టెదవు నీమీఁదికొఱఁత
నీకుఁ గానంగ వచ్చునె నీ వెఱుంగ, కుండఁ బఱచెనె యాతండు పాండుసుతుల.

వ. ఆ పని గడవంబడియె వార్తలు వినియెదవేని వినుము దుర్యోధనుండు దుశ్శాసనశకునికర్ణులతో విచారించి యులూ కుం బిలిచి నీవు వోయి పాండవులం గని వాసుదేవుసన్నిధిని బాంచాలవిరాటప్రముఖులు వినఁ బలుకు మని పరుసని మాటలు గఱపి పుచ్చిన నతండును.

క. చని కొలువున ధర్మసుతుం, గని దుర్యోధనుఁడు సెప్పఁ గా నను నియమిం
చినమాటలు గొన్ని కలవు, విను మలుగక యనిన నతఁడు విని యిట్లనియెన్.

ఆ. నీకు వెఱవ నేల నిన్ను నాబుద్ధిమం, తుండు సెప్ప మనిన తులువమాట
లెన్ని గలవు వాని నన్నింటి ననుమాన, మింత లేక యాడు మెల్ల వినఁగ.

వ. అనిన నులూకుం డిట్లనియె.

సీ. కయ్యంబునకుఁ బెద్దకాల మేనియుఁ బూఁచి పట్టి వచ్చితి కడుబరవసమున
సంజయుతో మీరు శంక లే కాడిన యెక్కుడుమాటలు పెక్కుగలవు
భూమిభాగము గోలుపోయినయలుకకు ద్రౌపదిఁ బఱిచినదైన్యమునకుఁ
దగ మంచిబంట వై తఱి.యిది బాహుబలాస్త్రవిద్యలు సూప నని తలంచి

ఆ. నిలువవలయు నీకుఁ గలవారి నెల్లను, గూర్చి మోహరించికొని కడంగి
నడవు సమరమునకు వెడజంకఁ బో దింకఁ, దప్పఁ గుంక లేదు తఱికిఁ జొరుము.

క. ఆతతబలుఁ డగుభీష్మని, చేతి బలువు ద్రోణునంపసెల లవియుటయుం
జాతు రటు రండు కృష్ణుని, చేతన సకలంబుఁ జక్కఁ జేసికొనుండీ.

క. వారిద్దఱవాలమ్ముల, బారిం బడి యర్జునునకు బ్రదుక వశమె మీ
వా రెల్ల నెఱుంగరె య, వ్వీరుల దివ్యాస్త్రశస్త్రవిభవసమృద్ధుల్.

వ. అని భీమసేనుం జూచి.

క. ఈ వాయుపుత్త్రుఁ డాజిం, ద్రావుదు నే దున్నసేనుర క్తం బనియెం
ద్రావఁగ శక్యం బేనిం, ద్రావు మనఁగ రాదె యింకఁ దడ వేమిటికిన్.

క. విను నూతికప్పవిధమున, నిను నీవ యెఱుంగు దెఱుఁగనేరవు గర్వం
బున నావలికొలఁది రణం, బున నొకమరి పెట్టువడక పో నేర్చెదవే.

వ. అని పలికి సవ్యసాచిం జూచి.

★

ఆంధ్రసచి
బాలల

పరీక్షలు అయిపోయి ఫలితాలు తెలిశాయి. కొత్త తరగతులు, కొత్త పాఠ్య పుస్తకాలు, కొత్త ఉపాధ్యాయులు, కొందరికి కొత్త పాఠశాలలు—అంతా కొత్త వాతావరణం; చాలా సంతోష ప్రదమయిన వాతావరణం. ఈ కొత్త పరిస్థితులలో మీరు పొందే సుఖానుభూతిలో ఆంధ్ర సచిత్ర వారపత్రిక కూడా భాగస్వామి కావాలని కుతూహలపడుతూ ఒక శుభ వార్త అందజేస్తున్నది. 1958 జూలై 1 వ తేదీనుంచీ బాలల సంఘం ఒకటి స్థాపించబోతున్నది. జులై 1 వ తేదీ నాటికి 15 సంవత్సరాల వయస్సు నిండని, ఐదేళ్ల వయస్సుకు తక్కువగాని ప్రతి తెలుగుబాలుడూ, బాలికా సభ్యత్వం పొందవచ్చు. సభ్యత్వానికి రుసుమేమీ చెల్లించవలసిన పనిలేదు. తెలుగు బాల బాలికలందరూ వెంటనే సభ్యులుగాచేరి అప్పుడప్పుడు నిర్వహించే చిన్న చిన్న పోటీలలో పాల్గొని సంఘ ఆశయాలను జయప్రదం చేయడానికి సహాయపడతారని ఆశిస్తున్నాము; ఆయా బాల బాలికల తలిదండ్రులు, సంరక్షకులు, పాఠశాలల ఉపాధ్యాయులు మాకృషిలో సహకరిస్తారని విశ్వసిస్తున్నాము.

★ గమనించవలసిన ముఖ్య విషయాలు ★

సభ్యులుగా చేరదలచిన బాలబాలికలు చేయవలసిందొకటే. దీనితోపాటు ఒక సభ్యత్వపు దరఖాస్తును ముద్రిస్తున్నాము. అందులోని ఖాళీ స్థలాలను మీ వివరాలతో జాగ్రతగా నింపి (కొట్టివేతలు, తుడుపులు వుండకూడదు) ఆ అచ్చు దరఖాస్తును కత్తిరించి కవరులో సంపాదకుడు,

ఆంధ్ర పత్రిక సచిత్ర వార పత్రిక,

తంబుచెట్టివీధి, మద్రాసు—1.

అనే చిరునామాకు పంపాలి. కవరుమీద వెనుకవైపు "సచిత్రవార పత్రిక బాలల సంఘం" అని స్పష్టంగా వ్రాయాలి.

చేతితో వ్రాసిపంపే సభ్యత్వపు దరఖాస్తులను స్వీకరించము.

ఒక్కొక దరఖాస్తుమీదా ఒక్క సభ్యుని లేదా, సభ్యురాలిపేరు మాత్రమే వుండాలి. ఒక కుటుంబంలోని నల్గురు బాలబాలికలు సభ్యులుగా చేరదలిచినా, విడివిడిగా నాల్గుదరఖాస్తులు వాడాలన్నమాట. సభ్యత్వపు దరఖాస్తును సచిత్ర వార పత్రికలో సాధ్యమైనంతవరకు వారం వారం ప్రచురిస్తుంటాము.

పూర్తిచేసిన దరఖాస్తుతోపాటు ఒక్కొక్క సభ్యుడూ (సభ్యురాలు) 8 నయాపైసల తపాలాబిళ్లల పంపితే, సభ్యులుగా చేర్చుకున్నట్లు ఒక్కొకరికీ విడివిడిగా ఒక్కొక సభ్యత్వపు కార్డును పంపుతాం. ఆ కార్డుమీద సభ్యత్వక్రమాన్ని సూచించే ఒక సంఖ్య వుంటుంది. ముందు ముందు సభ్యులుగానూ సంఘంగాని జరిపే ఉత్తర ప్రత్యుత్తరాలన్నింటిలోను ఆ సంఖ్యను ఉదహరిస్తూండడం జరుగుతుంది.

పదిహేనేళ్ళ వయస్సు పూర్తి కాగానే, ఆ తేదీతో బాలలసంఘంలో సభ్యత్వం దానంతట అదే రద్దయిపోతుంది.

(1) సభ్యులుగాచేరే బాలబాలికలను ఆరుమొదలు పదేళ్ళవయస్సువరకూ ఒక వర్గంగానూ, పదకొండు మొదలు పదిహేనేళ్ల వయస్సువరకు మరొకవర్గంగానూ విభజించి ఉభయవర్గాలకు విడివిడిగా అప్పుడప్పుడు రెండురకాల పోటీలు నిర్వహించి ప్రథమ శ్రేణిలో నెగ్గేవారికి మా తోచిన బహుమతుల నివ్వడం. (ఈవిషయంలో

చిత్రవారపత్రిక సంఘం

పోటీ నిర్వాహకర్తలదే తుది నిర్ణయం)

(2) సభ్యులలో వారి వయస్సుకు తగినట్లుగా రచనా సక్తినీ, పఠనాసక్తినీ, కళాభిమానాన్నీ యథాశక్తి పెంపొందజేయడం.

(3) చిత్రలేఖనం, నృత్యం, అభినయం, గాత్రం వీణ, వయొలిన్, మొదలైన లలితకళలలో ప్రత్యేక అభిరుచీ, ప్రవేశం కనబరిచే బాలబాలికలను బహుమతుల ద్వారానూ, తదితర విధంగానూ ప్రోత్సహించడం.

(4) ఏ ప్రాంతంలో నివసిస్తున్న వారైనప్పటికీ తెలుగు బాల బాలికలందరిమధ్యా స్నేహ సమైక్య భావాలను పెంపొందింపజేయడం.

(5) ఉన్నతపాఠశాలలలో చదివే విద్యార్థులకు ఉచిత విద్యార్థివేతనాలు బహూకరించడం. దీనికి సంబంధించిన వివరాలను ఉత్తరోత్తరా ప్రకటిస్తాము.

[సభ్యత్వపు దరఖాస్తు]

సభ్యుని (సభ్యురాలి) పూర్తిపేరు (విడివిడి అక్షరాలలో) ...

పుట్టినతేదీ, నెల, సంవత్సరం: జులై 1 నాటికి వయస్సు ...

తండ్రి, లేక, సంరక్షకుని పూర్తిపేరు : ...

ఊరిపేరు, జిల్లా, తాలూకా, పోస్టు ...

చదువుతున్న తరగతి, లేక, ఫారము : ...

పాఠశాల పేరు : ...

ప్రధానోపాధ్యాయునిపేరు (తెలిస్తే) : ...

అర్యా :

ఆంధ్ర సచిత్ర వారపత్రిక బాలల సంఘములో నన్ను సభ్యునిగా/సభ్యురాలుగా చేర్చుకొనప్రార్థన. పైన వ్రాసిన విషయాలన్నీ యదార్థములు.

ఇట్లు

(సంతకము)

* షరా : ఏ పాఠశాలలోనూగాక ఇంటివద్దనే ట్యూషన్ చెప్పించుకొనే బాలబాలికలు కూడా సభ్యులుగా చేరవచ్చు. 'చదువుతున్న తరగతి' అనే విషయానికి ఎదురుగా 'ప్రైవేట్ స్టడీ' అని వ్రాయాలి.

సంచిక: 18-6-58] ఈ దరఖాస్తు 21-6-58 వరకే చెల్లుతుంది.

పెళ్ళి కానుకలు

పవని నిర్మలప్రభావతి

పెళ్లి పందిరి కిటకిటలాడుతోంది. ఎటు చూసినా ఆనందం పరవళ్లు తొక్కుతోంది. ఓ వేపు వేదికమీద బ్రహ్మాండంగా తలంబ్రాలతంతు జరుగుతోంది. ఊపిరంతా బిగబట్టి మేళం వాయించేస్తున్నారు వాద్యగాళ్లు. శేఖర్ పెళ్లికొడుకు హోదాలో ఒక్కసారి చుట్టూ కలయజూశాడు. ఎదురుగా ఓ గుంపుగా క్లాస్‌మేట్సు అందరూ చిరునవ్వులతో చేతులో పేకెట్స్‌తో కనిపించారు. శేఖర్ మెల్లగా తనలో తను నవ్వుకున్నాడు. తనకు రాబొయ్యే కానుకలను గురించి ఏవేవో ఆలోచనలు ఒక్కసారి మనస్సులో మెదిలాయ్! బహుశా సూర్యం టార్చిలైటు తెచ్చుంటాడు వేణు ఫ్లాస్కు చదివిస్తాడు. మురళి ఎంతలేదన్నా ఓ చక్కటి పెన్ ఇస్తాడు. ఇక పోతే రామం చంద్రం బహుశా తన కిష్టమైన బెర్నార్డ్ షా డ్రామాస్ ఏవైనా చదివిస్తారేమో! ఇంతకు ముందెన్నోమాట్లు తనకు 'షా' డ్రామాలంటే ఇష్టమని చెప్పాడు గాబట్టి! ఎలా అయితేనేం తన క్కావల్సిన—కోరుకుంటున్న ముఖ్యమైన వస్తువు పుస్తకాలను—తన ఫ్రెండ్స్ చదివిస్తారు!

"ఆ! ఇక చదివింపులు కానీండి!" పురోహితుడికేక ఒక్క శేఖరాన్నే కాకుండా, మంత్రాల ప్రభావానికి కునుకుపాట్లుపడుతున్న అందర్నీ కూడా లేపేసింది!

ఒక్కుమ్మడిగా పెళ్లికొడుకు బంధువులు, పెళ్లికూతురివేపువాళ్లూ ముందు కొచ్చారు. పోటాపోటీలమీద చదివించేస్తున్నారు ఇరుపక్షాలవాళ్లు. శేఖర్ పక్కన కానుకల లిస్టురాసు కోటానికి ఆనంద్ కూచున్నాడు. ఎవరో ఓ వెండికప్పు చదివించి వెళ్లారు. ఆనంద్ చిరాగ్గా అన్నాడు మెల్లిగా "శేఖర్! చూశావ్రా అందరూ ఏ వెధవ కప్పో, డబ్బో చదివించడమే కానీ—ఈ నవ్య సాహిత్యాన్ననుసరించి ఏదైనా చక్కటి డిటెక్టివ్ నవల ఏదైనా చదివిస్తాడేమో చూడు!"

శేఖర్ 'ఊ' అంటూ చిరునవ్వు నవ్వాడు.

బంధువుల చదివింపు లయిపోయాయ్. శేఖర్ ఫ్రెండ్స్ సుమారు ఇరవై మంది తోసుకుంటూ ముందు కొచ్చారు.

పురోహితుడి చేతికివ్వటం. ఆయన మళ్ళీ మంత్రాలతో ఆ కానుక నందజెయ్యడం ఏమంత బాజాగా లేదనుకున్నారేమో-ఎవరికి వాళ్లు ఎదురుగా వచ్చి నిలబడి పేరు చెప్పుకుని ఆ వస్తువునిచ్చిపొయ్యే ఏర్పాటు చేసుకున్నారు. మొదట సూర్యం ముందు కొచ్చాడు. ఇంగ్లీషులో శేఖర్‌ను దీవించి పాకెట్ విప్పి ఓ పుస్తకం ఇస్తూ అన్నాడు: భయంకర డిటెకివ్ నవల అనుకోని హత్య!"

"శేఖర్ విస్తుపోయాడు పుస్తకాన్నందుకుంటూ.

ఆనంద్ హాయిగా నిట్టూర్చాడు రాసుకుంటూ.

వేణు వచ్చాడు-మామూలుగానే అతనూ బ్లెస్సింగ్స్ చెప్పి పుస్తకాన్నిస్తూ గర్వంగా చూచి అన్నాడు; "మరో శవం!"

శేఖర్‌కు కళ్లు తిరిగాయి! వాచ్ కేసి చూశాడు పిచ్చిగా. ఒంటిగంట!

రామం, చంద్రం గబగబ చదివారు ఒక్కసారే! "మూడు హత్యలు!", "నాలుగు శవాలు!"

ఈసారి ఆనందమోహన్ కూడా కాస్త చలించక పోలేదు.

శేఖర్‌కు మాత్రం మరేం వినిపించటం లేదు.

వరసన చెప్పుకు పోతున్నారు బహుమానాల పేర్లు.

"కాల్చిన శవం!"

"కాలని శవం!" (భీభత్స, భయంకర రసాలసమ్మేళనం)

"కాలీ కాలని శవం!"

"గదిలో హత్య!"

"మేడమీద హత్య!"

"అంతు తేలని హత్య!" (హృదయ బలహీనత కలవాళ్ళు చదవవలదని ప్రార్థన.)

"ఇది హత్యే"

"ఆత్మహత్య కాదు!"

ఆనంద్ బరువుగా నిట్టూరుస్తూ మొహామున్న చెమటను ఓసారి ఘట్టిగా తుడుచుకున్నాడు కర్చీఫ్‌తో!

చుట్టూ నిల్చుని వింత చూస్తున్న "చాదస్తుల" మొహాలు నల్లబడ్డాయి.

అప్పటికే శేఖర ఒళ్ళు చెమటతో తడిసి ముద్దయిపోయింది.

రుసరుసలాడుతూ ఓ పెద్దమనిషి ఇవతలి కొచ్చాడు.

"ఇంకా వున్నాయా చదివింపులు. రెండు గంటలు కావొస్తోంది. ఈ తంతు ముగిస్తే - కాస్త తిండికి ఏర్పాటు చేస్తాం!"

ఆయన మొహం, ఆకలితో కోపంతో కొరివిలా వుంది.

"ఆ! ఆ! అయిపోవచ్చింది మరో రెండే రెండు! ఆ! ఎవరిదో కంఠం వినిపించింది.

వెంటనే వరసన "బయటపడిన హత్య!" "దారుణహత్య!" అంటూ వినిపించాయ్. కీచుగా "శవాల శ్రేణి" వినిపించిందో కంఠం.

"ఇంకా ఏదైనా..." ఎవరిదో గొంతుక వినిపించిన మధ్యలోనే.

శేఖర్ గొంతు వినిపించింది పెద్దగా "పెళ్లికొడుకు ఆత్మహత్య!" మరు నిముషంలో చిరాగ్గా, ధుమధుమలాడుతూ శేఖర్ పెళ్లి పీటల మీదినుంచి లేచివెళ్లాడు.

సుమారుగా ఓ షాపు పెటడానికి వుపయోగించే పుస్తకాలకటను చేతిలోపట్టుకుని నిట్టూరుస్తూ, నడుములు సరిచేసుకుంటూ లేచాడు ఆనంద్! ★

నక్షత్ర ఫలితాలు

[18-6-58 మొదలు 24-6-58 వరకు]

బి. నరసింగరావు

గ్రహ స్థితి

కు	శు కే		ర బు
	21 తేదిని శుక్రుడు వృషభములో ప్రవేశించును. 22 తేదీని ఆరుద్ర కార్తె మొదలు 19తేదీని గురువక్రత్యాగం మిధున, కర్కాటక, సింహ కన్యలలో చంద్రుడు.		
	శ	రా	గు

అశ్విని [చూ, చే, చో, లా]

గతివారమువలె ఈ వారముకూడా మీకు యోగప్రదముగా వుంటుంది. పూర్తికాకుండా వుండిపోయిన పనులు లాభదాయకముగా ముగుస్తాయి. కవితాగోష్టి గానసభలు, వంటి వినోదములలో పాల్గొంటారు. దూరస్థులైన ఆత్మీయుల కుశలము తెలుసుకొనుటచే కొన్నాళ్ళనుండియున్న ఆందోళన తీరుతుంది. బంధువులతో శుభకార్యాలోచన, దధిక్షీర, మధుర పదార్థయుక్త సుభోజనము నీటిపై ప్రయాణము చేయవలసి వస్తుంది. ప్రత్తి, దూది, నూలు, బటలు, బియ్యము, వెండి వరకులకు లాభము. 18,19 కార్యనిర్ణయము. 20 చంచలము, ప్రయాణము 21,22 కుశలవార్త, కార్యలాభము. విందు, వినోదము, 23, 24 అస్థిమితము.

* భరణి [లీ, లూ, లే, లో] *

ఈవారము మీకు యోగదాయకము, యత్నకార్యములు ఫలిస్తాయి ధనాదాయము అనుకున్న దానికన్నా ఎక్కువగా వుంటుంది సంఘసంక్షేమ కార్యాలు చేయుటచే కీర్తిని పొందుతారు. పుణ్య కార్యాలలో పాల్గొంటాను. ఉద్యోగస్తులకు యోగకాలము. వాహనయోగము కలుగుతుంది. పట్టుబట్టలు. బంగారము, వజ్రములవంటి ఖరీదైన సరుకుల క్రయ విక్రయములలో లాభము. 18 19 పరోపకారము. 20 ప్రయాణము. 21,22 ధనలాభము, కార్యసిద్ధి, విందు, వినోదము. 23,24 నిలకడలేనిస్థితి, కవులకు, గాయకులకూ, కళాకారులకు, నటనటులకు యోగకాలము.

* కృత్తిక [అ, ఈ, ఊ, ఏ] *

ఈ వారము మిత్రులనుండి ఆశించిన సహాయము కలుగదు. అనుకున్నట్టుగా పనులు జరగక అనవసర ధనవ్యయము అవుతుంది. కార్యభారము ఎక్కువగుటచే త్రిప్పట, అకాల భోజనమువల్ల అజీర్ణము, తలపోటు, కళ్ళమంటలువంటి అనారోగ్య సూచనలు కనబడగానే శ్రద్ధతీసుకొని ఔషధసేవ చేయుటవల్ల మేలుకలుగుతుంది ఉద్యోగస్తులకు ఒత్తిడి ఎక్కువై బదిలీ అయే సూచనలున్నవి. వ్యాపారస్తులకు లాభము తక్కువ, ఖర్చులు ఎక్కువ. విద్యార్థులకు ఆశాభంగము. 18 19 ప్రయత్నములు, ప్రయాణము. 20 త్రిప్పట, ధనాభావము. 21, 22 నూతనులతో పరిచయము, ధనలాభము, కొంత వరకూ కార్యానుకూలత. రాజకీయవాదులకు మేలు. 23, 24 ఆరోగ్యము చెడే సూచన. ఉద్యోగస్తులకు బదిలీ.

* రోహిణి [ఓ, వా, వీ, వూ] *

ఈ వారము ధనలోపమువల యత్నకార్యములు నెరవేరవు. మిత్రు లనుకున్నవారే సమయానికి సహాయము చేయరు. మీరు ఎవరు సహాయము చేస్తారని ఆశించలేదో అతనే సమయమునకు అడ్డుపడి కార్యసిద్ధికి తోడ్పడడము జరుగుతుంది ఉద్యోగస్థులకు పర్వతప్రాంతాలకు బదిలీ అయే సూచనలున్నవి. రహస్య భేదనకు మీరు వినియోగపడవచ్చును. వరకులకు వారాంతమున లాభిస్తుంది. 18, 19 కార్యయత్నములు 20 ఆటంకములు, త్రిప్పట, శ్రమ. 21, 22 ప్రయాణము, మిత్రసహాయము, కార్యలాభము, ఇతర దేశస్థులతో పరిచయము, విచిత్రవస్తు సంపాదన. 23 24 ఉద్యోగస్తులకు ఆరాటన. ఇంట్లోవున్న కొందరి అనారోగ్యముచే వ్యధ.

* మృగశిర [వే, వో, కా, కీ]*

ఈ వారము కార్యాచరణలో ఆటంకాలు కలుగుతాయి. మీకు దైవసహాయము లేనిదే ఏ కార్యము సిద్ధించదని నమ్మకము కలుగుటచేత ప్రయత్నము చేయుగా, అన్ని అడ్డు తీరి తుదకు కార్యలాభము పొందుతారు. ఆకస్మికముగా ధనలాభము కలుగుతుంది. తీర్థయాత్రలు చేయాలని తలపెడతారు. ఆత్మబంధువుల అనారోగ్యమువల్ల ఆందోళన పొందుతారు ఉద్యోగస్తులకు స్థిమితము తక్కువ. వర్తకులకు నష్టము వస్తుందేమోనని భీతి. 18, 19 నిలకడలేని స్థితి, దైవచింత, సాధు సాంగత్యము. 20 ఆటంకములు, శ్రమ. 21, 22 ధనలాభము, కార్యసిద్ధి. 23, 24 ఉత్తరదిక్కుకు ప్రయాణము, ఆత్మీయుల అనారోగ్యముచే కలవరము

* ఆరుద్ర [కూ, ఘ, జ, ఛ]*

ఈ వారము అనుకున్నట్లుగా డబ్బురాకపోగా, ఖర్చులు ఎక్కువగుటచే మనోవ్యధ కలుగుతుంది. వృధాగా త్రిప్పటకలుగుతుంది. అనుకున్న పనులు కాకపోగా ఇతరులకు ఉపకారము చేదామనుకొని పోగక నిందలపాలౌతారు కోర్టువ్యవహారములు కొంతవరకూ అనుకూలంగా వుంటాయి. ఇచ్చిపుచ్చుకో నేపట్ల పేచీలు వచ్చి వివాదపడతారు. ఉద్యోగస్తులకు కార్యభారము ఎక్కువ, కొత్త సమస్యలు. భార్యకుగాని ఇంట్లోవున్న మరే ఇతర స్త్రీకిగాని ఆరోగ్యభంగముచే ఆందోళన. 18, 19 కార్య ప్రయత్నము 20 ఏమిచేయుటకు తోచని అవస్థ. 21, 22 కార్యలాభం. 23, 24 నిందలు, విరోధాలు, ఆరోగ్యచింత.

* పునర్వసు [కే, కో, హా, హీ] *

ఈవారము అన్ని కార్యములకు చిక్కులు కలుగుతవి. ధనాభావమువల్ల యిబ్బంది. ఆత్మీయులసహాయానికి పూనుకొని చేయలేక మాటపడి మనోవ్యధ పొందుతారు. ఎత్తైన ప్రదేశములనుండి పడుటవల్ల వాహనములవల్లగాని కలిగే ప్రమాదము జాగ్రత్తవల్ల తప్పవచ్చును. రసాయన శాస్త్రజ్ఞులకూ, ఎరువుల వర్తకులకు, భూస్వాములకు, యంత్రములనడుపు నిపుణులకు గనుల యజమానులకు లాభము. 18, 19 కార్యాలోచన 20 ఆటంకములు, నిందలు, మనోవ్యధ. 21 22 ధనయోగము కార్యలాభము. 23, 24 ప్రమాదసూచన. ఉద్యోగస్తులకు బదిలీగాని చేయుచున్న ఉద్యోగమునుండి మరొకదానికి మార్పుగాని జరుగును

పుష్యమి [హూ, హే, హో, డా]

ఈవారము మీకు యోగప్రదము. గతవారము కలిగిన ఆటంకములు తొలగి, కాకుండా నిలిచిపోయిన కార్యములు, మీయుక్తివల్లను అధికారుల ఆదరణవల్లను అనుకూలముగా సాధించుతారు. ధనాదాయము వృద్ధి పొందుతుంది. కవులు కొత్త రచనలు ప్రారంభిస్తారు. విద్యార్థులు నూతన తరగతులలో ఉత్సాహముగా చేరుతారు. 18 19 చిక్కులను తొలగించుకొని కార్యక్రమ

★ నక్షత్రఫలితాలు ★

క్షేమము. 20 చాంచల్యము. 21 22 ధనాదాయము, కార్యానుకూలత. 23, 24 అధిక ఖర్చులు. కవులకు, శిల్పులకు నటీనటులకు యోగకాలము.

* ఆశ్రేష [డి, డూ, డే, డో] *

ఈవారము ప్రభుత్వ సన్మానమువల్ల ధన లాభము కీర్తి కలుగుతాయి. పిల్లల యోగక్షేమమువల్లను పరీక్షలలో జయమువల్లను ఆనందమును పొందుతారు. పండిత గోష్ఠి వల్ల, నూతన గ్రంథపఠనమువల్ల విజ్ఞానము వృద్ధిపొందుతుంది. కోర్టు వ్యవహారములు మీపరముగా తీర్పుఅవుతవి. వర్తకులకు లాభయోగము ఉద్యోగస్థులకు హోదా పెంపు. ఉపాధ్యాయులకు, పండితులకు, న్యాయస్థాన వుద్యోగులకు, న్యాయవాదులకు మేలు కాలము. 18, 19 వైద్య, జ్యోతిష శాస్త్రముల గోష్ఠి, ధనలాభము. 20 ఏ పనులు జరగవు. 21, 22 సన్మానము, పుత్రప్రాప్తి, నూతన కార్యారంభము. 23, 24 పిల్లల చదువు విషయమై ధనవ్యయము.

* మఖ [మా, మీ, మూ, మే] *

ఈ వారము మీ యత్న కార్యములలో జయము కలుగుతుంది. ధనాదాయము బాగుంటుంది. దావాలు మీ పరముగా తీర్పు అవుతవి. మాతృవర్గము వారి సహాయము కలుగుతుంది. ఉద్యోగస్థులకు అనుకూలము ద్రవపదార్థ వస్తువులు, బెల్లము, పంచదార, నూలు, బట్టలు, వెండి, బియ్యము వర్తకులకు లాభము. విద్యార్థులు నూతన తరగతులలో చేరుతారు. కవులకు, గాయకులకు, నటీనటులకు యోగకాలము. 18, 19 ప్రయాణము, కార్యాలోచన. 20 నిలకడలేనిస్థితి. 21. 22 ధనలాభము, కార్యసిద్ధి, విందు, వినోదము. 23, 24 అధిక ఖర్చులు, ఆందోళన.

* పూర్వఫల్గుణి (పుబ్బ) *
మో, టా, టీ, టూ

ఈ వారము మీరు ఇష్ట వస్తులాభమును పొందుతారు. నూతన కార్యప్రయత్నములు చేస్తారు. పరోపకారముచే కీర్తిని పొందుతారు. మీకు వాహనయోగము, మీ భార్యకు అలంకారప్రాప్తి కలుగుతవి. ఉద్యోగస్థుల పదవి వృద్ధి అవుతుంది. విద్యార్థులు కొత్త క్లాసులలో చేరుతారు. నూలు, బట్టలు, బంగారము, వజ్రములువంటి సరుకుల క్రయ విక్రయములలో లాభము వర్తకులకు కలుగుతుంది. కవులకు, గాయకులకు, కళాకారులకు, నటీనటులకూ మేలుకాలము. వారమంతాజయప్రదముగా వుంటుంది. విందు, వినోదములతో విలాసముగా గడుస్తుంది. 23 24 కొంతకలత, అధిక ఖర్చులు.

* ఉత్తరఫల్గుణి (ఉత్తర) *
[టే, టో, పా, పీ]

ఈ వారము ఉద్యోగ ప్రయత్నములలో అధికారులను కలుసుకొని కార్యసిద్ధి పొందుతారు. పరాక్రమ కార్యముచేసి ఘనత కొంటారు. ప్రభుత్వ కార్యభారము ఎక్కువగుటవల్లను, త్రిప్పటచేతను, శరీరములో వుష్ణాధిక్యముకలిగి, బడలిక, తలపోటు, కళ్ళు మంటవంటి అనారోగ్య సూచనలు కనబడగానే ఔషధ సేవవల్ల కుదురుపడుతుంది. పితృవర్గమునుండి ధనలాభము కలుగుతుంది. కోర్టు వ్యవహారములు వాయిదా పడతవి. 18 19 అధికారులతో పరిచయము, ఉద్యోగలాభము, ధనయోగము 20 ప్రయాణము, వింతమాటలువినుట. 21 22 ప్రభుత్వానుగ్రహము, కార్యసిద్ధి 23 24 అనారోగ్యము, త్రిప్పట

* హస్త [పూ, ష, ణ, ఠ] *

మీరు రహస్యములను కనిపెట్టుటలో నిపుణులగుటవల్ల ప్రభుత్వముచే అందుకు నియోగించబడుతారు. ఈ వారము మీకూ ధనవ్యయము ఎక్కువ. మీకున్నూ మీ పిల్లలకున్నూ కలిగే అనారోగ్యమునకు, ఔషధసేవ చేయుటయేగాక, రాహుగ్రహమునకు శాంతిచేయించుటచే మేలు. ఉద్యోగస్థులు అనవసర ప్రసంగమువల్ల అధికారుల ఆగ్రహమునకు గురైన పర్వత ప్రదేశములకు బదిలీ అయే సూచనలున్నవి. వర్తకులకు క్రయవిక్రయములలో దగా కలుగుతుంది. దేశాటనము చేయుటలో విదేశీయుల పరిచయము, విచిత్రవస్తు సంపాదన చేసారు. విద్యార్థులు శ్రమ పొందిన గాని కోరిన స్థానమును పొందలేరు. 18, 19 కార్యప్రయత్నములు. 20 ఆటంకములు, దగా, ప్రయాణము. 21, 22, విదేశీయులతో స్నేహము, కార్యలాభము. 23, 24, ప్రతికూల వార, బదిలీ, అనారోగ్యము.

చిత్త [పే, పో, రా, రీ]

ఈవారము గృహమందున్న వృద్ధులకు శరీరపీడవల్ల మనోవ్యధ. బంధువుల రాకపోకలవల్ల, ధనాభావమువల్ల యిబ్బంది. యత్నకార్యములకు ఆటంకములు. వాయవ్యదిశకు ప్రయాణమువల్ల నష్టద్రవ్యలాభము. విచిత్ర వస్తువులను చూచుట జరుగును దావాలు మీ పరముగా తీర్పు అవుతవి.

ధరలు:

నూలు, వస్త్రములు : మందముగా వుండును.

నూనె దినుసులు: నిలబాటుగా వుండును.

బెల్లము, పంచదార, చింతపండు: సమస్థాయిలో వుండును.

ఆహారధాన్యములు : మందముగా వుండును.

పప్పుదినుసులు : నిలబాటుగా వుండును.

వెండి, బంగారము: కొంచము హెచ్చుతగ్గులుగా వుండును.

సస్యానుకూలముగా గాలితో కూడిన వర్షములు అంతటా కురుస్తవి.

* * *

జన్మనక్షత్రము బట్టిగాని, జన్మనక్షత్రము తెలియనివారు నామనక్షత్రము (వారి వారి పేర్ల ననుసరించి పేరు మొదటి యక్షరము)ను బట్టిగాని ఫలితాలు తెలుసుకోనువది. కృష్ణుడను పేరునకు మృగశిరా నక్షత్రమును, హృషీకేశుడను పేరునకు స్వాతియు, శ్రీధరుడను పేరునకు చిత్తయును, క్షేత్రపాలకుడనే పేరునకు హస్తయును, భీముడు, భైరవుడు అనే పేర్లకు పూర్వాషాఢయును చూచుకోనువది.

సాధుసాంగత్యమువల్ల ఆధ్యాత్మిక చింతచే శాంతిని పొందుతారు ఈశ్వరానుగ్రహమువల్ల కార్యలాభము. 18, 19 ప్రయత్నములు. 20 ఆటంకములు, ప్రయాణము 21, 22 కార్యలాభము, ఆధ్యాత్మిక చింత. 23, 24 స్త్రీలతో విరోధము, ఆరోగ్య చింత. విద్యార్థులకు జయము తక్కువ.

* స్వాతి [రూ, రే, రో, తా] *

ఈవారము యత్నకార్యములు ఫలించకపోగా, కార్యభారముతో పాటు ఖర్చులు కూడా ఎక్కువవుతవి. దావాలలో జయము కలుగుతుంది. వ్యర్థముగా తిరుగుట, సజ్జనులతో విరోధము వస్తుంది. ఉద్యోగస్థులకు బదిలీ అగుటగాని, శెలవు పెట్టి వృథాగా కాలము గడుపుటగాని జరుగుతుంది. కొర్రలు, రాగులు, సజ్జ వంటి అపరదినుసులు, నువ్వులవంటి నూనెదినుసుల వ్యాపారస్థులకు లాభము. భూస్వాములకు శ్రమ ఎక్కువ. విద్యార్థులకు జయము తక్కువ. 18, 19 యత్నములు. 20 ఆటంకములు వృథాశ్రమ, విరోధము. 21, 22 కార్యలాభము, 23, 24 బదిలీ, లేక శెలవుపెట్టుట, స్త్రీల ఆరోగ్యచింత.

*** విశాఖ [తీ, తూ, తే, తో]***

మీరు పట్టుదలగలవారుగనుక కార్యాచరణల్లో కలిగే ఆటంకములను ధైర్యముతో ఎదుర్కొని కార్యసిద్ధిని పొందుతారు. స్థిరాస్తుల వ్యవహారములో ప్రయాణముచేయ వలసివస్తుంది. ధనలోపమువల్ల అప్పుచేస్తారు. వాడిపనిముట్లవల్లగాని, యంత్రములవల్లగాని, అగ్నివలగాని కలిగే ప్రమాదము జాగ్రత్తవల్ల తప్పవచ్చును. శరీరముపై కురుపులు లేవవచ్చును. రసాయనిక శాస్త్రజ్ఞులకు, ఎరువుల వ్యాపారస్తులకు, యంత్ర నిపుణులకు, భూస్వాములకు, గనులయజమానులకు శ్రమతో కూడిన లాభము. పోలీసు, ఇంజనీరింగు శాఖలలో ఉద్యోగస్తులకు మేలుకాలము. విద్యార్థులకు జయము తక్కువ. 18, 19 కార్యప్రయత్నము. 20 ఆటంకములు, నిందలు, విరోధము. 21, 22 అప్పుచేయుట, కార్యసిద్ధి. 23, 24 ప్రమాదము, ఆరోగ్యచింత.

అనూరాధ [నా, నీ, నూ, నే]

గతవారము కలిగిన కష్టములు తీరి నష్టములు పూడతీసుకుంటారు. యుక్తిగా మాట్లాడుటవల్ల పెద్దల దయను సంపాదించి, కీర్తి, ప్రతిష్ఠ పొందుతారు. కుటుంబములో సుఖ సంతోషములు నిండి వుంటాయి. ఉద్యోగస్తులకు అధికారుల ఆదరణ లభిస్తుంది. వ్యాపారస్తులకు లాభము. కవులకు సన్మానము కలుగుతుంది. జ్యోతిష విద్యా గోష్ఠిలో పాల్గొంటారు. విద్యార్థులు నూతన తరగతులలో చేరుతారు. గణిత శాస్త్రజ్ఞులకు, కవులకు, శిల్పులకు. నటీనటులకు యోగకాలము. 18, 19 తీరిపిలేని కార్యక్రమము. 20 ప్రయాణము, 21, 22 మిత్రదర్శనము, ధనలాభము, కార్యసిద్ధి. 23, 24 అధికఖర్చులు, శ్రమ.

జ్యేష్ఠ [నో, యా, యీ, యూ]

ఈ వారము మీకు భాగ్యవృద్ధి అవుతుంది. తలపెట్టిన కార్యములు ఫలిస్తాయి. కావలసిన సొమ్ము, మనుష్య సహాయము ఏమీ శ్రమలేకుండానే కలుగుతవి. కోర్టు వ్యవహారములలో జయము. పుత్రవిభవము వల్ల సంతోషము పొందుతారు. ఉద్యోగస్తులకు అప్పటి కార్యస్థానములోగాని ఇతరత్రా గాని అభివృద్ధికలిగే మార్పులు వస్తవి. విద్యార్థులకు కొత్త క్లాసులలో చేరుటకు స్థలములు లభించుటచే ఉల్లాసము కలుగుతుంది. పండిత గోష్ఠివల్ల విజ్ఞానము ఎక్కువవుతుంది. ఉపాధ్యాయులకూ, న్యాయవాదులకు, న్యాయస్థానముల ఉద్యోగులకు, పండితులకూ మేలుకాలము. 18, 19 ధనలాభము. 20 ప్రయాణము. 21, 22 పండిత గోష్ఠి, భాగ్యవృద్ధి, కార్యసిద్ధి. 23, 24 చెవిపోటు, మనోవ్యాకులత.

*** మూల [యే, యో, బా, బి] ***

ఈ వారము మీకు యోగకరముగా వుంటుంది. గత వారము పూర్తికాకుండా నిలిచిపోయిన కార్యములు ఈ వారము లాభకరముగా ముగుస్తాయి. నీటిపైని ప్రయాణము చేయవలసి వస్తుంది. ఉద్యోగస్తులకు అధికారుల ఆదరణ లభిస్తుంది. ఇంట్లో వారి ఆరోగ్యము బాగుపడుతుంది. కవితాగోష్ఠి, సంగీత సభలవంటి వినోదములలో బంధుమిత్రులతో పాల్గొని మధుర పదార్థములతో కూడిన భోజనము చేస్తారు. బెల్లము, పంచదార, ప్రత్తి, దూది, నూలు, బట్టలు, బియ్యము, వెండి వర్తకులకు లాభము. కవులకూ, గాయకులకూ, కళాకారులకు యోగము. 18, 19 ధనలాభము, ప్రయాణము, అధికారుల ఆదరణ. 20 నిలకడలేని స్థితి. 21, 22 బంధుదర్శనము. విందు, వినోదము. 23, 24, ఖర్చులు ఎక్కువ, అశాంతి.

పూర్వాషాఢ [బూ, ధ, భా, ఢ]

ఈ వారము ఉద్యోగములో ప్రమోషను కలుగుటచే ఆదాయము. ఎక్కువవుతుంది. యత్న కార్యములు లాభకరముగా పూర్తి అవుతవి. పరోపకారముచేసి కీర్తిని పొందుతారు. దావాలు మీపరముగా తీర్పుఅవుతవి, నూలు, బట్టలు, బంగారము, నవరత్నములు వంటి ఖరీదైన వస్తువుల క్రయవిక్రయములలో వర్తకులకూ అనుకున్నకంటే ఎక్కువలాభము కలుగుతుంది. నూతనగృహారంభమునకు ప్రయత్నములు చేస్తారు. విద్యార్థులకు అనుకున్న స్థానములు లభించి నూతనతరగతులలో చేరుతారు. కవులకు, గాయకులకు, కళాకారులకు, నటీనటులకు మేలుకాలము. 18, 19 ధనలాభము, కార్యసిద్ధి. 20 ప్రయాణము. 21, 22 ప్రమోషను, విందు, వినోదము. 23, 24 కలతలు, అస్థిమితము.

ఉత్తరాషాఢ [బే, బో, జా, జీ]

ఈ వారము డబ్బుకు ఇబ్బందిగావుంటుంది. రాజకీయపనులలో తిరగవలసి వుంటుంది. పితృవర్గమునుండి సహాయము కలిగేలోపున యత్న కార్యములకు ఆటంకములు, త్రిప్పట, శరీరములో వుష్ణాధిక్యముచే అనారోగ్య

★ నక్షత్రఫలితాలు ★

సూచనలు కలుగుతవి. వెంటనే శ్రద్ధతీసుకొని ఔషధసేవచేయుటవల్ల మేలు. అపర దినుసులు, గోధుమవంటి ఆహారధాన్యములు, అటవిక సరుకుల వర్తకులకు లాభము. 18, 19 వింతవార్తలువినుట, రాజకీయకార్యములలో పాల్గొనుట. 20 త్రిప్పట, ఆటంకములు. 21, 22 ధనలాభము, కార్యలాభము, 23, 24 కలతలు, అనారోగ్యము,

శ్రవణము [జూ, జే, జో, ఘా]

ఈ వారము ఉద్యోగస్తులకు అధికారుల ఒత్తిడిచే పర్వతప్రాంతములకుగాని, అరణ్యప్రదేశములకుగాని బదిలీ అవుటగాని లేక శెలవుపెట్టి వృధాగా కాలము కడుపుటగాని జరుగుతుంది. మొదట్లో ఏమిచేసేందికి తోచక వ్యాపారస్తులకు ఆందోళనగావున్నా వారాంతమునకు కార్యలాభము కలుగుతుంది. రహస్యభేదనమునకు ప్రభుత్వముచే నియోగించబడుతారు. ఇంట్లోవున్నవారికి కలిగిన అనారోగ్యము చికాకు కలిగిస్తుంది. 18, 19 నిశ్చయములేని కార్యక్రమము. 20 బదిలీ లేక శెలవు పెట్టుట, త్రిప్పట, అశాంతి. 21, 22 మిత్రసహాయము, కార్యలాభము. 23, 24 ఆరోగ్యచింత, విచిత్ర వస్తులాభము.

*** ధనిష్ఠ [గా, గీ, గూ, గే] ***

గత వారమువలెనే ఈ వారముకూడా మీకు యోగప్రదముగా వుండదు. ఏ పని చేసేందికి మనస్సుకు ఆందోళనగావుంటుంది. ఈశ్వరకృపవల్ల వారాంతమునకు మీ ప్రయత్న కార్యములు సుముఖమవుతాయి. ఇంట్లోవారి శరీరపీడవల్ల కలవరపాటు కలుగుతుంది. వర్తకులకు లాభము తక్కువవుటే కాక దగాకు లోనౌతారు. ఉద్యోగస్తులకు అధికారుల ఒత్తిడి. 18, 19 కార్యప్రయత్నము. 20 ఆటంకములు, నిస్సహాయస్థితి. 21 22 సాధుసాంగత్యము, దివ్యజ్ఞానవృద్ధి, శాంతి, కార్యలాభము. 23, 24 ఆరోగ్యచింత, ప్రయాణము.

*** శతభిషం [గో, సా, సీ, సూ] ***

ఈ వారమంతా కార్యభారముచే నలిగిపోతారు. కష్టపడినా ఫలములేక వృధాగా వివాదములకు లోనౌతారు. దావాలు మీ పరము తీర్పు అవుతవి. ఇచ్చిపుచ్చుకొనే టప్పుడు దుష్టస్త్రీలతో పేచీలువచ్చి మనోవ్యధ కలుగుతుంది. భార్య ఆరోగ్యము సరిగావుండనందున ఆందోళన. 18,19 దావాలలో జయము. 20 కార్యభారము, త్రిప్పట, 21,22 స్వల్ప ధనలాభము, కార్యసిద్దిన్నీ. నువ్వులు, నూనెదినుసుల వర్తకులకు లాభము. 23,24 ఆరోగ్యచింత.

*** పూర్వాభాద్ర [సే, సో, దా, దీ] ***

ఈ వారము డబ్బు యిబ్బంది ఎక్కువగా వుండుటచే అప్పు చేస్తారు. యత్న కార్యములకు ఆటంకములు కలిగినా పట్టుదలతో ప్రయత్నించి తుదకు కార్యలాభము పొందుతారు. యంత్రములవల్లగాని, అగ్నివల్లగాని కలిగే ప్రమాదము జాగ్రత్తవల్ల తప్పవచ్చును. లోహపు సామానుల వర్తకులకు, గనులయజమానులకు కష్టముతో కూడిన లాభము. పోలీసు ఇంజనీరింగు శాఖలలో ఉద్యోగస్తులకు మేలుకాలము. 18, 19 కార్యక్రమాలోచన. 20 ఆటంకములు, కలతలు. 21,22 అప్పుచేయుట, కార్యలాభము. 23,24 ప్రమాద సూచన, ఆరోగ్యచింత.

*** ఉత్తరాభాద్ర [దూ, శం, ఝా, ధా] ***

ఈ వారము మీకు యోగప్రదము, శుభ, సంతోషవార్త వినుట, ప్రయత్నములు ఫలించుట, నూతనులతో పరిచయము ధనలాభమువంటి యోగములు కలుగుతవి. గణితశాస్త్ర, జ్యోతిష విద్యాగోష్ఠి చేస్తారు. డాక్టర్లకు, కవులకు, శిల్పులకు, నటీనటులకూ యోగకాలము. 18, 19 కార్యలాభము, శుభవార్త 20 ప్రయాణము. 21, 22 ధనలాభము, పండిత గోష్ఠి. 23, 24 అధిక ఖర్చులు, చాంచల్యము.

*** రేవతి [దే, దో, చా, చీ] ***

ఈ వారము అనుకున్నట్టుగా కార్యలాభము పొందుతారు. ధనలాభము ఎక్కువగా వుండుటచేతను భాగ్యవృద్ధి అవుతుంది. ఇంట్లో వున్నవారికి అనారోగ్యము తొలగిపోతుంది. పుత్రుల విద్యాభివృద్ధి, నూతన తరగతులతో చేరుట సంతోషము కలుగుతుంది. ఉద్యోగస్తులకు వృద్ధి, వర్తకులకు లాభము కలుగుతవి. న్యాయవాదులకు, పండితులకూ, ఉపాధ్యాయులకూ మేలుకాలము. 18, 19 కార్యలాభము, పండితగోష్ఠి. 20 ప్రయాణము. 21, 22 ధనలాభము, దావాలలో గెలుపు, ఉద్యోగస్తులకు ప్రమోషను. 23, 24 శ్రమ, ఖర్చులు ఎక్కువ. ★



వనితాలోకం

మాచ్ ఖండ్ చూసిరండి

పి. రమ (నరసాపురం)

ప్రతి సంవత్సరం ఒకసారి మన వూరూ, మన పరిసరాలూ, ఉద్యోగాలూ వదలి కొన్నాళ్ళు దూరంగా ఏ ప్రదేశానికైనా వెళ్ళిరావడం మంచిది. దానివల్ల మన పరిసరాలకే కాక, మన బాధలకీ, మనస్తాపాలకీ కొన్నాళ్ళు దూరంగా వుండవచ్చును. హాయిగా మన సమస్యలని మరిచిపోయి క్రొత్త ప్రదేశాలలో వింతలు చూసి ఆనందించడం అవసరం. ప్రకృతి మనిషికి ఆనందమివ్వడమే కాక మనసుని నిర్మలంగా చేస్తుంది. జనంతో నిండిన పట్టణాలు కాకుండా ప్రశాంతంగా ఉండే ప్రదేశాలు కొండదరియలు, నదుల ప్రక్క వూళ్ళూ, విశ్రాంతి నిస్తాయి.

మాచ్ ఖండ్ చూడవలసిన ప్రదేశాలలో ఒకటి. అక్కడి ప్రాజెక్టు చూడడం కోసమే కాదు మనం వెళ్ళవలసినది; అక్కడి సుందర ప్రకృతిని కూడా చూచి ఆనందించడానికి. మాచ్ ఖండ్ విశాఖపట్నానికి 120 మైళ్ళ దూరంలో వుంది. అక్కడికి వెళ్ళాలంటే అరకు వాలీ మీద నించి వెళ్ళాలి. అరకు వాలీ ఎంత సుందరమైనదో యిప్పటికి అందరికీ తెలిసే వుంటుంది.

ఆ మధ్య మేం మాచ్ ఖండ్ వెళ్ళాం. మధ్యాహ్నం 3 గం. లప్పుడు విశాఖపట్నం బయలుదేరాం. కారు కొండ ఎక్కడం ప్రారంభించే సరికి 4 గం॥ అయివుంటుంది. కారు ముందుగా 4000 వేల అడుగుల ఎత్తుకు పోతుంది. తిరిగి క్రమంగా మెలికల దారి మీదుగా అరకు లోయలోకి దిగుతుంది. అరకులోయ సముద్ర మట్టానికి 2500 అడుగుల ఎతు మీద వుంది. లోయనించి మాచ్ ఖండ్ వెళ్ళాలంటే తిరిగి 3000 అడుగుల ఎత్తుకి వెళ్ళాలి.

కారు, కొండ ఎక్కడం ప్రారంభించడంతోనే మనని మనం పూర్తిగా మరిచిపోతాం. ఆఎత్తైన కొండలూ, లోతు లోయలూ, పచ్చని చెట్లూ ఎంతచూసినా చూడాలని వుంటుంది. ఒక వైపు ఎత్తైన కొండలు వుంటాయి, మరొకవైపు అడుగు కనిపించని లోయలు. అంతేంత పెనచెట్లూ, రకరకాల రంగురంగుల పువ్వులతో, ఆకులతో మనం ఎక్కడా చూసివుండం. మధ్యమధ్య గలగలమంటూ జలపాతాల, సెలయేళ్ళ సంగీతం విన్పిస్తూ వుంటాయి.

మేం సూర్యాస్తమయ సమయానికి కొండ మీదే వున్నాం. సూర్యుడు అస్తమించేటప్పుడు నిమిష నిమిషానికీ ఆకాశంలో రంగులు మారుతాయి. ఆ రంగులన్నీ యీ చెట్లమీదా, పచ్చికబయళ్ళ మీదా పడి మనోహరంగా వున్నాయి. ఈ నిమిషంలో తళ తళ మనే ఎండ చూస్తాం లోయలో. మరు నిమిషంలో కారు ప్రక్కకి తిరిగేసరికి మేఘాల నీడలచే ఆ ప్రాంతాన్ని ఆవరించిన చీకటి చూస్తాం. ఇక్కడ ఎండ కాస్తుంది. మరు మైలులో వర్షం కురుస్తూ వుంటుంది. కొంతదూరం వెళితే వర్షం వుండదు; తడిసిన నేలా వుండదు! ఎవరైనా మాయాదండం త్రిప్పుతున్నారా అనిపిస్తుంది.

ఒక్కొక్కసారి ముందుదారి ఏమీ తెలియదు. కొండ అడ్డంగా వుంటుంది. తీరా దగ్గిరకి వెళితే ప్రక్కని చక్కని అందమైనబాట, మరో వింతైన దృశ్యం. మాచ్ ఖండకి వెళ్ళే దారిలో ఒకచోట కొండమీద చిన్న ఆంజనేయ విగ్రహం చెక్కివుంటుంది. అక్కడ ప్రతి కారూ ఆపి, కొబ్బరికాయ కొడతారు. మేం అక్కడ కారు దిగి చూశాం. ఒక ప్రక్క అంతుకనిపించని కొండ, మరి ప్రక్కలోయ. అంతా నిశ్శబ్దంగా వుంది. ఆఖరికి పక్షుల ధ్వనులుకూడా లేవు. కాని, ఎక్కడో జల, జల మంటూ సంగీతంలా జలపాత శబ్దం ఆ నిశ్శబ్దాన్ని తీయదనంతో నింపుతూవుంది. ఆ నీరు ఎక్కడ ప్రవహిస్తున్నాయో చూడాలని ప్రయత్నించాం కాని మాకు కనిపించలేదు. కొండమీద తెల్లమేఘాలు మెల్లిగా తిరుగుతున్నాయి. ఏదో కొత్తలోకంలో విహరిస్తున్నట్లు అనిపించింది ప్రాణానికి.

మాచ్ ఖండ్ లో మనకి ఆనందం కలిగించేది యింకొకటివుంది. ప్రకృతిలో కలిసిపోయి, అందులో భద్రంగా సంచరించే అరకు వాలీకోయలు. నలుగురైదుగురు ఆడవాళ్ళో, మొగవాళ్ళో, కఱ్ఱలమోపులో అడ్డాకులో తలమీద పెట్టుకు వరుసగా నడుస్తూవుంటారు. కారు శబ్దం వినగానే వెనక్కి తిరిగి చూస్తూ నిలబడిపోతారు వాళ్ళంతా. ఇంక మన కారు కనుచూపుమేర దాటేవరకూ ఆశ్చర్యంగా చూస్తూ అక్కడే నించుండిపోతారు. వాళ్ళ ముఖాలలోని అమాయకత్వం, ఆశ్చర్యం చూస్తూవుంటే ఏదో వ్యధా, ఆనందం కలుగుతాయి.

మాచ్ ఖండ్ కేంప్ చేరేసరికి ఎనిమిదిన్నరైంది. మేం అక్కడ రహదారిబంగళాలో బసచేశాం. మర్నాడు ప్రొద్దున్నే, అక్కడికి 12 మైళ్ళదూరంలోవున్న పవర్ హౌస్ చూడటానికి వెళ్ళాం. పవర్ హౌస్ తమాషాగా వుంటుంది. మనం కొండమీద వుంటాం. 1000 అడుగుల లోతులోయలో యీ పవర్ హౌస్ వుంటుంది. కొండమీద నుంచి పవర్ హౌస్ కి రైలుపట్టాలలా పట్టాలు కట్టారు. వీటిమీంచి వైరుసహాయంతో ఒక వాన్ నడుస్తుంది. మనం యీ కొండమీద నించి వాన్ లో దిగుతూవుంటే ఎంత సరదాగా ఉంటుందో అంత భయంవేస్తుంది. పవర్ హౌస్ లో భరించలేనిశబ్దం. ఈ పవర్ హౌస్ నించే విశాఖ చుట్టుపట్లకి ఎలక్ట్రిసిటీ సదుపాయం కలుగుతుంది.

మరోవేపు జ్వాలాపుట్ — మాచ్ ఖండ్ నది ప్రాజెక్టువుంది. ఇక్కడే పవర్ హౌస్ కి

(49-వ పేజీ చూడండి)

మన సమాజంలో భర్తృవిహీనల దుస్థితి

సనాతనుల దృక్పథం పూర్తిగా మారాలి

నేను చదువుకొనే రోజుల్లో ఫలానావారి తల్లి వితంతువు అని చెబితే మా నాయనమ్మ, ఆమె ఎలాంటివితంతువు అని ప్రశ్నించేది. అంటే ఆమె బాలవితంతువా? కాక భర్తతో కొంతకాలం కాపురం చేసిన తరువాత ఆమెకు వైధవ్యం వచ్చిందా అని ఆమె ప్రశ్న యొక్క అభిప్రాయం. కాని ఆ రెండిట్లో ఏది చెప్పినా ఆమె అయ్యో పాపం! అనేది.

అదేమిటి నాన్నమ్మా రెంటికీ అయ్యో పాపం అంటావు. విడతీసి అడగడమెందుకూ? అని ప్రశ్నించేదాన్ని. బాలవితంతువైతే భర్తముఖంకూడా చూడని కాలకు ఏమి వ్రాత వ్రాశావయ్యా భగవంతుడా అనేది. అదే కొన్నాళ్లు సంసార యాత్ర సాగించిన తర్వాత భర్తృవిహీన అయితే అయ్యో పాపం జీవితంలోని మాధుర్యాన్ని చవిచూపించి అంతలోనే ఆ సౌభాగ్యాన్ని లాక్కుంటావా దేవుడా! అనేది. భర్తను ఎప్పుడు పోగొట్టుకొన్నా వితంతువు-వితంతువే కదా!

మనదేశంలో వితంతువులు లేని యిల్లే అరుదు. మన యిళ్ళలో అయితే వితంతువులకు సన్యాసం పుచ్చుకొన్న స్వాములవారికి కూడా లేని గౌరవమే వుండదు. సాధారణంగా వితంతువులపై తోటి స్త్రీలకుగాని, పురుషులకుగాని జాలి, సానుభూతి జాస్తి. ఆమెను ఏదో విచిత్ర జంతువును చూచినట్లుగా చూస్తారు. భర్తను పోగొట్టుకున్న స్త్రీకి సంఘంలో గౌరవం, స్థానం అసలే లేదు. భర్త చనిపోయినపిదప ఆమె కేమైనా ఆస్తి మిగిల్చిపోతే ఫరవాలేదు; కాని ఏ దిక్కూ లేకపోతే, ఆమె కుక్కకన్నా హీనంగా బ్రతకాల్సి వుంటుంది. భర్త చనిపోయిన తర్వాత ఆమె అత్తవారింట్లో వున్నా, పుట్టింట్లో వున్నా పనిమనిషికిందే లెక్క. అందులో కొందరిళ్ళలో 'అతను' చనిపోతే దుఃఖం లేకపోగా, 'ఆమె' దిక్కులేని వెట్టి చాకిరి చేసే మనిషిగా దొరికిందని సంతోషిస్తారు.


స్త్రీకి భర్తకన్నా వేరు దైవం లేదంటారు. అలాంటి భర్తను పోగొట్టుకొన్న స్త్రీపై దయ చూపవలసిన బాధ్యత మనది

[illegible]

కాదూ? ఉన్న దైవంకూడా పోయాకే. ఆ స్త్రీ గతేమిటి? ఈ సంఘంలో ఏ కారణంతోనైనా జీవించవచ్చు కాని భర్తృవిహీనంగా బ్రతకడం కడు దుస్సహం. స్త్రీకి ఏ నలభై నలభైయేడు దాటాకో, భర్త చనిపోతే మిగతా జీవితం ఎలాగో గడుపుతుంది. కాని పడుచుతనంలో భర్తను పోగొట్టుకొని జీవించడం చాల కష్టం. అందులో మన దేశంలో భర్త చనిపోతే భార్యకు అందం, ఆభరణం, సుఖం – ఆనందం అన్నీ పోయినట్లే. ఆమె ఏ వయసులోనున్నా వుండనీయండి — చేతులకున్న గాజులు పగలగొడ్తారు. మెడలోని మంగళసూత్రాన్ని తెంచేస్తారు. ముఖంలోని అందాన్ని కాల్చేస్తారు. ఏదో విచిత్ర మనిషిగా తయారుచేసి మూల కూర్చోబెడ్తారు. వారిజీవితంలో ఇక మాధుర్యం లేదు. తోటి స్త్రీకి వుండే హక్కు, బాధ్యతలు లేవు. కడకు ఆమె మనకు ఎదురుగా వస్తే మంచి శకునంకూడా కాదు. అందరికీ ఆమెపై చులకనభావం ఏర్పడుతుంది. మనకు లేనిదాన్ని పొందడానికి, అనుకరించటానికి మనం ప్రయత్నిస్తుంటే ఆమె ఉన్నదాన్నికూడా వదులుకోవాలి. అందులో మరొకరి దయాదాక్షిణ్యాలపై బ్రతికే వితంతుజీవితం ఘోరాతిఘోరం.

మా బంధువొకామె వుంది. ఆమెకిప్పుడు దాదాపు అరవై ఏళ్ళుండవచ్చు. ఆమె ఎనిమిదవ యేటనే భర్తను పోగొట్టుకుంది. అప్పట్నుంచి పుట్టినింట్లోనే వుంటోంది. ఆరుగురు తమ్ముళ్ళని చెల్లెళ్ళని పెంచి పెద్దచేసి పెళ్లిళ్ళు చేసింది. తనకున్న డబ్బంతా వారికోసం ఖర్చుచేసింది. ఆమె దాదాపు మా బంధువుల ఇళ్ళలో అందరి కాన్పులు చేసివుంటుంది ఎవరి ఇంట్లోనైనా, శుభాశుభకార్యాలు ఆమె సహకారం లేనిదే జరుగవు. ఒక్కసారి ఏ తమ్ముడి కోడలికో, చెల్లెలికూతురికో జబ్బుచేస్తే నెలలతరబడి వారితోబాటు, వారికి సేవ చేస్తూ ఆస్పత్రిలోనే వుండేది. ఆ చేసేసేవ

బార్డర్ డిజైన్లు



1 ఈ డిజైన్ లంగా బార్డర్‌గాకాని, టేబుల్‌క్లాత్‌కి బార్డర్‌గాకాని చీరకు బార్డర్‌కానికుట్టాలి. మధ్య పువ్వు రెడ్ కలర్ కుట్టి, ఆకులకు డార్క్ గ్రీన్ కుట్టి, కాయలు వైలెట్, లతలు ఎల్లోకుడితే బాగుంటుంది. మధ్య పువ్వులో మధ్యభాగాన్ని (సున్నా) పసుపుదారంతో కుట్టాలి.

ఏదో కొంచెం పబ్లిసిటీతో పరాయివాళ్ళకు చేసివుంటే ఈ పాటి కామెను "ఏ సైటిం గేల్" అని పిలిచేవారు! కాని ఆమె విధవ; గడపదాటదు. నలుగురిలో తలెత్తుకు తిరుగదు—చాకిరి చేసేటప్పుడుతప్ప. ఆమె ఒక్క సినిమా చూడలేదు. ఆమె విధవ కదా! ఇప్పుడేమయింది. ఆమెకు వృద్ధాప్యం వచ్చేసింది; ఆమె కష్టపడి పనిచేయలేదు. చాకిరిచేయించుకొనేటప్పుడు ఆదరించిన తమ్ముళ్ళు చెల్లెళ్ళు ఎవరూ ఆమెను సరిగా చూడరు. ఆమె ఇప్పుడందరికీ బరువుగానే వుంది. ఏదో అదృష్టవశాత్తూ ఆమెకు కొంత భూమివుంది. సాలుకు ఇరువందల రూపాయలొస్తాయి కాబట్టి తన జీవితాన్నలాగో గడుపుతోంది.

ఇక సామాజికంగా వితంతువుకు విలువన్నదేలేదు. శుభకార్యాలకు ఆమె పనికిరాదు. భర్త చావుతో భార్యకు కఠోరమైన మార్పు వస్తుంది. (కాని భార్య చచ్చిన పదమూడవరోజునే మరోపెళ్ళి చేసుకొన్న మగవాళ్ళను నేను చూశాను) ఒకే ఇంటిలో ఒకే ఈడుగల యిద్దరు పడుచులుంటారు. ఒకామె విధవ; రెండో ఆమె భర్తతో చక్కగా కాపురం చేసుకొంటోంది. విధవ మూలగదిలో కూర్చొని కుమిలిపోతుంది. ప్రక్క గదిలోనే రెండో ఆవిడ చక్కగా ముస్తాబై జడ అల్లుకొని, మల్లెపూలు పెట్టుకొని భర్తతో సినిమాకెళ్ళటం కోసం కాచుకొని వుంటుంది. వాళ్లిద్దరూ అక్కచెల్లెళ్లు కానీయండి, వదినా ఆడబడుచులు కానీయండి. ఒకరికున్న హక్కులు రెండోవారికి లేవు. ఎందుకు? మన సమాజం వితంతువుల నలాగే వుంచాలని ఎందుకు కాంక్షిస్తోంది? భర్త చనిపోయినంత మాత్రాన భార్యకు—అందులో పడుచుతనంలో భర్తను పోగొట్టుకొన్న స్త్రీకి—ఆశలు కోర్కెలు వుండవా? వాటినన్నిటిని చంపుకోవడం సాధ్యమా?

సనాతనులకు ఈ ప్రశ్నలు వేస్తే వారు పతివ్రతలగాథలు ఏకరువుపెడ్తారు. కాని పురాణగాథల్లో వచ్చే పతివ్రతలకు, నేటి పతివ్రతలకు చాల భేదం వుందనే విషయం వారు గ్రహించాలి. స్త్రీలకే కాక, ఆనాటి పురుషులకు నేటిపురుషులకు హస్తిమశకాంతరం. ఆకాలం పురుషులలోని నిగ్రహశక్తి దీక్ష, స్వధర్మం ఇలాంటివి ఈ కాలంలో ఎక్కడ వున్నాయి? అలాగే ఇప్పటి స్త్రీల విషయంకూడాను.

కాలం మారింది. కాలంతోపాటు మనం కూడా మారాలి. విధవలనుకూడా మనుష్యుల్లా చూడాలి. వారిపై జాలి, అనునయం ప్రదర్శించాలి. అసలే భర్త చావుతో కుళ్లిపోతున్న స్త్రీకి సాంఘిక కట్టుబాటు పేరుతో ఆమెను అధోగతికి కూలద్రోయడం చాల అన్యాయం. అందువల్ల చాల ప్రమాదాలున్నాయి కూడా.

పైన చెప్పినట్లుగా ఒకే యింటిలోని ఇద్దరు స్త్రీలనే తీసికొందాం. ఇద్దరూ ఒకే ఈడులో వున్నప్పుడు, ఒకే ఇంటిలో వున్నప్పుడు ఒకరికి లేని సుఖం, ఆనందం మరొకరు అనుభవిస్తుంటే విధవ స్త్రీ ఎంత బాధపడుతుందో యోచించాలి. పైకి చెప్పలేకపోయినా, ఆబాధ ఆమెను లోపలే దహించివేస్తుంది. తనకు లేని సుఖాన్ని అనుభవిస్తున్నవారిని ఆ స్త్రీ ద్వేషించవచ్చు. ఆమెలో ఈర్ష్య నాటుకుపోవచ్చు. ఆ ఈర్ష్య ఆమె జీవితాన్ని మరింత అధోగతికి లాగివేయవచ్చు. నేను విధవను నాకేం అక్కరలేదు; నేను సమాజం కట్టుబాటుల్లోనే వుంటాను అని సాధారణంగా ఏ స్త్రీ అనుకోదు. అస్వతంత్రతవల్ల మాట్లాడలేక మనసులోనే సమాజాన్ని, సమాజంలోని వ్యక్తుల్ని ఆమె ద్వేషిస్తుంది. సంఘానికి ఎదురు తిరుగడానికి ఆమె మనస్సు ప్రయత్నిస్తుంటుంది. అప్పుడామె ఏఅఘాయిత్యం చేసినా ఆశ్చర్యపడ నవసరం లేదు.

కట్టుబాటు, శిక్షణ ఇవిరెండూ మనుషుల మనసులను మార్చలేవు. మనమలా వితంతువులను మూలకు విసిరేస్తే పడివుంటారనుకోవడం వెర్రితనం. చుట్టూ వాతావరణం, పరిస్థితులు తమ ప్రభావాన్ని మనుషులపై చూపిస్తానే వుంటాయి. అయినా విడాకుల చట్టం పాసయి, కట్టుకున్న భర్తకు విడాకులిచ్చి మరొకరిన్ని వివాహమాడడానికి అంగీకరించే ఈ రోజులలో వితంతువులను మొదటి కట్టుబాటులోనే వుంచి శిక్షించడం చాల పొరపాటు. వితంతువుకూడా మనిషే. ఇతర స్త్రీలకుంటే ఆశలు, కోర్కెలు, హక్కులు, బాధ్యతలు ఆమెకూ వుండాలి. సనాతనులు తమ మనసులను మార్చుకోవాలి. వారిమాత్రం ప్రకారం మగవాళ్లు శ్రీరామచంద్రుడిలా ఏకపత్నీవ్రతస్థులుగా వుంటున్నారా? మొదటి భార్యకు జబ్బు చెయ్యగానే, రెండోపెళ్ళి సెటిల్ చేసికొని మొదటిభార్య చావుకోసం వేచి వుంటారే! మరి మీకులేని ధర్మం ఆడవారి నెత్తిమీద రుద్దటమెందుకు?

ఇక విధవా వివాహం విషయం. వితంతువులను బాగుపరచాలంటే మొట్టమొదట విధవా వివాహానికి సంఘం ముందంజ వేయాలి. లేకపోతే వచ్చే అనర్థాలన్నింటికీ సంఘం బాధ్యత వహించాల్సి వుంటుంది. "ఆ! ఇప్పుడేమైంది. మన కట్టుబాట్లలో వాళ్లుండటం లేదూ! ధర్మాన్ని నాలుగు పాదాలమీద నిలబెడుతున్నాం" అని అనుకొంటారు పెద్దలు. కాని ఈ మధ్య "అబార్షన్ కేసుల్లో"నూ, లేచిపోవడాల్లోనూ నూటికి డెబ్బది వంతులు వితంతువులే అని మనము మరువరాదు. దానికన్నా హాయిగా వితంతు వివాహానికి సంఘం మనస్ఫూర్తిగా సమ్మతిస్తే లోకకల్యాణం చేసినట్లవుతుంది.

వితంతు వివాహానికి శాస్త్రంకూడా ఒప్పుకుంటుంది. పరాశర స్మృతిలో యిలావుంది.

"నష్టే, మృతే ప్రవ్రజితే, క్లీబేచ,
పతితే పతౌ
పంచ త్స్వాపత్సు నారీణాం, పతిరన్యో
విధీయతే!

(భర్త పోగొట్టుకు పోయివుంటే, చనిపోయి నట్లయితే, సన్యాసం పుచ్చుకుంటే, నపుంసకుడైతే, పతితుడైతే యీ అయిదు కష్టసందర్భాలలో స్త్రీ వేరేభర్తను విధిపూర్వకంగా వరించవచ్చు)

ఇక సనాతను లేమంటారో మరి? ★



2 వ డిజైను : టేబుల్ క్లాత్ కు, చీర, లంగాలకూ బార్డర్ గా కుట్టుకోవచ్చు. 1 వ పువ్వు రెడ్ కలర్, 2వ పువ్వు ఎల్లో కలర్, 3 వ పువ్వు వైలెట్, 4 వ పువ్వు రోజ్ కుడితే బాగుంటుంది. (లేదా పువ్వు లన్నిటికీ ఒకే రంగ దారం వాడినాకూడా బాగుంటుంది) ఆకులకు ముదర ఆకుపచ్చ దారంవాడాలి.



తృప్తి

—చిత్రకారుడు: డి. వి. ప్రసాద్, గుంటూరు]

★ సంకుచిత హృదయాలు ★

వస్తే ఎక్కువ చనువుగా గంటలకొద్దీ కూలేసి అక్కర్లేనివి కాకలిసినవి అన్నీ మాట్లాడే భర్తలున్నారు. ఎంతో ఓర్పు గలది ఐతే కాని ఇటువంటి భర్త ప్రవర్తన సహించలేదు స్త్రీ. అట్లాగని మగవాళ్ళను ఆడవాళ్ళకంటె ఎక్కువ సిగ్గు ప్రదర్శించు కుని, భార్య లేనప్పుడెవరైనా ఆమె కోసంవస్తే తలుపు చాటునుంచో, కిటికీ సందులనుండో "మా ఆవిడ లేదు" అనమనీ చెప్పడంలేదు. ఎవరైనావస్తే సభ్యతకోసం వచ్చినవారినిబట్టి కూర్చోమనవచ్చు, అవసరమైన విషయాలుంటే మాట్లాడవచ్చు. కాని ఘతిమీరి ప్రవర్తిస్తేనే చిక్కు. అంత మాత్రం ఫ్రీడమ్ ఆ భర్త తనభార్యకెందుకివ్వకూడదంటాను. తనులేని సమయంలో ఏ ఫామిలీ ఫ్రెండ్సు వచ్చినా భార్య వారిని కూర్చోబెట్టి మాట్లాడితే అపార్థం చేసుకునే సంకుచిత హృదయులు (తప్పు. వారిని విశాల హృదయులు అనాలి కాబోలు!) వున్నారు.

ఇక జాయింట్ ఫామిలీలోనే వుంటే ఆ ఇల్లాలిబాధ భగవంతుడికే తెలియాలి. భార్య తన అన్నలతోగాని తమ్ముళ్ళతోగాని పొఱపాటునైనా అవసరమొచ్చి మాట్లాడిందంటే తప్పుపట్టే భర్తలుంటారు. వాళ్ళపనేమీ చేయకుండా, వాళ్ళున్నా తనకేమీ సంబంధం లేనట్టు ప్రవర్తించినదా—ఇప్పుడు వెంటనే తప్పుపట్టే వొంతు అత్తగారిది. మఱదులంటే గిట్టదు, బావగార్లంటే భయం, భక్తి లేకపోలేదు. వాళ్ళ పనులేవీ తాకనైనా తాకదు. ఇట్లా అత్తగారు అభాండాలు వేసారు. ఇక నా యిల్లాలెవరి మెప్పని పొందుతుంది? భర్తను మెప్పిచ్చాలంటే అత్తగారికికోపం; అత్తగారి మెప్పు పొందాలంటే భర్తగారి ఆగ్రహం. అదే భార్య తన అక్కచెల్లెళ్ళతో తనభర్త మాట్లాడినా, చనువుగా వున్నా కూడ తప్పుపట్టదు. ఎందుకంటే ఆమెకది సహజంగానే వున్నట్టు అనిపిస్తుంది. ఇంతమాత్రం సహృదయత పురుషులలో వుందా?

మొన్న ఒకనాడు టి. నగర్‌లోవున్న మా స్నేహితురాలింటికి వెళ్ళాను. మధ్యాన్నం 11 గంటలకు వెళ్ళాను. తలుపులన్నీ వేసేవున్నాయి. ఆమెభర్త ఆఫీస్‌కి వెళ్ళివుంటారు. ఆమె ఒక్కతే లోపలెక్కడో వుండి తలుపులన్నీ ఇట్లా వేసిందేమా అని ఆలోచిస్తూ గదిలోకెళ్ళాను. మంచంమీద బోర్ల పడుకోనివుంది. నిద్రేమోనని ఒకటి, రెండు సార్లు పిలిస్తే జవాబులేదు. దగ్గఱకెళ్ళి చూస్తే—ఎక్కెక్కి ఏడుస్తోంది! ఇదేమిటేమంటే చెప్పదు. ఆఖరికి చెప్పిందికథ:—ఆమెభర్త ఆనాడాఫీస్‌కి సెలవుపెట్టారట. పరే భోజనాలయ్యాక మామూలుగాకబుర్లాడుతూవుంటే సినిమాయాక్టర్సు మీదకు తిరిగింది ప్రసంగం. తన అభిమాన నటుడు గురించి చెబుతూ, అతనెంతో చక్కగా యాక్టుచేస్తాడంది. ఏదో అతన్ని గురించి నాలుముక్కలు పొగిడిందట. ఇందులో పెద్ద తప్పేముంది. ఏదో సందర్భం వచ్చింది కనుక, అతను నటనాకౌశల్యం కలవాడు కాబట్టి పొగిడింది. అంతేకాని అంతమాత్రానికే కట్టుకున్న భర్తను డైవర్సు ఇచ్చి అతని వెంటపడ్తానని అన్నట్టు అపార్థం కల్పించుకుంటే ఎట్లా? ఇంతకూ అసలు విషయమేమిటో చెప్పలేదుకదూ. ఏముందీ, ఈమె ఆ ఫలానా నటుడిగురించి నాలుగు ముక్కలు

(48-వ పేజీ చూడండి)

వనితా వాణి



ఇది ఏమి 'న్యాయం'?

రామాయణ కథా కాలములో మండోదరి రావణుని మరణానంతరము విభీషణుని యిల్లాలు అయినదని శ్రీమతి "విద్య"గారు 21-5-58 పత్రికలో వ్రాసినారు. నేను కొన్ని రకముల రామాయణములు చదివినాను గాని ఎచటా విభీషణుని యిల్లాలు మండోదరి అయినట్లు చదవలేదు. ఇది ఎందులోనైనా చదివినారా? లేక అది తప్పు అయినట్లయిన దిద్దకోవలసినదని ప్రార్థన.

—జె. పి. వర్ధనమ్మ, కాకినాడ]

*   *   *

పిండివంటలు

బోండాలు నూనె బాగా పీల్చకుండా చేసే ఉపాయం ఏమిటని అడిగారు ఒక సోదరి.

వడలుగాని, బజ్జీలుగాని, బోండాలుగాని, పిండిపలుచగా ఉంటే, నూనె ఎక్కువ పీలుస్తాయి. నూనె కాగకుండా పిండి వేసినపుడు కూడ నూనె ఎక్కువ పీలుస్తాయి. అందుచేత నూనె బాగుగా కాగనీయాలి. పిండి పలుచనయినట్లయితే కొంచెం వరిపిండి కలుపుతే, నూనె, నేయి పీల్చవు. కాని కొంచెం గట్టిగా వుంటాయి అంచేత హోటలువాళ్లు తడిపి పెట్టుకున్న పిండిలో 4, 5 చోట్లు నూనె కలుపుతారు. అంచేత మెత్తగానూ, నూనె పీల్చకుండానూ వుంటాయి.

—ఇవటూరి శ్యామలాదేవి. తెనాలి]

*   *   *

శ్రీమతి విద్యగారు వ్రాసిన "భర్తృవిహీనుల దుర్భరస్థితి" చదివినంతసేపు నేను పడ్డ వేదన ఇంతా అంతా కాదు. ఇటువంటి వ్యాసములు చదివైనా మనవాళ్ళు మారతారేమోనని నేను నమ్ముతున్నాను. నా విషయంలో మాత్రం మా నాన్నగారు, మా బంధువులు, ఆఖరికి మా అన్న, అక్కలమైనా సరే వినకుండ మంచిపని చేసేరని నాకు ఈ సం॥ నుంచి తెలిసివచ్చినది. నా బి.ఇడి. పరీక్షఫలితాలు మొన్ననే తెలిసినవి. ప్యాస్ అయేను. ఈనాటికి నేను నా కాళ్ళమీదనిలబడగలిగి ప్రపంచకంలో ఒక స్థానాన్ని పొందేను. ఈ నెలవలయేక ఉద్యోగంలో చేరుతాను. నా వివాహం, నేను ఎస్. ఎస్. ఎల్. సి. చదువుచుండగానే అయినది. ఆ నెలవలలోనే నా భర్త మరణించేరు. అంతటి దుఃఖములోనుండికూడ మా నాన్నగారు నన్ను ఎవ్వరిమాట వినకుండ కాలేజీలో చేర్పించేరు. చేరిన క్రొత్తలో చాలబాధపడేదాన్ని. అందరు అన్నిరకాలుగాను మాట్లాడేవారు. కొంతమంది పిల్లలు తెలిసికూడ ప్రత్యేకంగా పూలు తెచ్చేవారు. మరికొందరు ఎవరెవరిమీదనో పెట్టి నన్ను దూషించేవారు. ఇక ఇరుగుపొరుగులవాళ్ల మాటలు వింటూంటే ఏరోజుకారోజు చనిపోవాలనిపించేది. కాని అన్నిరకాల అందరిమాటలను విని, దయతో స్వీకరించి, గుండెరాయిచేసుకొని, ఎప్పుడు సినిమాలకి, ఫంక్షన్లకి వెళ్లకుండ కాలం ధైర్యంతో వెళ్లబుచ్చుతూ ఈ నాటివరకు వచ్చేను.

—క. ఎస్. వల్లి, బందరు]

*   *   *

శ్రీమతి కొత్తపల్లి రాజ్యలక్ష్మిగారు వ్రాసిన వ్యాసము బాగుగాయున్నది. "ప్రేమ చిహ్నన్ని భర్త మరణాంతరం మెడనుంచి తీసివేయడం తగనిపని" అని వ్రాశారు. భర్తతో నేకద మంగళసూత్రం వచ్చినది! భర్త చనిపోతే తీసివేయడమే ఉత్తమం. నందిగామ సూర్యనారాయణ వ్రాసిన "సనాతనాచారాలు మంచివే" అను వ్యాసము చాలా బాగుగాయున్నది.

—దిల్ షాద్, నరసన్నపేట]

*   *   *

ఒక అభాగ్యురాలిని—పాపం ఆమెకు 13 సం॥ వుంటాయి 40 సం॥ టి. బి. పేషెంట్‌కి యిచ్చి పెళ్ళిచేశారు. ఆ అమ్మాయిని చూసేవరే జాలివేసింది. ఆపిల్లకి పధ్నాలుగేళ్ళు వచ్చేసరికి భర్తవ్యాధి ఎక్కువయి చనిపోయాడు. ఎంత ఘోరమో చూడండి. లోకం అంటె ఏమిటో తెలియని అమాయకురాలు. చక్కగా లంగా ఓణీ వేసుకుని జడగంటలు పెట్టుకుని తిరిగేది. ఏమిలేక తల్లియూ పెళ్ళి చేసింది. ఇక ఆ అమ్మాయిగతి ఏమిటి? ఇంట్లో వాళ్ళ మాటలు పడుతు చాకిరి చెయ్యవలసినదేనా? అటుప్రక్కకి వెడితే నాకు ఆ అమ్మాయిని చూస్తే నిజంగా ఎంత జాలివేస్తుందో చెప్పలేను. పట్టుమని 15 సం॥ నిండని ఆ పిల్ల జీవితము ఏమి కావాలి? ఇటువంటి అన్యాయములు జరుగకుండాచేస్తే ఎంత బాగుండును. అసలు తన భర్త అనే విషయమే తనకు తెలియనట్లుంటేది ఆ పిల్ల.

—బి. టి. లక్ష్మి, వుండి]

*   *   *

మంజూర్ కమలగారు వ్రాసిన అనాథల అగచాట్లు, అన్న వ్యాసం నా హృదయాన్ని కలచివేసింది. ఆమె వాళ్ళహృదయాల్లో దూరి వారి బాధనంతనూ గ్రహించి వ్రాసినటుంది. నిజంగా ఈనాటి స్త్రీలు కూడా ఆమె వ్రాసినట్లు అవమానాలూ అవహేళన యెదుర్కొంటున్నారు. ఈ నాగరిక కాలంలో ఈ విషయంలో మాత్రం ఏమీ మార్పు రాలేదు. కాకపోతే కొంతవరకూ ఎదురు తిరిగి సాంతం కురూపిగా వుండకుండా జుట్టు వుంచుకుంటున్నారు. స్త్రీ దురవస్థకి పురుషుల దౌర్జన్యం కొంత కారణం అయినా, తోటి స్త్రీలు కూడా ఇందుకు బాధ్యులవుతున్నారు. స్త్రీకి స్త్రీయే జడుస్తోంది. భర్త పోయినా ఆడదానిమీద సానుభూతి ఎదట చూపించినా చాటున వ్యాఖ్యానించేవాళ్లు ఎక్కువగా ఆడవారిలోనే వున్నారు: "భర్త పోయినా దీనికి ఆ జుట్టెందుకు ఎవరు సంతోషించను...యాడాదయినా కాకుండా పూరిమీదకు బయలుదేరిందేమిటి...తలకూడ దువ్వుకుంటోంది...రవిక తొడుగుతోంది. మొన్న నేను పలకరించటానికి వెడితే సరిగా యేడవనేలేదు...మొన్న మొగుడు మాసికం నాడు చాటుగా కాఫీ తాగింది... ఇలాంటి పరిశీలనలూ, యీ భాషా మగవారికి చేతగావు. నేను ఇలా రాశానని నామీద కోపగించుకోకండి.

నేనూ ఆడదాన్నే. మనలో మనం మనస్ఫూర్తిగా ఆదరించుకొన్ననాడే మనకు పురుషుల హృదయంలో చోటుదొరుకుతుంది. పురుషులలో కమలగారు రాసినటువంటి వారు ఇప్పుడు లేరు. వారు పూర్వులు. ఛాందసులు. ఈ రోజుల్లో అటువంటివారు ఎక్కడో తాతయ్యలు నూటికి 10 మంది వున్నారేమో కాని వారివల్లకూడా అంత బాధలేదు.

★ వనితావాణి ★

కాకపోతే అనాథదో కాస్తగొడవచేస్తారు. వారికి వ్యతిరేకంగా జరిగితే వారి చేతి భోజనం చేయకుండా ఆచారంగా వుంటారు. ఇప్పుడు ఆడవాళ్లుకూడా కొంతవరకు తెలుసుకున్నారు. ఇవాళో రేపో చచ్చేముసలాళ్ళమాట యెవరూ వినడంలేదు. ఇక బాల వితంతువులమాట అంటారా బాగా వయస్సు ముదిరిన కన్యనయినా పెళ్ళాడుతాడుగాని పురుషుడు ఏమీ యెరుగని బాలవితంతువుని పెళ్ళాడటానికి ముందుకు రావటంలేదు! తప్పుచేయటం అనేది పురుషులలోనూ స్త్రీలలోనూ గూడ వున్నది. కాని పురుషులవిషయంలో అది సాధారణమవుతుంది. స్త్రీకుమటుకు ఆశ్చర్యము, అపరాధము అవుతుంది. మంచి అయినా చెడ్డ అయినా పెద్ద ఎత్తున, అదేపనిగా జరుగుతూ ఉంటే ఎవరూ పట్టించుకోరు. ఎప్పుడో ఒకసారి జరిగేది అయితే అందరి దృష్టినీ ఆకర్షిస్తుంది. మగవారు నిర్భయస్తులుగనక తను చేయతల్చుకుంది తప్పయినా చేసేస్తుంటారు. లోకంకూడా, అట్టే పట్టించుకోదు. నిత్యం చచ్చేవాడికి ఏడ్చేవాడెవడు అన్నట్లు. కాని ఆడది జడుస్తూ తప్పు చేసిందంటే దానికి నిజంగా చచ్చినంతపనే జరుగుతుంది. పెళ్లిగాని పిల్లయితే చెప్పక్కరలేదు దానికి పెళ్లి అయిందనిపించేసరికి తల్లిదండ్రుల ప్రాణం కడపడుతుంది. నే చెప్పేదేమిటంటే అటువంటివారికయినా అవుతున్నవి కాని, పెళ్ళిళ్లు బాల వితంతువులకు అవటం కష్టంగానే వున్నది. ఈ విషయంలో పురుషుల సహకారం కావాలి. వారు స్త్రీ హృదయాన్ని అర్థం చేసుకుని స్త్రీపట్ల వుదారంగా ప్రవర్తిస్తే ఈ సమస్య కొంతవరకు తీరుతుందని నా ఆశ. ఆడవాళ్ల గురించి నేను ఏమయినా అసభ్యం అనిపించేలా రాస్తే క్షమించండి. మనలో మంచివారూ వున్నారు. చెడవారూ వున్నారు. మనస్త్రీలలో వున్న చెడ్డను దాచి కేవలం పురుషులనే అనటం భావ్యం కాదేమో.

—శివలెంక విద్యాధరి, పమిడిముక్కల]

* * *

వ్యభిచార నిర్మూలన

"సంస్కరణలు" జరగడం అవశ్యకమే. నాగరికం కూడా. అయితే ఆ "సంస్కరణలు" ఏ స్వరూపంలో ఉండాలి అనేది జాగ్రత్తగా ఆలోచించాలి. అంతేకాని మేధావుల విజ్ఞానాన్ని ఆశయాలనూ చట్టరూపములో ప్రజల నెత్తిని రుద్దడం వల అసలు సమస్యలు సంస్కరించబడవు - సరేగదా అనేక రూపాలలో వికృత పరిస్థితులు పుటక తప్పవు దానివల్ల మొదట సంస్కరించబడే వ్యవస్థ స్వరూపం మరింత వికృతం కావడం సంభవం - కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అభ్యుదయ సంస్కరణాలంటూ, అసలు వున్న చెడ్డనే ఎన్నోరెట్లు పెంచే విధంగా చటాలు ప్రవేశపెట్టడం అనేది ఊసుపోని మంగలి వ్యవహారంలా వుంది.

వ్యభిచారం చెడదే అయినా అది ఏనాడూ ఏ పరిస్థితులలోనూ నశించేది కాదు. మానవజాతి ఉన్నంతకాలం వ్యభిచారం సజీవంగా ఉండి ఉండవలసినదే. ఇన్నాళ్ళ మానవ చరిత్రలో ఏ దేశంలోనూ వ్యభిచార నిర్మూలనకు జరిగిన ప్రయత్నాలు ఫలవంతం కాలేదు. వ్యభిచారం నిర్మూలించడం అంటే పరోక్షంగా దాని అభివృద్ధికి దోహదంచేయడమే కాగలదు. ఈ మధ్య మన కేంద్రప్రభుత్వము తలపెట్టిన వ్యభిచార నిర్మూలనచట్టం వల్ల మంచికన్న చెడే ఎక్కువగా జరుగుతోంది. అధికారాన్ని ఉపయోగించి, ప్రజాదరణ పొందని చటాలు చేస్తే ఆ చట్టాలు ప్రజలచే నిర్లక్ష్యం చేయబడతాయి. ఆ శాసనాలను అతిక్రమించేవారు కొల్లలుంటారు. అందువల్ల ప్రభుత్వానికి వృధాశ్రమ. డబ్బు ఖర్చు తప్ప ప్రజలకు కలిగే మేలు శూన్యం. ఒక ప్రభుత్వ శాసనాన్ని నిత్యం నిర్లక్ష్యం చేసేవారుంటే ఆ ప్రభుత్వంపై ప్రజలకు భయం పోతుంది. భక్తి వుండదు. ఆ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కూడా కోల్పోతుంది.

ఇక యీ వ్యభిచార నిర్మూలన చటం, వ్యభిచార వీధులను నిర్మూలించి సంసారుల వాడలలోకి వ్యభిచారాన్ని రవాణా చేస్తుంది. పైగా పట్టణాలను వదలి వ్యభిచారిణులు తమ నివాసములను పల్లెలకు మారుస్తారు. పైకి సంసారులుగా నటిస్తూనే వ్యభిచారం సాగిస్తూవుంటారు. వీరు ప్రత్యేక వీధులు వదలి సంసారుల మధ్య సంసారులుగానే వుండి తమ వ్యాపారం సాగిస్తారు. ఇందువల్ల యిరుగు పొరుగు సంసారులు కూడా వారిని అనుసరించవచ్చు. దాని పరిణామము మద్యపాననిషేధచట్టంవల్ల ఊరు మూలలుపోయి ఇంటికొక సారాపాయింట తయారైనట్టుగా ఉంటుంది. ప్రత్యేక వీధులలో సాగే వ్యభిచారం ప్రతీ వీధిలోనూ ప్రతీ ఇంటిలోనూ తాండవిస్తుంది—మానవులు సామాన్యంగా ఏ వాంఛనుండి అయినా తప్పుకోగలరు గాని ప్రకృతి బద్ధమైన స్త్రీ-పురుష వాంఛనుండి తప్పుకోలేరు. దానిని నెరవేర్చుకొనుటకు యితరత్రా తప్పకుండా ప్రయత్నంచేసి తీరుతారు. యీ ఆర్థికసంకటస్థితిలో యిలాంటి పురుషప్రయత్నాలు అవలీలగా జయప్రదం కాక తప్పవు. దీనివలన చాలా సంసారాలు వ్యభిచారానికి గురికావలసి వస్తుంది. ఇక పరిపాలనా విధానంలో యీ చట్టం అమలులోకి తెచ్చేవారు పోలీసులు. వీరు దీన్ని దుర్వినియోగం చేసే ప్రమాదాలు ఉన్నాయి. దీనివల, వ్యభిచారిణుల మాట అలా ఉండగా ఒంటరి జీవితం గడుపుతున్న అనేకమంది అమాయకయువతులు నానా అగచాట్లూ పడవలసివస్తుంది.

ఈ కారణాలే కాకుండా ఇంకా అనేక అనర్థాలు రాకుండా ప్రభుత్వం ఈ చట్టాన్ని ఉపసంహరించుకోవడం ఉత్తమము. ఇదే వృత్తి కలవారందరూ కలసి యీ బిల్లు రద్దు చేయించడం కోసము శాంతియుతంగా ప్రభుత్వంతో పోరాటము సాగిస్తున్నారు కూడా. ఇప్పటికే నిరుద్యోగుల సంఖ్య రోజు రోజూ పెరిగిపోతూవుంది. ఈ చట్టమువల్ల కొన్ని లక్షలమందికి జీవనోపాధి చూపించవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది. ★

—ఆనాల అనంతరావు, మద్దమశెట్టిరాముం
బలిజపేట-శ్రీకాకుళం జిల్లా]



34

మరుసటిరోజు ఉదయం బుటపటుకొని బజారుకు వెళ్లాడు. తన స్థితి మామూలైంది. ఆ కుర్రకుంకలు ఎగతాళి ముసలమ్మలగోడు తనను సగం చచ్చినట్లు చేసాయి. తిరిగి వెళ్లిపోదామనుకున్నా ఈ ఒక్కరోజు మరిరావని వాళ్ళని ప్రతిమాలి నచ్చచెప్పాడు. మధ్యాహ్నమయేసరికి వచ్చిన నాలుగణాలతో యెక్కడ నాలుగు కడుపులు నిండుతాయి? ఏదో బుక్కెడు నోటిలో పోసుకున్నట్లుంది.

మధ్యాహ్నంచేసిన కష్టం నాలుగణాలు ఇచ్చింది, తనకు లేకపోయినా తను అనుకున్న పని చేసితీరాలి. సాయంత్రం రోడ్డు మీద మనుష్యులు కిటకిటలాడిపోతున్నారు. అనుకున్నట్టే ఆ జ్యోతిష్కుడు వున్నాడు. గబగబవెళ్ళి పుల్లయ్య దండం పెడూ వినయంగా యెదురుగా కూర్చున్నాడు. కొడుకు తండ్రిని అనుసరించాడు. నల్లటి కోయ జ్యోతిష్కుడు ఒక్కసారి నిదానించి చూచి "గుడ్డలో యేంలేదు నాయనా గుండెలో వుంది...కుర్రాడు నిజాన్ని నిలపెడతాడు...అయ్య పేరుప్రతిష్ఠల్ని నిలపతాడు," అన్నాడు.

ఈమాటలు పుల్లయ్యకు యెంతో ఆనందాన్ని ఇచ్చి అతనిపై పూర్తి నమ్మకాన్ని కలిగించాయి, కొన్నేపు మౌనంగా పుల్లయ్య చెయ్యితీసుకొని చూసి చూసి "నాయనా! దగ్గిరికివచ్చింది, దూరం వెళ్లిపోతోంది! తామరాకుమీది గంగలా నీగుండె వుంది! స్వస్థలమందు శని తిరుగుతున్నాడు—నలుగురు బతకాలంటావ్—లేకను, బగవద్దానం బట్టి ఆవుస్సు యెనబై యుంది. నాలుగు పైసాలు కలిసివస్తాది—ముందుకు సుకం వున్నదిగానీ కష్టంలేదు. కడుపునిండా పెట్టే పూనుకుంటాది—లేదంటే ముక్కు నిలుపుతాది...ఏకో చక్రం...ఒకటే మాట...ఒకటేబుద్ధి... మొగపురుషుడు తుమ్మతో సమానం...ఆడస్త్రీ పువ్వుతో సమానం! మోదకొండమ్మని నీపేరుసెప్పి పూజచేస్తాం...సెడుగంతా కడిగేస్తాది...మంచి రోజుల్ని తెస్తాది...యీ కుంకం రాసుకో నాయనా..." అంటూ ఇద్దరికీ బొట్టు పెట్టాడు. పుల్లయ్య ఉత్సాహంగా కొడుకు గురించి యెన్నో ప్రశ్నలు వేసాడు. కోయ నవ్వి "ముకమే అద్దంలాగవున్నాది! నాయనా పులికి యెదురుగా యెలాడు...నాలికకి యెముక వుంచినటు నాయమే పలుకుతాడు. ...నూటా నాటా కాదు. కోటికి ఒకడు యిలాంటోడు పుట్టాడు!..."

పుల్లయ్య వళ్ళు పులకరించింది! ఇంకేమీ అడగలేదు. బేడ వాడిచేతిలో పెటి దండం పెట్టి మరీ వెళ్ళిపోయాడు. అప్పుడే దీపాలు వెలిగించారు. మళ్లీ తనలో ఉత్సాహం చొచ్చుకపోతోంది. నడుస్తూనే కొడుకు వేపు పదే పదే చూస్తున్నాడు. ఎంత చూస్తున్నా తనివితీరకుండావుంది. ఆ కొడుకు పుట్టుపూర్వోత్తరాలు జ్ఞాపకానికి రాసాగినయ్.

"నాకు ఆయుస్సు యెనబయేళ్ళుంది...శని దేముడు యెన్నాళ్లుండిపోతాడు - నా కొడుకును సదువులో వేస్తాను. ఎలాగపట్నం సేరినాను - ఎవురికాళ్ళు పటుకోనైనా సదివించేస్తాను. నాకొడుకు పెద్దసదువు సదువుతాడు. నాయం సెప్పాడంటే - అగద్దె మీద కూర్చోడా? కోటికి ఒకడంటే మాటలా? నా అయ్య తక్కువ పుటుక పుట్టాడా?"

అలా అనుకుంటూనే పీర్లకోనేరు రోడ్డు చేరుకున్నాడు. ఈ ఆలోచనలు ఆకలిని మరుగుపర్చాయి.

ఆ క్షణుకి సరిగ్గా నిన్నటి స్థలంలోనే కూర్చొని అదే కంఠంతో అరుస్తోంది. నిన్న జరిగినదంతా తలుచుకుంటుంటే తనపై తనకే అసహ్యం వేసింది. రాత్రంతా తనకు సరిగ్గా నిదరే లేదు. అణాకి అణావడ్డీ వేసి మరీ ఆమె చేతిలో వేసాడు. ఆమె తరుముకొని బేడ కాసు పోల్చుకొని ముఖం వెలిగించి దీవించింది! పుల్లయ్యకు ఆ దీవన శాపంలా తగిలినటనిపించింది. చేసినపని చెప్పకుంటే పాపం పోతుందనుకున్నాడు. కాని చెప్పలేక "అలాగ దీవించకమ్మా - నీ ఋణం

తీర్చేసాను," అన్నాడు.

ఆమె అమాయకంగా నవ్వి "తెలిసిన బాబులు అలాగంటారు. నీ దగ్గర దాచిపెట్టా మావాయనా...మీ అరవలో మాలాంటి అవాధలకు యింత పడవేస్తే అది మాదలా ఔతుంది? మీలాంటోలకి పుణ్యం రాదా బాబూ!" అంది.

పుల్లయ్య చటుక్కున "పున్నెమా? పాపం!" అన్నాడు.

"ఎంత మాటన్నావు తండ్రీ – పెద్ద బ్రతుకు బ్రతికాను ఏ జన్మలో ఒకరికి పెట్టలేదో ఈనాటికి నాకీగతి వచ్చింది. అన్నంకి దూరం అయినోలకు ఆయువెక్కువ నాయనా! ఒక్కరోజు హెచ్చుతగ్గులో అందరూ అక్కడకు వెళ్ళవలసిందే – ఆరోజు వచ్చేవరకూ కడుపు యేమైనా చేయిస్తుంది. ఇచ్చినవాడు పుచ్చుకున్నవాడికంటే గొప్పవాడు బాబూ! అలాంటివాళ్ళకి పుణ్యమే వస్తుంది."

ఒకక్షణం పుల్లయ్య ఆమె వేపు చూసాడు. నిన్న ఆమెను చూసి అసహ్యించుకున్నాడు. అలాంటి హీనమైన బ్రతుకు బ్రతికేబదులు చచ్చిపోయింది కొదనుకున్నాడు కానీ యీ వేళ యిలాంటి తలులు కలకాలం బ్రతికుంటే బాగనిపించింది. కోయదొర చెప్పినట్టు గుడ్డలో యేముంది గుండెలో వున్నాది! తను యే పెంటమీద వుంటే నేం-తన నీలి ఆ కంపు వీధిలో పందుల దొడిలాంటి పాకలో వున్నా దాని గొప్పతనం యెటుపోతుందనుకున్నాడు. ఈ లోకంలో యింత వరకు తను చూసిన మనుష్యులెందరో జ్ఞాపకానికి వస్తున్నారు. అందులో డబ్బున్న రాజిగాడు ఒకవాడు సుకంగా బ్రతికాడా? డబ్బులేని కటిక పేదముసలమ్మ యెంత హాయిగా, నవ్వుతూ చచ్చిపోయింది? అలాంటిరాజిగాడే నడుంకట్టుకొని కార్యం చేసాడే? ఈ ప్రపంచం మంచి చెడ్డలూ అనే రెండే రెంటితో నిండిపోయింది. మంచికి చావులేదు; చెడ్డ చచ్చిపోయి మళ్ళీ పుట్టుంది! రోజూ చావే రోజూ పుట్టుకే దానికి !!

ఆ నిర్మలహృదయం ప్రక్కన కూర్చోగానే పుల్లయ్యకు యిలాంటి చల్లని ఆలోచనలు వచ్చాయి. యింటికి వెళ్ళి యెంతో గొప్పగా జ్యోతిష్యుడు చెప్పింది పెళ్ళాంతో చెప్పే ఆమె "ఆ పైసాలుంటే యీ పూటకు గడిచిపోనంటే" పుల్లయ్యకు కోపంవచ్చింది "ఆడెలాబతకాల? ఆడి కష్టం వుంచుకుంటావా?" అన్నాడు.

ఆ మరుచటిరోజు బజారుకు వెళ్ళలేదు. మరి వెళ్ళినని భీష్మించుకున్నాడు. ఓరోజు బయట కూలి దొరుకుతోంది ఓ రోజు లేదు. నీలి చాలా చిక్కిపోయింది, ఏ సమయాన ఆమెకు జబ్బుచేస్తుందోనని పుల్లయ్య ఆందోళన చెందసాగాడు. ఆ వీధిలో చేతి అప్పులు యిచ్చినవాళ్లు తొందరచేస్తున్నారు అద్దె ఇంకా ఇవ్వలేదని యింటిమనిషి ఎగిరిపడిపోతోంది! అద్దె యివ్వకపోతే సామానులు వుంచి మనుషులు కదలిపొండంటోంది. నీలి యే యింట్లోనైనా పనిమనిషిగా కుదరాలని ప్రయత్నించింది. "అంట్లు తోముతావా? ఛస్తే యిలా చచ్చిపోదాంగానీ ఆ పనికి యెళ్ళొద్దన్నాడు. ఐనా ఆమె రోజుకు రోజు బలహీనమైపోతోంది. ఎక్కడ తిరిగినా కడుపునిండే కూలి దొరకలేదు. యేం చెయ్యటానికి తోచక పుల్లయ్య బజారెత్తసాగాడు.

ఒకనాటి సాయంత్రం ఆకలి వేస్తున్నా కొడుకును వెంట పెట్టుకొని యేకొట్లోనైనా పని దొరుకుతుందేమోనని మార్కెట్టులోకి వెళ్లాడు. ఒకాయన అన్నాడు. "నీ మంచి చెడ్డా మాకేం తెలుసు? మొన్న ఒకోడ్ని పెట్టుకున్నాం. నిన్న చేతికి దొరికినమట్టుకు తీసుకపోయాడుదొంగతనంగా!" అన్నాడు. పుల్లయ్య యెంతో ప్రాధేయపడ్డాడు. కాని వాళ్లు వెంటనే నమ్మేపరిస్థితిలో లేకపోవటం వల్ల లాభం లేకపోయింది. తిరిగి తిరిగి సగం ఆకలితో చచ్చిపోయి తండ్రీ కొడుకులు బాడారా రోడ్డుగుండా ఇంటివేపు వస్తున్నారు. అలా చీమనడకలు తలవంచుకొని నడుస్తుంటె అన్నా అన్న పిలుపు వినిపించింది. ఆ పిలుపు యిదివరకు విన్నదే. తలెత్తి చూసాడు...అన్నను చూడగానే పుల్లయ్యకు సిగు వేసింది. ఓట్ల గొడవలో తన మకొదని బంగారయ్యడబ్బుకు ఆశపడ్డాడుగా,

మామూల్లుగా ఆ అన్న భుజం మీద చెయ్యివేసి 'అన్నా సాలాకాలనికి కలిసినావు' బంగారయ్య యేదైనా నౌకరీలో యేసినాడా?"

"లేదన్నా! అడి అవసరం అయిపోనాక గెంటించీసినాడు! ఆడినని యేం నా బంగారాత యిలాగున్నాది – శనిదేముడు పట్టుకున్నాడు—మంచి కళ్లినా చెడుగే వస్తున్నాది—నీ మాటయిన్నానుకాదు..."

"కష్టపడినోడ్ని—నీ కష్టం నాకు తెలీదా అన్నా! కూలికలినావు...తప్పేంవున్నాది? రా చానీరు తాగుదువుగాని"

పుల్లయ్య కొదనలేక పోయాడు. ఆ రోడ్డు ప్రక్కనే వుంది కాకా హోటలు. బెంచీలు దగ్గరనుంచి అందులో పని చేసే మనుషులు హోటలు గోడలు అంతా నలుపే! ఒకమూల ఒక టేబిలుమీద సిలవరు పళ్లెరములలో రకరకాల తినుబండారాలున్నాయ్! ఒక మూల చాచేసే టేబులు. హోటల్ యజమాని లావుగా పొట్టు బనియను లుంగీతో మొదటిలో కూర్చున్నాడు. ఆ టేబిలుమీద చిన్న గ్రాముఫోను ఉంది. హిందీ రికార్డులు వేస్తున్నాడు.

బోండాలు, పరోటాలు తెప్పించి ఇద్దరి కడుపూ నిండేటట్లు మెక్కించాడు. చా నీరు బలవంతం చేసి త్రాగించాడు. ఇంకా నాలుగు బోండాలు పొట్లం కట్టించి "అమ్మకిచ్చి" అని మల్లు చేతిలో పెట్టాడు. పుల్లయ్య తిన్నాక, రెండు మూడు సార్లయింది అన్న చేతే ఖర్చు పెట్టిస్తున్నానని సిగు వేసింది. కడుపు నిండగానే సత్తువ వచ్చింది.

ముగ్గురూ మళ్ళీ రోడ్డుమీదపడి నడుస్తున్నారు. పుల్లయ్య "ఎక్కడైనా పని దొరికిందాఅన్నా" అన్నాడు.

"పని కరువా? ఓరన్నా! సెలెలు జబ్బమనిషి అయిపోనాది. అందరూ యేలెత్తి చూపడమే! లోకం యింతపచ్చగా వుంటే యీకడుపులో సిచ్చు పోసీమంటావా?"

"ఆబాబు పనిచేస్తే నాకూ యింత ఆదరు వుండేది."

"ఆబాబుదీ పోనాది-ఆబాబేం సెయ్యనేడు."


"అయితే యెలాగ అయినాది?"

"అంతా సెప్తాను...రా కూరోన్నె..."అని రోడ్డుప్రక్కనేవున్న గటు మీద కూర్చున్నాడు. కూర్చున్న పుల్లయ్యతో "రేపు ప్రొద్దున్నరా గొప్పోడి ఆశలు బీదోడి కష్టాలెంటో సూస్తువుగానీ. ఇవన్నీ సూసేమనకి యీలోకంలో నీతేంటి గీతేంటి అనిపిస్తాది.

"నీతిపోతే అంతా సరన్నా!"

"అన్నా! నివ్వు ఆకలితో సచ్చిపోతే నీకు నీతేంసేస్తాది? నీవు బతికుంటేనే యీ నీతీగీతీ రచ్చిస్తాది-అధికారం, డబ్బుతో గుడ్డిఅయినోడు రాజరికంచేస్తే యేం ఆవుతాది? ఒకరిమీద బాంబు యేసీమంటాడు. ఆయ్యా ఆబాంబుపడినదగ్గర నా పెళ్ళాం పిల్లలాంటోలు వుంటారని అనుకోడే! ఏ పని సేసినా ప్రజంతా తన్బిడ్డలనుకున్నవోడే

(47-వ పేజీ చూడండి)



మర్రితోపుల నుదయ భానుని
ఎర్రబింబం తోచు వింతల;
పెరటిలోనీ అరటి చెంతల,
బలిసిపోయిన తులసి పొంతల,
కావియంచుల బావి గట్టున,
జామిచెట్టున, రామచిలుకలు!
రామ చిలుకలు! ప్రేమ చిలుకలు!
ప్రేమ చిలికే రామ చిలుకలు!
కెంపుముక్కుల గింపు చిలుకలు!
నీల గళ మాలికల చిలుకలు!
పచ్చరెక్కల విచ్చు చిలుకలు!
కులుకు మెడలా, కలికి చిలుకలు!
ప్రకృతిదేవత మేని పులకలు!
కలకలా, కిలకిలా, గొంతుల
కులుకుతున్నై! పలుకుతున్నై!
పలికి, ముద్దులు చిలుకుతున్నై!
ఒయారాలను విప్పుతున్నై!
జయాలేమో గుప్పుతున్నై!
క్షేమసామాజికుల భామలా,
సీమలేలే పుణ్యధామలా,
ఉన్నతమ్ములు వానిచూపులు;
సున్నితమ్ములు వాని తీపులు;

కమ్మకమ్మని, చదువు నేర్చెను;
కొమ్మ కొమ్మన, కొలువుతీర్చెను;
పచ్చికాయలు కొరికిపోసెను;
దోరగాయల చీరివేసెను;
ఆరముగ్గిన పండు లవిగో!
తీరుబడిగా నేరుకొనుమీ;
చెట్టునీడను చిట్టిపాపా!
ఎత్తిన శిరసు దింప బోకే,
క్షణం-రెప్పలు వాల్చబోకే,
ఏమి పరకాయింతు విచ్చట?
అమ్మ నిను, చూస్తోంది, ముచ్చట;
బొమ్మ యిపుడే-పలికె గాదా?
చిలకతల్లే, చిట్టితల్లని!
పోలికల బాళించుకొనదో?
చిలుక యెంగిలి ముట్టుకోవా?
సిగ్గుతెరలను బెట్టునరులో?
పలుకరించెను, చూడు! నిన్నె;
చిలుక పలుకులు నేర్చుకొనదో?
నీ పలుకులే నేరిపెదవో?
మాకు తేడా లేదు; గానీ,
యీకొనుడు మీలోన, మీరే;
చెట్టునీడను చిట్టిపాపా! ★

సోమంచి సూర్యనారాయణ శర్మ

నేను ఆడదాన్నైతే...!

క్రొవ్విడి రామం

"నేను మనవి చేశానని మీ జమీందారుగారితో చెప్పండి. నాకు ఒక్క-క్షణం తీరదు. ఇంతకూ, దశమి నాటికి దర్బారుకి వెళ్ళకపోతే మా ప్రభువువారు నాకు దేవిడీమన్నా చెబుతారు."


"నామనవి చిత్తగించండి దాసుగారూ! మాది చిన్న జమీందారీయేగాని, మా ప్రభువులు మాత్రం కళాసంపదలో చాలా గొప్పవారు. మా ఏలిక, ఆయన పత్ని యిద్దరూ కూడా చక్కగా వీణ వాయిస్తారు. మీరు తానం వాయించడంలో యేదో మహత్తరమైన విశిష్టత వుందట. మారాజుగారు చెవి కోసుకుని ఆనాడు మీ వాయిద్యం విన్నారు. ఒక్కమాట! రేపు మా జమీందారిణిజన్మదినోత్సవం. మహలుకు మన్నన విన్యాలవారుకూడా వచ్చారు. భవనమంతా రాజబంధువులతో కిలకిలలాడుతూంది. మీరు రేపు మధ్యాహ్నం వీణ పట్టుకుని వొక్క అరగంట కూర్చున్నారంటే వారందరి వీనులకూ గొప్ప విందు జరుగుతుంది. ఈవుదయానికే గొప్ప మార్దంగికుడు కూడా వచ్చాడు. మంచి లయజ్ఞానం కలవాడు..."

"మీరు నన్ను మొహమాట పెడుతున్నారు. ఎలాగైనదలాగే అవుతుంది. మీ కోరిక ప్రకారమే జరిగిస్తాలెండి," అన్నాడు.

2

అదివొక జమీందారుగారి భవనం. రాజబంధువులతో, మనోరంజకమైన అగరువత్తుల వాసనలతో, నేత్రపర్వాలైన చిత్రాలతో ఆ భవనం అతి రమణీయంగా అలంకరింపబడింది. దాసుగారు షడ్వింజలూ పోసి సన్నని జరీగల ఉప్పాడ ధోవతి కట్టుకున్నారు. తెల్లని మల్లు చొక్కాపైన సన్నని చేనేత వాణీ వేసుకున్నారు. సింహద్వారం దగ్గర ఆయనకు స్వాగతం చెప్పడానికి వచ్చిన దివానుగారు - ఏ కారణం చేతనో ముఖం ముడుచుకున్నారు. చాలా చీదరగా, "దాసుగారూ! ఈ మాత్రం దర్బారు మర్యాద తెలియదా? ప్రభువుల సన్నిధికి వచ్చినప్పుడు నడుముకి కట్టుకోవాలనీ తలకు పాగాచుట్టాలనీ కూడా మేమే చెప్పాలా? బాగుంది మీ వేషం. వేగం ఇంటికివెళ్ళి సరియైన దర్బారు వేషంతో సంగీతకచ్చేరి చెయ్యడానికి రండి" అన్నాడు అధికార హోదాలో.

దాసుగారి ముఖం కోపంతో జేవురించింది. కనుబొమ్మలు ముడిపడ్డాయి. ఆయన ఆత్మగౌరవం అంతా ఒక్కసారి పైకి విజృంభించినట్లయింది. "ఏమి దివానుగిరీ చేస్తున్నావయ్యా నువ్వు! నేనే మీరాజుగారి దగ్గర నౌకరు ననుకున్నావా? నడుంకట్టి చేతులు జోడించి నిలబడడానికి. ఎద్దుకేం తెలుసు అటుకుల రుచి అన్నట్లు, కళోపాసకుని విలువ రివెన్యూ పెత్తందారువైన నీకేం తెలుస్తుందయ్యా?" అని దాసుగారు



"ముందు ఈమనుసు కెత్తే మార్గంచూడు—
తర్వాత దీన్ని నడిపించే భారం నాది!"

★ నేను ఆడదాన్నయితే...? ★

చీదరించుకుని అక్కడునుంచి బసకు తిరుగుముఖం పట్టారు.

వైణికుడు ఎంతకీ దర్బారుకి రాక పోగా, ఆలస్యానికి కారణం కనుక్కుందామని జమీందారుగారు దివానుకు కబురపంపారు. దివాను గొప్పగా, దర్బారు మర్యాదను కాపాడ్డానికి తను చేసిన ఘనకార్యం గురించి, ప్రభువుకి విన్నవించాడు. ఆయన దివానుగారి అవివేకాన్ని యేవగించుకుని వైణికునకు యిష్టమైన రీతిని అతనిని సగౌరవంగా మహాలుకు తీసుకు రావలసిందనిన్నీ, ఇది వఱుకు జరిగిన అపచారానికి తానా వైణికుణ్ణి క్షమాభిక్ష వేడుకోవలసిందనిన్నీ, జమీందారుగారా జ్ఞాపించారు.

గత్యంతరంలేక దివాను దాసుగారి బసకు పరిగెత్తుకు వెళ్ళాడు. కాళ్ళా వేళ్ళాపడి అతని మనస్సు తిరిగి ప్రసన్నం చేశాడు. కాని యీ సారి దాసుగారు ఒక చిన్న నాగుల గావంచా కట్టుకుని, పై మీదొక తుండుగుడ్డ వేసుకుని, శిష్యుని చేత వీణ పట్టించుకుని సగర్వంగా మహాలు వైపుకి నడిచారు. "ఏమంటే వారికి తిరిగి యేం కోపం వస్తుందో"ననే భయంచేత, దివానుగారు కిక్కురు బిక్కురు మనకుండా ఆయన ననుసరించారు.

విపరీతమైన దుస్తులతో విజయం చేసిన వైణికునిచూసి సదస్యులంతా విస్తుపోయారు. ఆయన వెంటనే వీణ తంత్రులు సవరించి "ఎందరో మహానుభావులు" అన్న త్యాగరాయ కీర్తనను పై కాలంలో వాయించి, అద్భుతంగా తానాన్ని వీణతంత్రుల మీద వినిపించారు.

క్రింద నుంచి 'మీదకు, మీద నుంచి క్రిందకు వీణమీద వేళ్ళు పందెపు గుఱ్ఱాల్లా పరిగెడుతూ వుంటే, సదస్యులు తన్మయత్వంతో ఆమధుర నినదాన్ని ఆలకిస్తున్నారు. ఒక్కొక్కప్పుడు వారికి వొంటిమీద చైతన్యమే లేనట్టుండేది. కేవలంగా వారి ఆత్మలు ఆ క్షణంలో నాద బ్రహ్మంలో ఐక్యమైపోయాయా అన్నట్టుగా వుంది.

కొంత సేపటికి "పవమాన సుతుడు పట్టు" అనే మంగళగీతిక వారి చెవిలో పడి పాటకచేరీ యొక్క ముగింపును సూచించింది. దాసుగారి ప్రతిభకు జమీందారు తన్మయుడైనాడు కాని తానెంతో వేడుకతో ఆయత్తం చేసిన సభకు ఈనాయకుడు వికృత వేషంతోవచ్చి తనకు ఉత్సాహ భంగం కలిగించినందుకు కించబడ్డాడు. ఇంతలోనే, పళ్లు, తాంబూలము, దాసుగారి కట్నము, సుగంధ ద్రవ్యములు మొదలైనవాటితో కూడిన వెండిపళ్లాన్ని పరిచారిక ప్రభువు సన్నిధిని వుంచింది.

శ్రీవారు దాసుగారికి స్వయంగా పళ్లెం అందజేస్తూ, "అయ్యా! మీ వాయిద్యం అత్యద్భుతంగా వుంది. ఇంత కళ వున్నందుకు మీరే ఆడదైతేనా..." అని యింకా యేమేమో చెప్పబోతున్నారు. మధ్యలో దాసుగారందుకుని, "చిత్తం చిత్తం! మీకు సంగీతంలో యింత సరదా వున్నందుకు, నేనే ఆడదాన్నయితే, నా కాలిగోటికి మిమ్మల్ని కట్టి గిర్రున త్రిప్పుతూ మీ సింహాసనం మీద నేనే కూర్చుని వుందును." అన్నారు సగర్వంగా!

దాసుగారిపైన విసరిన బాణం తన హృదయానికే గుచ్చుకోగా కనబడని గాయంతో జమీందారు నిర్విణ్ణుడైపోయాడు! ★

★ దగాపడిన తమ్ముడు ★

(43-వ పేజీ తరువాయి)

గవర్నమెంటోడు కావాల. ఆడే మనకి తల్లీ తండ్రీ! ఆడే మనలాంటిబీదోళ్ళకి గొప్పోలు సూసినట్లు సెయ్యకపోతే మనం నీతిగా యెలాగ బతుకుతాం అన్నా?"

"మన గవుర్మెంటుని అనక ఆడు సిన్నోడు. అంతా యెంతకని సూసాడు."

"నివ్వు యింకా పట్నంసంగతి తెలుసుకోలేదన్నా. మన సిన్నతనాన మన అయ్యలకి అన్నం బట్టావుంటేసరి! ఇప్పుడో కోర్లు గీర్లు వచ్చినాయా! ప్రతివోడికి ఆశకి అంతు లేకుండాపోతోంది. కడుపునిండితే సాలదు కోరు కావాల-కోరికలు యెక్కువౌతున్న కొద్దీ మనిషిలో మంచి సచ్చిపోతాది. అలాంటి వున్నోడు, లేనోడుమీద సెలాయిస్తాడు! ఆడికి కోరు-యీడికి ఆకలి."

"ఈడికీ కోరు కావాలంటావా?"

"నివ్వు నాతల్లీ తండ్రివి-ఆడికి కోరుండనీ-యీడికి ఆకలి లేకుండా సెయ్యి. ఈడు ఆశ తక్కువోడు. యీడిలోనే మంచెక్కువుంటాది. ఈడే దేనికయినా నడుం కట్టుకోని నిలబడ్తాడు. అలా నిలబడినోలున్న లోకమే లోకం."

"అయితే గవుర్నమెంటోడు యెందుకు సెయ్యడూ అని..."

"అదేనన్నా! ఆడు గుడ్డోడు అయితేనే మనలాంటోలకి బాధ! ఆనాడు రాములవారు యేం సేసినారు? మారాజు సాకలోడి మాటంటే ఏమిటి? ఆడి దగ్గరకూడా జడిసి మాతల్లి సీతమ్మని అడివికి పంపించినాడే— అన్నా అలాంటి రాజరికం వస్తే యీ గంజి నీరు తాగినా మనలాంటోలికి అమృతం తాగినట్టుంటాది!"

"నిజమేనన్నా—అలాంటి మారాజు మరి పుట్టాడా?"

"ఆ తండ్రి లంకనుంచి వచ్చి యేం చేసినాడు? ఇప్పటిలాగే ఎందరో బాగా డబ్బు సేసుకుంటే ఆ మారాజు కోటసేరు తిట్టనేదు. ఆంజనేయులవారిని పెట్టి గుమ్మడిపండంత డబ్బంటూ గాదెడు డబ్బు తీసుకుని లేనిజవాన్ని సుఖపెట్టాడు. అలాగే గవుర్నమెంటోడు బ్లాకులో దొంగ లెక్కలతో కోట్లు గడించిన యీలందరికీ సేస్తే మనలాంటోలకి పనిదొరకదా?"

"మావూర్లో యేమైనాది? గరిశెలు పండించిన రాజిగాడికి పాక్యూరిమెంట్ తక్కువ. వాడు యెక్కువ! పైనున్నోడు మంచోడే నన్నా-మధ్యనున్నోలే అంతా సేసన్నారు-యీలలో నాయం వుంటే మనకీగతి యెలా వస్తాది?"

పుల్లయ్య చెప్పిన మాటలకు ఆ అన్న కాదనలేక పోయాడు.

"అన్నా లోకం యిలాగున్నాది. మనం లోకానికి తగి నడుసుకుంటేగానీ బతకలేం-మళ్ళీ పెజల్లో మనిసిననే పౌరుషం తెప్పించి నాయం గుప్పించిన మారాజు పుట్టాల—ఆ నాటిదాక బతెక్క సచ్చిపోతామా? నా మాట యిను. ఆకలితో నివ్వూ పిల్లాజెల్లా సచ్చిపోకండి—రాత్రుళ్ళు వచ్చావంటే"

"దేనికి?" — పుల్లయ్య సంశయంగా మూసాడు. నీతిని నూటికి నూరుపాళ్లూ గౌరవిస్తున్న పుల్లయ్యవేపు చూసి ఆ అన్న నవ్వి 'దొంగతనానికి కాదు నే—రాత్రుళ్ళు రేవులోన గోధుమ ఓడలు దించాల-ఇప్పుడా మీ వూరు వెళ్లలేవు-గడించుకో-తిను బతుకు-డబ్బు సేసుకోని మళ్లా వూరు వెళిపో!"

పుల్లయ్య ఆశ్చర్యంగా "అంతడబ్బు దొరుకుతాదా?" అన్నాడు.

"ఆ మీదున్న కష్టాను కనికరించాడంటే వందలే దొరుకుతాయి! నశీబుబాగుంటే, వేలే వసాయి. రేపు రాత్రికి యీ వేళకి యిక్కడే వుంటాను. వస్తావుకదూ - ఒక్కడివే రావాల!"

"ఈడు వనల్లు!"

"బతకాలంటే ఒదిలించుకోవాల—"

పుల్లయ్య శెలవుతీసుకొని సంతోషంగా వెళ్ళిపోయాడు. పెళ్లంతో "ఈనాటికి మన కష్టాలు తీరిపోయినాయి," అన్నాడు, "రేపురాత్రినుంచీ ఓడపని-మనం తినగా ఒకరికి పెట్టగా యింకా మిగిలించావంటే మళ్లా మనవూరు వెళ్ళిపోమా?" అని ఆనందంతో యెగురుతుంటే నీలి "గాలిలో మేడలు కట్టుకు-గడించుకున్న దాంతో కడుపునిండితే సాలదా?" అంది.

పుల్లయ్యకు తొలిసారి యీవూరువచ్చాక హాయిగా నిద్దరపట్టింది. ★

—ఇంకావుంది.]

★ పాపం! పంతులు! ★

(23-వ పేజీ తరువాయి)

వాళ్లేనెందుకు అనుకోవటం?...వాళ్లు లోకువనా?" అన్నాడు లావుపాటి ఆయన.

"లోకువేముంది? ఉన్నమాటేఅన్నాను" అన్నాడు బట్టతల వ్యక్తి.

"ఉన్నమాట కాదు...నువ్వు అనుకున్న మాట! అంతకంటె ఇంకేమీ లేదు ... మీకు పిల్లలున్నారా—బళ్ళో చదువుకుంటున్న వాళ్ళు?..." అని లావుపాటి ఆయన అడిగాడు...

"ఏం? ఉన్నారు!..." అన్నాడు బట్టతల వ్యక్తి తడబడుతూ.

"బళ్ళోవేసిన తర్వాత మీ అబ్బాయి సరిగ్గా బడికివెడుతున్నాడో, లేదో; చదువుతున్నాడో, లేదో ఏనాడైనా కనుక్కున్నారా?..."

"అబ్బే! లేదు! అయినా మేష్టరున్నారుగా! ఇంకా మనమేం కనుక్కుంటాం?"

"అదుగో! అందులోనే ఉంది!... వాళ్ళు ఎన్నని చూస్తారు?... ఇదివరకు తల్లి దండ్రులు ఇలాగే ఉండేవారా?..."

★ పాపం! పంతులు! ★

అని సూటిగా అడిగాడు లావుబాటి ఆయన.

ఇదంతా వింటున్న రఘుపతికి ఒళ్ళు మండిపోతోంది. పాపం! ఆ లావుబాటి ఆయన ఉన్నాడు గనక సరిపోయింది! శాస్త్ర మంచీ చెడూ ఆలోచించి మరీ మాట్లాడుతున్నాడు. లేకపోతే ఈ బట్టతలాయన మరీ పేట్రేగిపోను! అయినా, ఈయనగారికి అవసరం, అనవసరం అంటూ అసలు ఉండవు కాబోలు! తనకితోచినదల్లా అనేస్తుంటాడు. అయినా, బొత్తిగా రోజులిలా తయారయి పోయాయి. పొట్టపోసే అక్షరంముక్క రాకపోయినాగాని, ప్రతీ వ్యక్తికి విద్యావిధానంమీద ఉపాధ్యాయుల మీద తను ఇషంవచ్చినట్టు మాట్లాడే అవకాశం ఏర్పడిపోయింది! అసలు నిజం చెప్పాలంటే, విద్యావిధానం గురించి ఏ మాత్రమూ తెలియనివాళ్ళంతా దాన్ని గురించి ఉపన్యాసాలివ్వటం మొదలుపెట్టాకే అది ఇలాగ పాడయిపోయింది — అనుకున్నాడు రఘుపతి.

అయితే, ఈమాటలు పైకి అనేందుకు ధైర్యం చాల్లేదు. మొదట అయితే అనేసునేమోగాని, లావుబాటి ఆయన మాట్లాడిన తర్వాత తను మాట్లాడటం చాలా అనవసరంగా కనిపించింది! అంతేకాదు! చాలా మంచిదయింది కూడా!...ఆ మాటలన్నీ ఆ లావుబాటి ఆయన అన్నాడు గనుక బట్టతల వ్యక్తి తుక్కినపేనలే పడిఉన్నాడు గాని, అదే తనయినట్లయితే ఒంటికాలిమీద లేచేవాడు. అంతకంటె అదృష్టం తను ఉపాధ్యాయవృత్తిలో ఉన్న విషయం ఆ బట్టతలాయనకి తెలియకపోవటం!......అదే గనుక తెలిసిఉన్నట్టయితే ఇంతవరకూ పరోక్షంగా ఉపాధ్యాయులమీద సాగిస్తున్న యుద్ధం ప్రత్యక్షంగా తనమీదనే సాగించేవాడు ఇప్పుడు......అని మనస్సుకి నచ్చజెప్పుకున్నాడు రఘుపతి.

తను 'ఫలానా' ఉద్యోగం చేస్తున్నట్టు చెప్పుకోటానికి సిగ్గుపడవలసి వచ్చినందుకు ఎంతో బాధపడ్డాడు రఘుపతి.

అందుకే మొదటినుంచీ ఈ ఉద్యోగమంటే విముఖంగానే ఉండిపోయాడు రఘుపతి. ఇందులో ఉండే సాధకబాధకాలు, కష్టసుఖాలు అన్నీ మొదటే గ్రహించాడు. అందుకనే చదువు పూర్తికాగానే పదిమందీ మేష్టరుగా జేరమంటే జేరనని మొరాయించుకుని కూచున్నాడు. ఇది చాలా పవిత్రమైన వృత్తి అనీ, విద్యాదానంకంటె ఘనమైన దానం మరొకటి లేదనీ అందరూ నచ్చజెప్పబోయినా తను లొంగలేదు...కాని, చిట్టచివరకు పరిస్థితుల ప్రోద్బలంవల్ల ఈ వృత్తిలో ప్రవేశించక తప్పలేదు. ప్రవేశించిన తర్వాత ఇదివరకు తనకున్న అభిప్రాయాలు దృఢతరమయాయే గాని, మారలేదు.

పెట్టెలో వాళ్ళంతా ఒక్కసారి విరగబడి నవ్వటంతో రఘుపతి ఆలోచనలు వదలి ప్రపంచంలో పడ్డాడు. అయితే వాళ్ళెందుకు నవ్వారో అంతుచిక్కలేదు. ఎవరినేనా అడుగుదామంటే దానివల్ల ఎటువంటి ప్రమాదాలు రానైయున్నాయోనని భయపడ్డాడు.

"ఏది? ఇంకొక్కసారి చెప్పండి! ఇందాకా సరిగ్గా వినలేదు!..."అని అడిగాడొక ప్రయాణీకుడు బట్టతలవ్యక్తిని—నాటకంలో 'వన్సుమోర్'లాగ...

"ఆఁ! ఏముందండీ! మేష్టరికి తీరుబడి ఎక్కువ గనుక పిల్లలు ఎక్కువగా పుడతారు. మీకు ఈ విషయంలో ఏమైనా అనుమానాలుంటే చెప్పండి! నిదర్శనాలు లక్ష

...కి ఎత్తులు చూపిస్తాను..." అన్నాడు బట్టతలాయన.

అంతా గొల్లుమని నవ్వారు. రఘుపతికి గుండె గతుక్కుమంది.

"రైలెక్కినప్పటినుంచి మీరు చెప్పిన మాటలలోకెల్లా ఇది ఒక్కటే నిజం!..." అన్నాడు లావుపాటి ఆయన.

"అవునవును! క్వైట్ రైట్!..." అని ఆ అభిప్రాయాన్ని బలపరిచాడు మరో ప్రయాణీకుడు.

అంతా ఏకాభిప్రాయానికి వొచ్చినట్టుగా ఉంది.

"నేను అబద్ధం ఎందుకు చెప్తానండీ?..." అన్నాడు ధైర్యం పెరిగిన బట్టతల వ్యక్తి.

హారి! వీడి తస్సాదియ్యా! వీడు చాలా అసాధ్యుడిలాగున్నాడే?... మేష్టర్లనిగురించి సిద్ధాంతీకరించేస్తున్నాడు. ఇంకొక్క క్షణం ఆగితే తన విషయం యావత్తూ కూపీ లాగేసి తననే ఆ సిద్ధాంతానికి బలం చేకూర్చేందుకు కావలసిన నిదర్శనంలాగ వాడుకుని తీరుతాడు... తను రైలెక్కిన తర్వాత ఇప్పటివరకూ అనవసరంగా మాట్లాడకుండా ఉన్నందుకు, తానెవరో ఆ బటతల వ్యక్తికి తెలియపర్చకుండా ఉన్నందుకు తనని తనే అభినందించుకున్నాడు రఘుపతి.

అసలే ఇష్టంలేక చేస్తున్న ఉద్యోగం! అందులోనూ అందరూ నీరసభావంతో చూసేది!... అందువల్లనే రఘుపతి ఎవరేనా తనని "పంతులుగారూ!" అని పిలిస్తే చాలా బాధపడతాడు. అసలు ఆ పిలుపు వినగానే ఉలిక్కిపడతాడుకూడా!. అందుచేత ఈ బట్టతల వాడి బారిని పడకుండే తను రైలు దిగిపోతే బాగుండుననుకున్నాడు. అనుకుని అప్పుడే దాటిన స్టేషనేమిటో కనుక్కోగా, తరువాతిదే తాను దిగవలసిన స్టేషనని తేలింది. దాంతో కాస్త మనస్సు కుదుటపడింది రఘుపతికి.

కాని ఆ బట్టతలవాడు రఘుపతిని వదలదల్చుకోలేదు. "ఏం? పంతులుగారు! ఇందరూ ఇన్ని మాట్లాడుతున్నాగాని, మీరు పలక్కుండానే కూచునిపోయారు! మీ అభిప్రాయం ఏమిటి?..." అని అడిగాడు.

రఘుపతి అనుకున్నంతా అయింది. కాని నిభాయించుకుని, "ఆఁ!... దేన్ని గురించి?..." అన్నాడు ఏమీ ఎరగనట్టు!..."

"అదేనండి! మేష్టర్లకి పిల్లలు ఎక్కువ పుడతారన్నానే! దాన్ని గురించి..." అని వివరించాడు బట్టతల వ్యక్తి- జవాబుకోసం రఘుపతి ముఖంలోకి పరీక్షగా చూస్తూ.

"నా అభిప్రాయం ఏముంది?- మీరు చెప్పారుగా! ఇంక నేనేం చెప్తాను?..."



సినీతార జమున
—[ట్రిక్ ఫోటో : గిరిధర్]

అంటూ నీళ్ళు నమిలాడు రఘుపతి.

"పంతులుగారు నాన్చుస్తున్నారు.. కొంప దీసి స్వానుభవం కాదుగదా?..." అన్నాడు వికటంగా నవ్వుతూ బట్టతలాయన.

"హారి! పిడుగా! ఆ నేకావూ- ఆ కాస్త మాటా? సరేలే!..." అని లోపలే అనుకున్నాడు- తనకి ఇప్పటికే పదిమంది పిల్లలనీ వీడికి ఎలాగ తెలిసిందా?-అని ఆలోచిస్తూ.

ఇహనైనా తను దిగవలసిన స్టేషనువెంటనే వచ్చేలాగు చెయ్యమని వెయ్యిదేవుళ్ళకి మొక్కాడు- మనస్సులోనే...

భగవత్కృపవల్ల ఆ స్టేషను రానేవచ్చింది.. వెంటనే లేచిగొడుగు చంకన పెట్టుకుని, సంచీ చేత్తో పట్టుకుని వడిగాదిగపోయాడు రఘుపతి.

ఇంతలోకీ, ఆ పెట్టెలోకే ఎక్కబోతున్న విద్యార్థి ఒకడు "మేష్టారూ! నమస్కారమండీ!..." అన్నాడు రఘుపతి నుద్దేశించి..

రఘుపతి ప్రతినమస్కారంచేసి బటతలాయనకేసి ఖంగారుగా చూశాడు.

ఆయన ఈ సంభాషణ విన్నట్టున్నాడు. నవ్వుతున్నాడు. శిష్యుడు నమస్కరించినందుకు సంతోషించినా, అటువంటప్పుడుతటస్థపడ్డందుకు విసుక్కున్నాడు-లోపలే!...

"ఏం పంతులుగారూ?... దిగిపోతున్నారా?..." అన్నాడు బట్టతల వ్యక్తి వెనకనించి.

"మరేనండీ!..." అని అస్పష్టంగా గొణిగి జనసమూహంలో కలిసిపోయాడు రఘుపతి. ★

మాచ్‌ఖండ్ చూసిరండి

[35 వ పేజి తరువాయి]

నీళ్ళు నిలవచేస్తారు.

రాత్రి బంగళాముందు కుర్చీలువేసుకు కూర్చున్నాం మేం. (గుడ్డివెన్నెల, మిణుకు మిణుకుమనే నక్షత్రాలు. ఆ నిశ్శబ్దంలో వ్యక్తీకరించలేనిభావాలు జనిస్తాయి. ముందు భాగంలో ఇంజనీరుగారి యిళ్ళు అవీ వున్నాయి. ఈ బంగళాలన్నీ కాంప్‌కి ఒక వైపు చిన్నఎత్తైన కొండమీద కటారు. కొండమీదనుంచిచూస్తే, లైట్లలో కేంప్ సుందరంగావుంటుంది. కాంప్ చుట్టూ కొండలు ఆ కొండలమధ్య మిలమిల మెరుస్తూన్నది. కొండలమధ్య వుదయించే చంద్రుడు ఎంతో మనోహరంగా వుంటుంది ఆదృశ్యం.

ఉదయాన్నే లేచి నేను కిటికీలోంచి రెండోవైపు చూసేదాన్ని, ఈ కొండకి ప్రక్కనే మరో రెండు కొండలున్నాయి. ఆ కొండలమధ్య లోయలో అరకు వాలీ కోయవాళ్లు భూమిదున్ని సాగుచేస్తున్నారు. ఎత్తుమీదనించి చూస్తే లిల్లీపుట్ మనుష్లూ, కొన్ని బొమ్మలు పని చేస్తున్నట్టు కనిపించేది. ఎంతసేపు చూసినా ఆ కిటికీ దగ్గర నుంచి కదల బుద్ధి వేసేది కాదు.

సాయంత్రం కొండదిగి మనం నది వద్దకు పోవచ్చు. మాచ్‌ఖండ్ ఏవో మధుర స్మృతులని కలిగిస్తుంది. ★



సినిమా

ఇటు డబ్బూ, అటు ఎన్నతగ్గ కళాప్రమాణాలూ కూడా అందుకునే చిత్రాలు అరుదంటారు కొందరు.

అసలవి ఎండమావులూ, కుంకేటి కొమ్ములూ, సినిమాపాటలలో భావాలూ. బాక్సాఫీస్ నటుల తీరుబాటూ, వణిజుడి తృప్తీ, ప్రబంధకన్యలనడుమూ వగైరాలవతుగా ఉండీ లేనట్టూ, లేక ఉన్నట్టూ భ్రమకలిగిస్తాయిగాని, అందుకోబోతే లేవనే తేలుతుంది అంటారు కొందరు. అలాటివి అప్పుడప్పుడు రాకపోలేకపోలేదని వాదించే వారుమటుకు కొన్ని చిత్రాలను ఉదాహరణలుగా చూపిస్తారు. డబ్బు బాగా వచ్చిందా అన్న విషయమై, అభిప్రాయభేదాలకు అవకాశం ఎలాగా ఉండదు. ఎటొచ్చి, ఆ చిత్రంబాగుందా అన్నదానిమీద కొందరు అటూ ఇటూ కావచ్చు. అలాఅయినా కొన్ని చిత్రాలు

వన్స్‌మోర్ చిత్రాలు

ఈ ఉభయతారక మంత్రాలకు ఉదాహరణలుగా నిలుస్తూనే ఉంటాయి. అందరూ తేలిగ్గా హేళనచేసి కొట్టివేసే హాలీవుడ్‌లో కూడా చాలా ఉత్తమచిత్రాలు పుట్టాయి. ఇటీవలి వాటిలో హైనూన్, షేన్, మార్టీ, ఫ్రెండ్లీ పెర్సువేషన్, ట్వెల్వ్ యాంగ్రీమెన్ చిత్రాలను చెప్పుకోవచ్చు. వీటిలో ఒకటి రెండు ఈ దేశంలో ఆర్థికవిజయం సాధించకపోయినా, స్వదేశంలో పుష్కలంగా డబ్బు గడించాయి.


ఇంతవరకూ బాగానే ఉంది. తక్షణమే హాలీవుడ్ నిర్మాతలు ఎగిరి గంతువేసి 'ఇదిగో కీలకం. ఇంకో మార్టీ, ఇంకో హైనూన్ రాయుమని రచయితలను పురికొల్పారు. లేదా వాళ్ళే అల్లేశారు. 'హైనూన్' తరవాత దాదాపు అదే ఫక్కీలో 'హాండో' అనే చిత్రం వచ్చింది. అందులో 'సిద్ధహస్తుడు' రాండాల్ఫ్ స్కాట్, తొలిసారిగా 25 ఏళ్ల టెక్నిక్ మార్చేసి, తుపాకి తియ్యడానికి జంకేవాడుగా, ప్రాణానికి భయపడే

ప్రభా ప్రొడక్షన్స్‌వారి "ఆడపెత్తనం"లో కె. యస్. రెడ్డి, క్రొత్తనటి శశి



వాడుగా, అనగా దాదాపు మనిషిగా నటించాడు. గారీకూపర్ లాగే నడిచాడు, నవ్వాడు భయపడ్డాడు. అయినా ఆ చిత్రం మాట దక్కించలేదు. అలాగే ఇటీవల 'టిన్‌స్టార్' అనే చిత్రం వచ్చింది. 'హైనూన్' 'షేన్'ల ఫక్కీలో తీసినది అని పోస్టర్లు గావుకేకలు పెట్టాయి. 'టిన్‌స్టార్' బంగారు నక్షత్రంలా ప్రకాశించిందని సిసిల్ డిమిల్ మెచ్చుకున్నాడు. ఆయన అబద్ధాలు చెబుతాడనికాదు. ఈ చిత్రాన్ని తొలిసారి చూసే బాగానే ఉంటుంది. కాని దీని తండ్రి తాతలైన 'హైనూన్' 'షేన్'లు చూస్తే, పేరూ స్టారూ మార్చి మళ్ళీ వాటినే తీశారని తెలుస్తుంది. దాదాపు అదే కథ. మొదటినుండి చివరదాకా, అలాంటి షాట్‌లే ఇందులోను పొందుపరచారు. ఇందులో హీరో హెన్రీ ఫాండా, తరువాతివాడు టోనీ పెర్కిన్స్, మామూలు సినీ హీరోలలా కాకుండా, ప్రాణాలకు భయపడే వాళ్ళుగా కనబడతారు. వాళ్ళిద్దరు అద్భుతంగా నటించారన్నదీ, సంభాషణలూ సంగీతం అనవసరం అనిపించేటంత శక్తివంతంగా ఫోటోగ్రఫీ కథను చెప్పిందన్నది వేరే సంగతి. అది ఏమి చెప్పిందీ అంటే, పాతకథ అనే అనాలి. ఇందులో అదనంగా ఉన్నవి 'టిన్‌స్టారు' ధారిఅయిన వరీఫ్‌ది పవిత్రమైన బాధ్యత అనీ, ప్రాణాలకు జంకకుండా, అతడు దానిని ధరించవలెను అనీ చివర నీతిపాఠాలు వల్లించడం.

మొత్తంమీద, ప్రేక్షకులను మోసగించడం. వాళ్ళ ఊహ మంచిదే కావచ్చు. ఫలితం చిరాకేసేదిగా ఉంది...మానవ



దక్షిణభారత స్టుడియో యజమానులసంఘంవారు, రక్షణమంత్రి శ్రీ కృష్ణమీనన్ గౌరవార్థం ఇటీవల విజయాగార్డెన్స్‌లో విందుచేశారు. ఆ సంఘం అధ్యక్షుడు, విజయాధిపతి శ్రీ నాగిరెడ్డి, మంత్రి శ్రీ కృష్ణమీనన్

హృదయ దర్పణాలుగా భాసించిన చిత్రాలనూ వాటితోపాటు వ్యక్తి గౌరవాన్నీ కూడా ఇది బజార్లో పెట్టి, అతిక్రూరంగా పావలా అర్ధణాకి అమ్మడానికి ఒడికడుతున్నదన్న సత్యం కొరడా దెబ్బలా ఛెళ్ళుమంటూంది. డబ్బు గడించడం మహాపాపం అనటం లేదు. ఒక మనిషి హృదయ గత క్షోభను చెప్పి, లక్షలాది ప్రజల మనసులు కరిగించి కరుణరసాన్ని చిప్పిలచేసిన తొలి కళాకారుడిలో ఏ పవిత్రభావం, మానవుడి పట్ల గౌరవం ఉంటాయని మనం అనుకుంటామో, ఆ భావాలను నిర్దాక్షిణ్యంగా వీరు బజారున పెట్టి బజారుమాపు చూసి అవమానిస్తున్నారని అనిపిస్తుంది. ఇంతటి హేయ కార్యం ఇదే.

హాలీవుడ్‌లో భారీఎత్తున జరిగే ఈ మూసపోత వ్యాపారం మనదేశంలోనూ పెద్దఎత్తునే జరుగుతోంది. ఎటొచ్చి హాలీవుడ్‌కి పెద్ద మార్కెట్ ఉండబట్టి, వాళ్ళకి కొంతలో కొంత చెల్లుతోంది. మన నిర్మాతలు తీసిన కథనే మళ్ళీతియ్యడం, చూపిన డాన్సునే మళ్ళీచూపడం, వినిపించిన పాటనేమళ్ళీ వినిపించడం ఎక్కువ అయిపోతోంది. ఇది ప్రేక్షకులకు ఎంత విసుగనిపిస్తుందో ఎప్పటికప్పుడు బాక్సాఫీసు ఫలితాలు చెబుతూనే ఉన్నా, అలవాటు అలాగేఉంది.

ఏ చిత్రంలోనైనా ఒకరకం పాటో, డాన్సో బాగుందనిపించుకోవడం భయం. అదేవరసతో, అదేలయతో అనేకం వచ్చేస్తున్నాయి. కాని అన్నీ హాస్యాస్పదం అవుతున్నాయి.

మాజిక్‌లోలాగే, ఈ సినిమాలోనూ 'ట్రిక్కు' ఒకసారే చెల్లుతుంది. మళ్ళీ చేస్తే బయటపడిపోతుంది. ★

'తుంసా నహీ దేఖా'లో షమ్మీకపూర్.



రాజధానిలో చిత్రనిర్మాణ కేంద్రం

రాజధానీనగరం హైదరాబాద్ లో నెలకొన్న తొలి చిత్రనిర్మాణ కేంద్రం శ్రీ సారథీ స్టూడియోస్, జూన్ 6 ఉదయం నవశక్తి ఫిలింస్ వారి తొలికానుక నిర్మాణానికి ప్రారంభోత్సవంతో పని ఆరంభించింది.

ఆర్థికమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ఈ చిత్రానికి ప్రారంభోత్సవం జరుపుతూ ఇది ఆరంభంగా ఆంధ్రరాజధానిలో చలనచిత్ర పరిశ్రమ వృద్ధికి రావాలనీ, దేశంలోని చలనచిత్ర కేంద్రాలలో ప్రముఖస్థానానికి రావాలనీ ఆకాంక్షిస్తూ ఇందుకు రాష్ట్రప్రభుత్వం తోడ్పడి ప్రోత్సహించగలదని చెప్పారు. చిత్ర నిర్మాతలకు, స్టుడియో అధిపతికి శుభాకాంక్షలు తెలిపి, వారిని అభినందించారు.

ఉత్సవానికి మధ్యప్రదేశ్ మాజీ గవర్నరు శ్రీ భోగరాజు పట్టాభి సీతారామయ్య, ఆంధ్ర శాసనసభ సభాపతి శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు, పలువురు అధికార అనధికార ప్రముఖులూ వచ్చారు. సారథీ అధిపతి శ్రీ రామకృష్ణ ప్రసాద్, నవశక్తి ఫిలింస్ నిర్మాత శ్రీ గంగాధరరావు, దర్శకుడు శ్రీ జి. రామినీడు, ఛాయాగ్రహణ దర్శకుడు శ్రీ ఎం. కె. రాజు అతిథులకు స్వాగతం చెప్పారు.

మంత్రి బ్రహ్మానంద రెడ్డిగారు కెమెరా స్విచ్ ఆన్ చేశారు. తొలి సన్నివేశంలో, ఈ చిత్రం నాయిక జమున నటించింది.

చిత్రం ప్రారంభోత్సవానికి ముందు, రామకృష్ణ ప్రసాద్ గారు, స్టుడియోలో నిర్మాణ కార్యక్రమారంభాన్ని పూజాదికాలతో శాస్త్రోక్తంగా జరిపించారు. 8-45 గంటలకు ప్రార్థన శ్లోకాన్ని స్టుడియోలో రికార్డు చేశారు. సంగీత దర్శకుడు వేణు. పూజతరువాత అతిథులకు స్టుడియోను చూపించారు. సారథిస్టుడియో, హైదరాబాద్ నగరం శివారున ఉన్న అమీర్ పేటలో నెలకొంది. ప్రస్తుతం రెండు షూటింగ్ ఫ్లోర్లు, రికార్డింగ్ ప్రొజెక్షన్ థియేటర్లు, ఎడిటింగ్, లెబొరటరీ, మేకప్ శాఖల భవనాలు నిర్మించారు.



హాస్యనటశేఖరుడు

రేలంగి

* * *

నవశక్తివారి తొలిచిత్రానికి ఇంకా నామకరణం జరగలేదు. ఇది టెక్నీషియన్లూ, కళాకారులూ కలిసి నిర్మిస్తున్న చిత్రం. దీనికి కథ కె. ప్రత్యగాత్మ వ్రాశారు. సంభాషలు తాపీ ధర్మారావు, ప్రత్యగాత్మ వ్రాస్తున్నారు. సంగీత దర్శకుడు అశ్వత్థామ కళాదర్శకుడు వి. సూరన్న. నృత్యాలు, వేణుగోపాలస్వామి. నటవర్గం : గుమ్మడి వెంకటేశ్వరరావు, జమున, సూర్యకళ, రమణారెడ్డి, పెరుమాళ్లు, కుటుంబరావు, శంకర. కొత్తనటులు హరనాథ్, కృష్ణారావులను ఇందులో పరిచయం చేస్తున్నారు. ★



ప్రతిభావారి 'దొంగలున్నారు జాగ్రత్త'లో రాజనాల



శత 'చిత్ర' సుందరి

అంజలీదేవి

విద్యా సంస్థలకు విరాళాలు

శత చిత్ర సుందరి శ్రీమతి అంజలీదేవి, హాస్యనట చక్రవర్తి శ్రీ రేలంగి వెంకటరామయ్య, తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయానికి ఇరవై అయిదేసి వేల రూపాయలు విరాళంగా ఇస్తున్నారు.

రేలంగి ఈ సంకల్పాన్ని విశ్వ విద్యాలయ పాలకవర్గానికి తెలిపే నిమిత్తం జూన్ 6 న తిరుపతివెళ్ళి వచ్చారు. పాలకవర్గం ఈ విరాళాలను స్వీకరించడానికి అంగీకరిస్తూ తీర్మానించినట్లు తెలియవచ్చింది.

నూరవచిత్రం పూరికాగానే, ఏదైనా ఒక విద్యాపీఠానికి విరాళం ఇవ్వదలచుకున్నట్లు ఈ కళాకారులిద్దరూ ఇదివరలో ప్రకటించడం విదితమే.

త్వరలోనే ఈ విరాళాలను సముచిత రీతిన వీరు ఈ విద్యాపీఠానికి సమర్పించబోతున్నారు.

* * *

విద్యాభివృద్ధిపట్ల చలనచిత్రకళాకారులు ఈనాడు ఎంతో శ్రద్ధ, అభిమానం చూపుతూవుండడం ముదావహం. నాగేశ్వరరావు షష్ట్యబ్దోత్సవంలో, ఒక ప్రముఖవక్త చెప్పినట్లు విద్యాసంస్థలూ, లలితకళలూ సన్నిహితం కావడానికి ఇది ఎంతో దోహదంచేస్తుంది. శ్రీ నాగేశ్వరరావు దరిమిలా, గుడివాడ కళాశాలకు మరి పాతిక వేలు విరాళం ఇవ్వనిశ్చయించడం విదితమే. ఇటీవల విజయాధిపతి శ్రీ నాగిరెడ్డిగారు మద్రాసులో కేసరీ పాఠశాలకు పాతిక వేలు ఇచ్చారు. శ్రీమతి భాష్యమతీ రామకృష్ణ ఒంగోల్లు కళాశాలకు పదివేలు విరాళం ఇచ్చింది. ఇంతకుముందు

"మహాదేవి"

ప్రకంపంలో ఆరంభించి, అక్కడ్నించి క్లయిమాక్సుకి కథ కట్టుకుపోవాలనే వాడు ఒక హాలీవుడ్ చిత్రనిర్మాత. బాక్సాఫీస్ హృదయం తెలిసిన దర్శకుడు సుందర్ రావ్ నాద్‌కర్ణి గారు, శత శతఘ్నుల ఘోషతో, రథ తురగ పదాతి బలాల ఆర్భాటంతో, (అక్కడక్కడ లైబ్రరీ షాట్లతో) చిన్న సైజు ప్రళయంలాంటి యుద్ధం చూపించి, కథ ఆరంభించారు 'మహాదేవి' చిత్రంలో. అక్కడనించి పతాక సన్నివేశానికి వెళ్ళేసరికి కేవలం అలాటి ఆర్భాటాలే ఉంటే ఈ చిత్రంగురించి అట్టే చెప్పుకోవలసింది ఉండదు. అక్కడ ఉద్వేగ భరితమైన సన్నివేశాలు ఉన్నాయి. అసలు చంద్రబాబు చేష్టలు చూపే భాగాలు మరిచిపోతే (అవి ఎలాగా గుర్తుండవు) ఈ చిత్రం అంతా ఒక సుదీర్ఘమైన పతాక సన్నివేశం లాంటి దనవచ్చు. లోపాలపాలు పోలెడున్నా కథ చిత్రణ రక్తి కట్టేదిగా సాగింది. సావిత్రి నటన ఇందుకు చాలా దోహదం చేసింది.

సావిత్రిపేరు ఇందులో మహాదేవి. మేకప్ కోటామీద చెంపల పై కెంపు ఛాయకోసం 'రూజ్' పూసినట్టు, మిగతా వాళ్ళ పేర్లకికూడా. చోళ చాళుక్య ముకుటాలు పెట్టి చరిత్ర రంగు వేశారు.

మహాదేవి చోళరాజ కుమార్తె. మొదట చెప్పిన ప్రళయ సన్నివేశంలో ఎం. జి. రామచంద్రన్, వీరప్ప వీళ్ళకోటమీదకి దండెత్తివచ్చి, రాజుని, కూతుర్నీ బందీలుగా పట్టుకుంటారు. మహాదేవిని మొదట దళపతి వీరప్పచూసి, విలన్‌లా నవ్వుతాడు. విలన్ కాబట్టి, అతడామెను బహుశా ప్రేమించక, కామించి ఉంటాడు. అందుకని మహాదేవి అతన్ని తిరస్కరిస్తుంది. చాళుక్యరాజసభలో మహాదేవినీ చోళరాజును బందీలుగా నిలుపుతారు దళపతులు. అక్కడ మహాదేవి ప్రదర్శించిన ధైర్య సాహసాలకు, ఆమె చాలాగట్టిగా చెప్పిన డైలాగులకూ మెచ్చి చాళుక్యరాజు, తండ్రీ కూతుళ్ళను చెర విడిపించి పాటివాళ్ళుగా గౌరవిస్తాడు. అయితే, వాళ్ళ రాజ్యంమటుకు వాళ్ళకి ఇవ్వడు. "ఇక్కడే మాయింట్లోనే ఉండిపోండి" అంటాడు. అందువల్ల విలన్ వీరప్ప మహాదేవిని పెళ్ళాడడానికి గట్టిగా ప్రయత్నిస్తాడు. కాని, ఆమె తిరస్కరిస్తుంది. చివరికి చూడతగ్గ కత్తియుద్ధం పోటీలో దళపతి 'ఎం. జి. ఆర్.' వీరప్పని ఓడించి మహాదేవిని పెళ్ళిచేసుకొంటాడు. వీరప్పకి కూడా ఒక చక్కని చిన్నదాన్ని, చాలా మంచిదాన్ని యిచ్చి పెళ్ళిచేస్తారు. అయినా అతడు మహాదేవికోసం ప్రయత్నాలు మానడు. రాజు కాశీయాత్రకి వెళ్ళగా చూసి,కుట్ర కొనసాగిస్తాడు. పెన్నాగాన్ని ప్రయోగించి, రాజద్రోహం ఆరోపించబోయిన వీరప్పపన్నాగాన్ని,హీరో పున్నాగవరాళి (నాగిన్‌మార్కు)తో పరిష్కరించి పారేస్తాడు. అయినా వీరప్ప ఇంకా అనేక హింసలు పెడతాడు....

అతని పాపంపండి, దండనపొంది, మంచి వాళ్ళు సంతోషంగా నవ్వేలోగా, సుందరరావు నాదకర్ణి హృదయాలు కదలించే సన్నివేశాలను చిత్రించారు. సావిత్రి, ఎం. ఎన్. రాజం ప్రశంసనీయమైననటన ప్రదర్శించారు. రాళ్లనూ ప్రేక్షకు రాళ్లనూ కూడా కరగించేటంతజాలిగా సుశీల పాడింది.

ఈ సినిమాచూశాక ఇది డబ్బింగు అని గిట్టనివాళ్ళే అనాలి అని, చూసిన వాళ్ళంతా అన్నారు. ఈమాట "అక్షరాలా" నిజం. డబ్బింగ్ చిత్రాల శకం ఆరంభమైన కొత్తలో వినబడ్డ తెలుగుని, 'డబ్బింగీస్ భాష' అని అన్నవాళ్ళుకూడా ఈ చిత్రం డబ్బింగ్‌లో శ్రీశ్రీ చూపిన గొప్ప శిల్పాన్ని గమనించడంతోపాటు, సుకుమారంతో ఒప్పే 'సుభ్భరమైన' తెలుగు వింటూ 'అనితరసాధ్యమ్మార్గస్థాయి' అని అభినందించారు. ఈ చిత్రానికి విశ్వనాథం, రామమూర్తి మధురమైన సంగీతం సమకూర్చారు. సుశీల, వైదేహి, జిక్కి, రాజా మొదలగువారు ఆ యాపాటలు శ్రావ్యముగా పాడారు. ★



జెమినీవారి 'విజయకోట వీరుడు' చిత్రంలో పద్మిని

రామకృష్ణ దంపతులు కేసరీ పాఠశాలకు నాలుగువేలు ఇవ్వడం విదితమే.

విరాళాలు ఇలా ఉండగా, కొందరు నటీనటులూ, టెక్నీషియన్‌లూ గాయకులూ కలిసి తెనాలికళాశాలలో సంస్కృతి కార్యక్రమాలకు భవన నిర్మాణార్థం, అక్కడ 'మనోహర' నాటకం ప్రదర్శించి 50 వేలు సేకరించి ఇచ్చారు. వారు ఆ కళాశాలకు లక్ష రూపాయలు పూర్తిచేసి ఇవ్వాలన్న సత్సంకల్పంతో, గతవారం, తెనాలివెళ్ళి మరొకసారి ఆ నాటకాన్ని ప్రదర్శించారు. శ్రీయుతులు జగ్గయ్య, గుమ్మడి వెంకటేశ్వరరావు ఈ కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీయుతులు చక్రపాణి, కె. బి. తిలక్, ఘంటసాల కృష్ణమూర్తి మొదలగువారు ఇందులో విశేషంగా సహాయంచేశారు.

కూచిపూడి నాట్యం

ఢిల్లీ పరిషత్తు: కొన్ని విశేషాలు

ఇటీవల ఢిల్లీలో సంగీతనాటక అకాడమీ వారిచే జరుపబడిన డ్యాన్సు సెమినారుకు నేనుకూడ వెళ్ళియుంటిని. కూచిపూడి నాట్యమును గూర్చిన అంశములు తెలియపరుచుచున్నాను. శ్రీ విప్నా అప్పారావుగారు కూచిపూడి నాట్యమును గురించి గంభీరోపన్యాసము నిచ్చిరి. తిరువాత అహమ్మదాబాదులో కూచిపూడి నాట్యాచార్యులుగావున్న నాచేత కూచిపూడి నాట్యమును డిమాన్ స్ట్రేట్ చేయింతుమని అకాడమీ అనుమతిని అప్పారావుగారు కోరిరి. అంతట నేను కూచిపూడి నాట్యము ఎటుల నాట్యశాస్త్రముతో మిళితమై పారంపర్యముగా వ్యాప్తము నొందుచున్నదో చెప్పి, భరతుని నాట్యశాస్త్రము నందలి కరణములు దాదాపు నలుబది వరకు ప్రదర్శించితిని. నందికేశ్వర ప్రోక్తమగు భరతార్ణవమునందలి ముప్పదియేడు అసంయుత హస్తములు, నలుబదినాలుగు సంయుత హస్తములు ప్రదర్శించితిని. నాట్యశాస్త్రము నందలి మయూరీగతి, మానవీగతి హంసీగతి మొదలగు గతులు జతిరూపముగ పాదభేదము లను ఎట్లు ప్రదర్శించుచుండిరో తెలిపితిని. దశావతార నృత్య విధానము వివరించితిని. చారీ భేదములు అనగా కాళ్ళు, చేతుల కదలిక, "సమ్ప్రేంఖణచారి" మున్నగునవి శాస్త్రరీతిగ నెటుల కూచిపూడి నాట్యములో ప్రదర్శించుచున్నామో తెలియజేసి ప్రదర్శించితిని. నృత్యనాటకములలో ప్రసిద్ధమగు సిద్ధేంద్రునిచే రచింపబడిన భామకలాపమునందలి కొన్ని ఘట్టములు (ప్రతికా లేఖనము మున్నగునవి) ప్రదర్శించితిని. ఈ రీతిగ కూచిపూడి నాట్యము సశాస్త్రీయమైనదని ఋజువుచేసితిమి.

ఆరోజు సభకు శ్రీమతి రుక్మిణీదేవి ప్రెసిడెంటు. ఇంతవని కూచిపూడి నాట్యములోనున్నను దీనిని (Folk Art) జానపద నృత్యముగ నిర్ణయించుట చాలశోచనీయమని సభలోనే అకాడమికి మనవి చేసినాము. అంతట శ్రీమతి రుక్మిణీదేవి లేచి "నేను గాని, మరెవ్వరుగాని కూచిపూడి నాట్యమును Folk Art అని చెప్పలేదు. ఇది పరిపూర్ణమైన శాస్త్రీయనాట్యము" అని సభలోనే అంగీకరించి కూర్చుండెను.

తరువాత కుమారి కాంచనమాలచే కూచిపూడి జతిస్వరము "తారఝుం - తక - ణాంతరి" అనునృత్తము, ధీరసమీరే అను జయదేవ అష్టపది ప్రదర్శింపబడినది. కాగా

[సి. ఆర్. ఆచార్య]
అహమ్మదాబాదు

కూచిపూడి మృదంగశబ్దములు సంగీతములో ఇముడ్చబడుటలో గల విశిష్టతను తెలియచేయుచూ (అష్టపది) జయదేవరచన నృత్యనాటకము కూచిపూడి జతులు మిళితముచేసి సుమారు 15 అష్టపదులవరకు శ్రీమతి మృణాళిని సరభాయి (అహమ్మదాబాదు) వారి ట్రూపుచే తలకటోరా గార్డెన్సులో ఏప్రిల్ 5 వ తేదీన ప్రదర్శింపబడెనవి. శ్రీమతి రుక్మిణీదేవి, శ్రీమతి మృణాళిని సరభాయి మున్నగు ప్రముఖ నటీమణులచే కూచిపూడి నాట్యము శాస్త్రీకమని శిరసావహించబడినది. ఇదే నృత్యనాటకము పెద్దలను ఆహ్వానముచేసి వారిసమక్షమున అహమ్మదాబాదులో రేడియో ప్రత్యేక కార్యక్రమముగ ప్రదర్శించబడినది. తలకటోరాగార్డెన్సులో డ్యాన్సు సెమినారునకు సంబంధించిన కార్యక్రమములు, విజ్ఞానభవనములో జరిగిన ఉపన్యాసములు, డిమాన్ స్ట్రేషన్లు అన్నియు చూచి వుంటిని కాని ఏ సభలోను వారు కూచిపూడి నాట్యమును Folk Art అని చెప్పి వుండలేదు. పత్రికాముఖముగ నేకని జరిగినయెడల ఆంధ్ర నాట్యకళోద్యమమును, అందలి విశిష్టతను ప్రభుత్వము వారికి నివేదించి, ఆంధ్ర నాట్యము, తంజావూరు నాట్యముకన్న బహుళప్రాచీనమైనదని నిరూపణచేసి ఉన్నతస్థితికి తేవలసినబాధ్యత కళోపాసకులు, కళాభిమానులు అయిన ఆంధ్రులందరిమీద వున్నది. ఆంధ్ర నాట్య ప్రశస్తిని చిరస్థాయిగ చేయుదుమని భావించుచున్నాను ★

ఉపనయనం

శ్రీ నిప్పాణి శ్రీనివాసరావుగారు తమ కుమారుడు చి॥ గిరిధర్ కు (సినీనటి జమున తమ్ముడు) ఈ నెల 5 ఉదయం, గాంధీనగర్ లో తమ నూతన గృహంలో ఉపనయనం జరిపించారు. పలువురు నటీనటులూ, నిర్మాతలూ, వచ్చి వటువును ఆశీర్వదించారు.

రచయితల సమితి బహుమతి

హాలీవుడ్ చలనచిత్ర రచయితల సమితి, 1957 లో ఉత్తమమైన స్క్రిప్టు రచనకు రెజినాల్డ్ రోజ్ అనే రచయితకు బహుమతి ఇచ్చారు. "12 యాంగ్రీమన్" అనే చిత్రానికి (ఆంధ్ర వారపత్రిక మే 7 వ తేది సంచిక చూడండి) ఈయన వ్రాసిన స్క్రిప్టే ఈ బహుమతికి కారణం.

సంగీత చిత్రాలలో 'లేగర్ల్స్'కు స్క్రిప్టు వ్రాసిన జాన్ పాట్రిక్, హాస్య చిత్రాలలో 'లవ్ ఇన్ ది ఆఫ్టర్ నూన్' చిత్రానికి రచన చేసిన బిలివైల్డర్ (దర్శకుడు), ఐ. ఎ. ఎల్. డైమండ్ లకు కూడా బహుమతులు ఇచ్చారు. గారీకూపర్, ఆడ్రేహెప్ బర్న్, మారిస్ కెవాలియర్ నటించిన 'లవ్ ఇన్ ది ఆఫ్టర్ నూన్' త్వరలోనే మద్రాసులో విడుదల కాబోతోంది.

* * *

'టిప్పుసుల్తాన్.' చిత్రంలో ముఖ్యపాత్రను జైరాజ్ నిర్వహిస్తున్నాడు. ఇతర నటులు అనితాగుహ, సురేష్, కృష్ణకుమారి, రూప్ మాల, రామ్ మోహన్, కాబూలీ.

సంగీతం బతీష్. దర్శకుడు జగదీష్ గౌతమ్.

★ సమానాంతర జీవితరేఖలు ★

బలగాన్నంతటినీ వాళ్ళదగరకు పంపించి ఓ రెండేళ్ళపాటుంచండి!- అప్పుడు తెలుస్తుంది వాళ్ళ మంచితనం!- మీ అన్నయ్యలున్నారే తమరూ ఉంటే, మా పిల్లా మీ అమ్మపిచ్చి విషయమై నోరెత్తికపోయుండేది!—" అని అన్నాడు మా మామ!—

"అంటే మమ్మల్ని వేరయిపోమనికదూ మీ రనేది?"

"అది కాదయ్యా స్వామి!- మీ పిచ్చి తల్లిని అక్కడనుంచి పంపించేయుమని! మీ వదినలు ఆమె పిచ్చిది కాదని అంటున్నారని కదూ అంటున్నావు; అంచేత వాళ్ళదగ్గరకే పంపించు—"


"ఛీ!- మీరింత అమర్యాదస్థులని ముందే తెలుసే మీ పిల్లను చేసుకోకపోయుండే వాడిని!"

"మీ అమ్మ ఇంత పిచ్చిదనే విషయం ముందే తెలిస్తే మా చెల్లిని మీ కిచ్చుండే వాళ్ళం కాదు. మోసపోయి మీ కిచ్చేము. ఇప్పుడూ మేమూ విచారిస్తున్నాము!" అన్నాడు మా బావ.

ఏరకంగా వాదించినా మరిక లాభం లేదన్న సంగతి తేలిపోయింది. చక్కా బయలుదేరి మా ఊరొచ్చేసేను.

ఈ విషయమై తరు మనుష్యుల ముందు తగూ పెటినా మాకే నష్టం. మా అమ్మ పిచ్చి విషయమై ప్రశ్న ఉదయిస్తుంది. మెడికల్ ఎగ్జామినేషన్ చెయించాలని వాళ్ళు పట్టుబడతారు. అప్పుడు మా అమ్మ బాగా పిచ్చిదనే విషయం వాళ్ళని మధ్య నిర్ధారణయిపోతుంది. అప్పుడు మరీ చిక్కు పరిస్థితి ఏర్పడుతుంది.

మా నాన్న ధోరణి మరీ వికారంగా మారిందిప్పుడు. "దాన్ని ఒదిలేరా?" అంటున్నాడు. ఏదో చిన్నబొమ్మనుకున్నాడు కాబోలు. స్త్రీరత్నకవసరమయిన చటాలన్నీ ఈ వాదువ్నాయన్న సంగతి మా నాన్నకు బహుశా తెలీదేమో.




అజంతా గుహాల బాహ్యాన్వాపం

—ఫోటోలు: నిమ్మగడ్డ బాబు రాజేంద్రప్రసాద్]

ఇంతకీ మా నాన్నకి బుద్ధీ జ్ఞానం శూన్యం. నా సుఖంగురించి అతనికే విచారం కలగ లేదింతవరకూ. ఒక్క ఇల్లు తప్పిస్తే ఆ ఊళ్లో ఇంకే ఆస్తీ లేదు. ఉద్యోగం అసలే లేదు! పొల్లుకబుర్లు చెప్పుకుంటూ అందర్నీ విమర్శిస్తూ పెద్దపెద్దలను చేరదిసి కబుర్లాలోచనలు చెయ్యడం మా నాన్న దినచర్య.

విషయమంతా తెలిసీకూడా నా అన్నదమ్ములందరూ కమలనే విమర్శించుతున్నారు. అది రాక్షసట! దాన్ని వరికేసినా పాపం లేదట!- పెళ్ళాన్ని అదుపాజ్ఞలలో నుంచుకొనే తెలివితేటలు నాకు లేవుట! అంచేతే దాని కంతలా కొమ్ములొచ్చేయట.!ఏం?- ఈ కుటుంబం అంతటి మీదా అంత అభిమానం ఏదుసే ఈ బలగాన్నంతటినీ తర్లించుకు పోకూడదూ?. తమ పెళ్ళాలచేత చాకిరీ చేయించకూడదూ?- అందుకు మాత్రం ఇష్టపడరువాళ్లు తెగ స్వార్థపరులు వాళ్లు!

ఇంతకీ మా నాన్న అక్కడి కెళ్ళడానికిష్టపడడు. మా అమ్మని పంపించడు. అంతా నా పీకకు ఉరిలా తగులుకున్నారు...నన్ను చంపి, తను చస్తాడు. మా అన్నయ్యల దగర మా నాన్న ఆటలేవీ సాగవు. మా అమ్మని కూడా కట్టుబాట్లలో ఉంచుతారు వాళ్ళు! నాలాగ నెలా అయేసరికి వాళ్ళ జీతాలను తెచ్చి మా నాన్న చేతిలో కుమ్మరించరు. ఏదో వేళకింత తిండి పడేస్తారు. అది తిని నోరు మూసుకొని కూర్చోవలసిందే. వాళ్ళ దగ్గర తమకేమి స్వేచ్ఛాస్వాతంత్ర్యాలుండవు అంచేతే మా నాన్న ఏ పరిస్థితిలోనూ వాళ్ళ దగ్గర కెళ్ళడానికి కిష్టపడడు.



అజంతా గుహలున్న కొండలు; వాటిమీాది చిట్టడవి



విశాఖపట్నంలో ఇటీవల జరిగిన నాటక పోటీలలో బహుమతి తెచ్చుకున్న బాలనటి బేబీ రత్నపాప

సమానాంతర జీవితరేఖలు

ఏం!- మా అమ్మా నాన్నా మా పెద్దన్నయ్య దగర కెళ్ళి ఉండరాదూ? చెల్లెళ్ళూ, తమ్ముళ్ళూ నా దగ్గరుండి చదువుకుంటారు. ఇంతకీ నలుగురి దగ్గరకీ సర్దుకొని తిరుగుతే అందరికీ హాయిగా ఉంటుంది. ఇంతకీ మా నాన్న ఒట్టిమొండి ఘటం!- అతన్ని ఎదిరించి మాట్లాడే ధైర్యం నాకు లేదు.

యదార్థానికి మా అమ్మ ఏకోడలు దగరున్నా ఆ కోడలికి బాధే. నా ఉద్దేశ్యం ఏమిటి అంటే మా అమ్మని మా అక్కయ్య, దగ్గరుంచడం అన్ని విధాలా శ్రేయస్కరం, మా అక్కయ్యకు భర్త తరఫున మరెవ్వరూ లేరు. మా బావకూడా చాలా మంచివాడు. ఇనాం బిలు ధర్మమా అని వాళ్లు భూములన్నీ పోయేయి. చదువూ సంధ్యా లేగు. ప్రస్తుతం ఆర్థికంగా చాలా బాధపడుతున్నాడు. అక్కడ మా అమ్మనుంచి నలుగురన్నదమ్ములం తలో పాతికా పంపుతూ ఉంటే వాళ్లికకూడా బాగా కాలక్షేపం అవుతుంది. కన్నతల్లి కాబటి మా అమ్మకు హృదయపూర్వకమయిన సేవచేస్తుంది మా అక్కయ్య. ఈ విషయంలో మా బావకూడా ఏమీ అభ్యంతరం తెలుపడు.

కానీ ఇదంతా జరిగే విషయం కాదు. మా నాన్న ఇలా జరగనివ్వడు

మా నాన్న దోరణి నన్ను మరింత బాధపెట్టేదిగా ఉంది!- "ఎలా పంపరో చూస్తాను. నువ్వో చాతకాని దద్దమ్మవి; కాబట్టే వాళ్ళకింత అలుసుగా ఉంది. నోటీసిప్పిస్తాను!" అంటున్నాడు.

జీవితంలో అన్ని ఆనందాలనూ అప్పుడే అనుభవించేసేడు మా నాన్న, మా అమ్మ అంటే ఇప్పటికీ మా నాన్నకెంతో ప్రేమ. కానీ ఆరకంగా నేనూ నా భార్యను ప్రేమించడం మా నాన్నకిష్టంలేదు. ఇంతకీ నేను కమలా అన్ని విధాలా దురదృష్టవంతులం. మా నాన్న మా ఇదరి జీవితాలనూ ఎడంచేసి సమానాంతర రేఖా మార్గాలలో విడిచిపెటి పెత్తనం చెలాయిస్తున్నాడు.

బహుశా మా యౌవనమంతా ఈ విధంగా అడివిన గాచిన వెన్నెల చందంగా గడచి పోవలిసిందే కాబోలు!— ★

లోకంతీరు

(10-వ పేజీ తరువాయి)

యంలో—కొంచెం యిబ్బంది పడే స్థితికి వచ్చేశారని వారికి తెలిసిందంటే చాలు—ఒక్క స్నేహితుడు కూడా కనిపించడు! ఊళ్ళోవున్న స్నేహితులు మీ కళ్ళకి కనిపించకుండా తప్పించుకు తిరుగుతారు! పొరుగూళ్ళలోవున్న స్నేహితులు—ఉత్తరం రాస్తే మూడుకోసులు దండగ! వీడి మొహానికి ఉత్తరం కూడా ఎందుకు? అని కూడా అనుకోంటారు! డియర్, డియరెస్ట్ ఫ్రెండ్స్! తెలుసుకోండి ఈ నిజం! కేవలం—మీరు సుఖ, సంతోషాలు అనుభవిస్తున్న సమయంలో అలంకారార్థం మాత్రమే ఈ స్నేహితుల గుంపు! ఈ నిజాన్ని గనక మీరు అర్థంచేసుకో కలిగితే ఎటువంటి వారితో నైనాసరే, ఎంతమందితో నైనా సరే మీరు స్నేహంగా వుండగలరు! ఆ స్నేహం శాశ్వతంగా వుండాలంటే ఇంకో చిన్న రహస్యంకూడా వుంది!

'స్నేహితులని పొగడటం ప్రారంభించాలి కాబోలు?' అనిపిస్తుంది మీకు.

'అదేం కాదులెండి! ఇంద్రుడని, చంద్రుడని, ఘటనాఘటన సమర్థుడని స్నేహితుల్ని పొగడటం—అంతా, తుప్పుపట్టిన మేకులకి, చీలలకి నూనెరాయటంలాంటిది! చేసిన స్నేహం శాశ్వతంగా వుండాలంటే రహస్యం ఒకటి వుందనేది నేను కనిపెట్టిన విద్యేలెండి!

మా ఆవిడకు వనజ, గిరిజ అని ఇద్దరు స్నేహితులున్నారు. కాని వాళ్ళు ముగురూ కలసి మాట్లాడుకోవటం నేను ఎప్పుడూ




సోదెవుర్నాయి!

—ఫోటో: బి. సుందరి, మద్రాసు]

కూడా చూడలేదు! ఒక్కొక సందర్భంలో మా ఆవిడ, వనజ ప్రాణస్నేహితులైపోతారు. మరొక సందర్భంలో వనజ, గిరిజలు కవల పిల్లలై పోతారు! మా ఆవిడతో ఒక్కమాట కూడా మాట్లాడరు! మరింకో సందర్భంలో మా ఆవిడా, గిరిజలు ఒకళ్ళను విడిచి మరొకళ్లు ఒక్క క్షణంకూడా ఉండలేరేమో అనిపిస్తుంది. అయితే, ఆ ముగురిలోనూ ఇద్దరు కలుసుకొన్నప్పుడు, ఆ మూడో వ్యక్తిని గర్భశత్రువులాగే చూసేవాళ్ళు! ఎప్పుడు చూసినా మూడో వ్యక్తిని దూషించటమే మిగిలిన యిద్దరికీ పని! ఈ వ్యవహారం అంతా చూసిన నాకు అసలు రహస్యం అరమయిపోయింది! ఇద్దరుగనక స్నేహంగా వుండాలంటే, ఆ యిద్దరికీ మధ్య ఒక శత్రువు తప్పనిసరిగా వుండాలన్నమాట! అంతెందుకు—! భార్యతో భర్త అన్యోన్యంగా వుండాలంటే భార్యకు ఇష్టంలేని వ్యక్తులనుగురించి—కనీసం ఒక్కరినిగురించి—భర్త ఆ సమానూ విసుక్కొంటూ తిట్టుకొంటూ సంచరించినట్లయితే—ఆ భార్యామణిగారు భర్తను అమాంతంగా, గట్టిగా ముద్దెట్టేసుకొంటుంది! ఎందుకు అంత నవ్వుతారు? నిజమో, అబద్ధమో ప్రాక్టికల్ చేసి చూడండి—మీకే తెలుస్తుంది!

[—వచ్చేవారం మరొకటి]

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street Madras-1 Editor S. Sambhu Prasad



మహిషాసురమర్దని శిల్పం

ఫొటో: ఎం. శ్రీనివాసన్, మద్రాసు

మీచర్మ సౌందర్యమును

సినీమా తారవలె ఉంచుకోండి!

మీరు సినీమా తార అయివుండినట్లయితే—మీ చర్మ సౌందర్యము, ప్రతిరోజూ, తెరమీదగాని, బయటగాని, రోజల్లా వనవనలాడుచూ, సొగసుగాను, మనోహరముగాను ఉండవలసియున్నట్లయితే, మీరు సొగసైన సావిత్రి చేసినట్లు చేసియుందురు. "నా చర్మమును పరిశుభ్రముగాను మృదువుగాను, వుంచుకొనుటకు నాకు లక్స్ టాయిలెట్ సబ్బుయొక్క సమృద్ధమైన పరిమళమగు నురగయందే నమ్మిక—నా సౌందర్యము కోసం. నేను దానినే ప్రతిరోజూ వాడుచున్నాను." అని ఆమె చెప్పుచున్నది.

సొగసైన సావిత్రివలె ఉండండి—
మీ సౌందర్యము కోసం లక్స్
టాయిలెట్ సబ్బును ఎన్నుకోండి.





సావిత్రి, ఆర్. ఆర్. పిక్చర్స్ వారి 'కాతవరాయన్' చిత్రంలో సొగసైన తార.

శుద్ధమైన, తెల్లని

లక్స్ టాయ్‌లెట్ సబ్బు

సినీమా తారందు సౌందర్యము నిచ్చు నది